Follow: @ANNTELUGU

10-03-2025

# మహా పత్రిక

సోమవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 98 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




# కప్పు కొట్టేశాం

## రోహిత్ శర్మ సారథ్యంలో అద్వితీయ విజయం



- మనమే తిరుగులేని ఛాంపియన్స్
- అప్రతిహత విజయాలతో ఫైనల్ లో పాతికేళ్ల లెక్క సెట్ చేసిన టీమిండియా
- అదరగొట్టిన రోహిత్ శర్మ, శ్రేయాస్, అక్షర్
- టీమిండియాకు ప్రధాని మోదీ, రాహుల్, సీఎం రేవంత్ , మహేష్ గౌడ్, కిషన్ రెడ్డి అభినందనలు
- దేశవ్యాప్తంగా సంబురాలు.. బాణాసంచా కాల్చిన అభిమానులు

08

**మహా నెట్ వర్క్:** టీమిండియా చరిత్ర సృష్టించింది. పటిష్టమైన న్యూజిలాండ్‌ను ఓడించి సగర్వంగా ఛాంపియన్స్ ట్రోఫీని సాధించింది. పాతికేళ్ళపగ తీర్చుకుంది. రోహిత్ శర్మ సారథ్యంలో వరుసగా రెండో ఐసీసీ ట్రోఫీని గెలుచుకుంది. కోట్లాది మంది అభిమానులను మురిపించింది. టీమిండియా విజయానికి అభిమానులు ఉప్పొంగిపోయి దేశవ్యాప్తంగా సంబురాలు చేశారు. ఒకదశలో ఉత్కంఠ కలిగించినా ఛాంపియన్స్ ట్రోఫీ ఇండియా సొంతం అయింది. భయపెట్టినా కప్ ను మాత్రం టీమ్ ఇండియా కైవసం చేసుకుంది. రోహిత్ తరువాత వచ్చిన బ్యాట్స్ మెన్ వరుసగా వికెట్లు పోగొట్టుకోవడంతో మ్యాచ్ ఓడిపోతారేమో అన్న అనుమానాలు మొదలైన సమయంలో.. అవి మరింత బలపడకుండా కూల్ గా టీమిండియా బ్యాట్స్ మెన్లు పని కానిచ్చేశారు. పిచ్ స్పిన్నర్లకు అనుకూలంగా ఉండడంతో బ్యాట్స్ మెన్ కు కాస్త కష్టంగా మారింది. మొదట బ్యాటింగ్ చేసినవాళ్ళకు కాస్త బాగానే ఉన్నా...లక్ష్య ఛేదనకు వచ్చిన ఇండియాకు మాత్రం బ్యాటింగ్ చేయడం చాలా కష్టమైంది. స్పిన్ బాగా తిరుగుతుండడంతో భారత బ్యాటర్లు ఆడటం ఇబ్బంది అయింది. పరుగులు రాబట్టకోవడం మాట అటుంచి...వికెట్ ను కాపాడుకోవడమే పెద్ద పని అయింది. కానీ మొత్తానికి భారత బ్యాటర్లు ఏ దశలోనూ ప్రత్యర్థికి మ్యాచ్ అప్పగించకుండా.. అదరగొట్టారు. అద్వితీయ విజయాన్ని అందించారు. అందుకే దేశమంతా జయహో టీమిండియా అంటూ జేజేలు పలుకుతోంది.



# ఎమ్మెల్సీగా విజయశాంతి

## ముందే చెప్పిన మహా


అద్దంకి, శంకర్ నాయక్ లకు కాంగ్రెస్ ఛాన్స్

సిన్సియారిటీ.. సీనియారిటీకి పట్టం

ఎమ్మెల్సీల ఎంపికలో మీనాక్షి మార్క్.. పూర్తిగా హైకమాండ్ సెలక్షన్

నేడు అసెంబ్లీ ఆవరణలో నామినేషన్లు వేయనున్న అభ్యర్థులు.. నేడు నామినేషన్లు

**హైదరాబాద్, మహా:** ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంపికలో ఎఐసిసి ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్ మార్క్ కనిపించింది. విధేయతకు పట్టం కట్టింది. మహా పత్రిక ముందుగానే చెప్పినట్లు విజయశాంతికి ఛాన్స్ దక్కింది. అనూహ్యంగా తెరపైకి వచ్చి ఎమ్మెల్సీ అవకాశాన్ని విజయశాంతి అందిపుచ్చుకుంది. మోస్ట్ ఎలిజిబుల్ లీడర్ గా ముందునుండీ ప్రచారంలో ఉన్న అద్దంకి దయాకర్ కు ఎట్టకేలకు అవకాశం లభించింది. నల్లగొండ డిసిసి అధ్యక్షుడు శంకర్ నాయక్ కు కూడా బంజారా కోటాలో అవకాశం లభించింది. సీనియారిటీకి, సిన్సియారిటీకి హైకమాండ్ పెద్దపీట వేసింది. పైరవీలకు తావులేకుండా.. విమర్శలకు చోటు లేకుండా ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో హైకమాండ్ వ్యవహరించింది. మిగతా 2లో



# వైభవంగా ఐఫా అవార్డుల సంబరం

## అందాల తారల మెరుపులు

ఉత్తమ నటిగా కృతి సనన్

ఉత్తమ సిరీస్‌గా పంచాయత్ సీజన్ 3

**మహా:** భారతీయ సినీపరిశ్రమలో విశేషంగా భావించే ఐఫా అవార్డుల వేడుక కన్నుల పండగగా జరిగింది. పింక్ సిటీ జైపూర్ వేదికగా రెండు రోజులపాటు ఈ కార్యక్రమం జరగ్గా.. మొదటి బాలీవుడ్ సినీతారలు, రాజకీయ ప్రముఖులు సందడి చేశారు. ఇందుకు సంబంధించిన ఫోటోస్, వీడియోస్ వైరలవుతున్నాయి. సినీరంగంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే ఐఫా అవార్డుల ప్రధానోత్సవ వేడుక శనివారం రాత్రి అట్టహాసంగా జరిగింది. జైపూర్ వేదికగా జరిగిన ఈ వేడుకలో మొదటి రోజు బాలీవుడ్ స్టార్స్ పాల్గొన్నారు. ఈ వేదికపై పంచాయత్, అమర్ సింగ్ చమ్కిలా సినిమాలు అనేక అవార్డులు గెలుచుకున్నాయి. ఈ ఏడాది ఐఫా అవార్డుల వేడుకలకు బాలీవుడ్ స్టార్ కార్తీక్ ఆర్యన్ హోస్టింగ్ చేస్తున్నారు. కరీనా కపూర్ ఖాన్ 25వ ఐఫా ఎడిషన్‌లో ప్రదర్శన ఇచ్చారు. అలాగే ఆమె తాత దిగ్గజ చిత్రనిర్మాత రాజ్ కపూర్‌కు అవార్డుల ప్రదానోత్సవంలో నివాళులర్పించారు. మిగతా 2లో



# దేశ చరిత్రలో చారిత్రాత్మకం

## 55 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ళకు 11,600 కోట్లు విడుదల

విద్యా శాఖ ఉత్తర్వులు జారీ

మంత్రులు కోమటిరెడ్డి, పొంగులేటితో కలిసి వివరాలు వెల్లడించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

సీఎం ఆదేశాలతో ఖమ్మం జిల్లా ఎంపీ, ఎమ్మెల్యేలతో సమీక్ష

**హైదరాబాద్, మహా :** అంతర్జాతీయ ప్రమాణాలతో 55 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణానికి 11,600 కోట్ల రూపాయలు కేటాయిస్తూ ప్రజా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం దేశ చరిత్రలోనే చారిత్రాత్మకమైనదని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం మినిస్టర్ క్వార్టర్స్ లోని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నివాసంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి మిగతా 2లో

# కులగణనపై కుట్రలు తిప్పి కొట్టండి



## మాకు రైతన్న.. నేతన్న రెండు కళ్ళు

- పద్మశాలీల అభ్యున్నతే ప్రభుత్వవిధానం
- తెలంగాణ ఉద్యమంలో పద్మశాలీలదే ప్రధానపాత్ర
- గత పాలకులకు జోలెలో ఓట్లువేసి నీడనిచ్చింది పద్మశాలీలే
- అఖిల భారత పద్మశాలి మహాసభలో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మహా :** పద్మశాలిలు ఆర్థిక, రాజకీయ, ఉపాధి, ఉద్యోగ పరంగా అభివృద్ధి చెందేలా క్రియాశీలక నిర్ణయాలు తీసుకునేందుకు మా ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మా ప్రభుత్వం రైతన్నలకు ఎంత ప్రాధాన్యత ఇస్తున్నామో నేతన్నలకూ అంతే ప్రాధాన్యత ఇవ్వాలన్న విధానపరమైన నిర్ణయంతో పని చేస్తున్నదన్నారు. మిగతా 2లో

# ఎమ్మెల్సీగా విజయశాంతి



(మొదటిపేజీ తరువాయి)

కరీంనగర్ ఎమ్మెల్సీ ఓటమిపై ఆగ్రహంగా ఉన్న.. హైకమాండ్ నేతల సిఫార్సులకు ఛాన్స్ ఇవ్వలేదు. శంకర్ నాయక్ జానారెడ్డి శిష్యుడు కాగా, అద్దంకి దయాకర్ కూడా జానారెడ్డి, కోమటిరెడ్డిని ఎంపికకు ముందు కలిశారు. మూడు స్థానాల్లో రెండు.. నల్లగొండ నేతలకే దక్కాయి. ఈ ఎంపిక కాంగ్రెస్ క్యాడర్ లో సంతోషాన్ని నింపింది. కష్టపడే వారికి, పార్టీ విధేయులకు అవకాశాలు లభిస్తాయన్న సంకేతాన్ని పార్టీ అందించింది. ముఖ్యమంత్రి మిత్రుడు వేం నరేందర్ రెడ్డికి స్థానం దక్కుతుందని ముందునుండీ ప్రచారం జరిగినా, అగ్రవర్ణాలకు ఈ దఫా అవకాశం ఇవ్వకూడదని పార్టీ నిర్ణయించడం, సిపిఐకి ఒక సీటు ఇవ్వడంతో చివరినిమిషంలో మిస్ అయింది.

**సీఎం, కీలక నేతలతో చర్చించి**

అభ్యర్థుల ఎంపిక కోసం ఏఐసీసీ పెద్దలు రాష్ట్ర నాయకులతో కీలక చర్చలు జరిపారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ రాష్ట్ర ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షీ నటరాజన్ లతో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ముఖ్య చర్చలు జరిపారు. అనంతరం ఆదివారం సాయంత్రం అభ్యర్థులను ఖరారు చేస్తూ కాంగ్రెస్ అధిష్టానం ప్రకటన విడుదల చేసింది. అయితే ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ కు 4 స్థానాలు దక్కినప్పటికీ.. అసెంబ్లీ ఎన్నికల్లో మద్దతుగా నిలిచినందుకు ఇచ్చిన హామీమేరకు సీపీఐకి ఒక స్థానాన్ని కాంగ్రెస్ కేటాయించింది. ముఖ్యమంత్రికీ, ఇతర నేతలందరికీ ఆమోదయోగ్యమైన వారికే పదవులు దక్కాయి. త్వరలో మంత్రివర్గ విస్తరణ కూడా జరుగుతుందని ఈ ఎంపిక ద్వారా అధిష్టానం సంకేతాలు ఇచ్చింది.

**కౌన్సిల్ లో కాంగ్రెస్ కు బలమైన గొంతులు**

తాజా ఎంపికలతో కాంగ్రెస్ పార్టీకి శాసనమండలిలో బలమైన గొంతులు తోడుగా నిలవనున్నాయి. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమనేత ప్రొఫెసర్ కోదండరాంను ఎమ్మెల్సీగా ఎంపిక చేయగా, ఇపుడు వాగ్దాటి కలిగిన అద్దంకి దయాకర్ ను, పార్లమెంట్ లో తెలంగాణ కోసం తన గళాన్ని గట్టిగా వినిపించిన విజయశాంతిలను ఎంపిక చేయడంతో కౌన్సిల్ కు కొత్త కళ రానుంది.







# కులగణనపై కుట్రలు తిప్పికొట్టండి

(మొదటిపేజీ తరువాయి)

ఆదివారం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ లో అఖిల భారత పద్మశాలి మహాసభకు ముఖ్యఅతిథిగా సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, టీజీఎండీసీ చైర్మన్ ఈరవత్రి అనిల్ , పద్మశాలీ సంఘ నాయకులు సుధారాణి, తదితరులు హాజరై ఈ కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ.. పద్మశాలీలు ఆత్మగౌరవంలోనే కాదు, త్యాగంలోనూ ముందుటారని అలాంటి పద్మశాలీలను గత బీఆర్ఎస్ ప్రభుత్వం విస్మరించిందని ధ్వజమెత్తారు. టైగర్ నరేంద్ర త్యాగం లేకుండా మలిదశ తెలంగాణ ఉద్యమం ముందుకు సాగలేదనేది నిజం అన్నారు. అలాంటి ఆలె నరేంద్రను కాంగ్రెస్ పార్టీ కేంద్ర మంత్రిగా చేస్తే కేసీఆర్ అనే ధృతరాష్ట్రుడు ఆలె నరేంద్ర పార్టీని బీఆర్ఎస్ లో విలీనం చేసుకోవడమే కాకుండా ఆయనను ఖతం చేసిన కథ పద్మశాలీలందరికీ తెలుసన్నారు. కాంగ్రెస్ పార్టీ పద్మశాలీలను రాజకీయంగా ప్రోత్సహించిందన్నారు. ఏ మాత్రం అవకాశం వచ్చినా పద్మశాలీలను అభ్యున్నతే లక్ష్యమే మా ప్రభుత్వం విధానం అన్నారు.

**ఆసిఫాబాద్ మెడికల్ కాలేజీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు**

బీఆర్ఎస్ పెట్టినప్పుడు నీడ కల్పించిన కొండా లక్ష్మణ్ బాపూకు కేసీఆర్ నిలువ నీడ లేకుండా చేశారని ఆయన చనిపోతే కనీసం చూడటానికి వెళ్లలేదని మండిపడ్డారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక తెలంగాణలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ లేదు. గత ప్రభుత్వం ఆ ప్రయత్నమూ చేయలేదు. మేము అధికారంలోకి వచ్చాక కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి ఐఐహెచ్‌టీ సాధించడమే కాకుండా దానికి కొండా లక్ష్మణ బాపూజీ పేరు పెట్టుకున్నాం. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆదర్శమూర్తిగా నిలిచిన లక్ష్మణ్ బాపూజీ పేరును ఆసిఫాబాద్ మెడికల్ కాలేజీకి పెడతామని ప్రకటించారు. తెలంగాణ సాధన, తెలంగాణ నిర్మాణంలో పద్మశాలీలది గొప్ప పాత్ర అని కొనియాడారు. గత పాలకుల కుటుంబాలు జోలె పెట్టుకుని సిరిసిల్లకు వస్తే ఆ జోలెలో ఓట్లు, నోట్లు వేసి వారికి రాజకీయ నీడ ఇచ్చింది పద్మశాలిలు కాదా అన్నారు.

**మార్కండేయ భవనం నిర్మాణానికి రూ.కోటి**

మహారాష్ట్రలోని షోలాపూర్ లో మన పద్మశాలీలు చాలా మంది ఉన్నారని అక్కడ పద్మశాలీ ఆత్మగౌరవాన్ని నిలిపేలా మార్కండేయ భవనం నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం కోటి రూపాయలు ఇచ్చి సహకరిస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. పద్మశాలిల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ముందుకు వెళ్తున్నానని సీఎం చెప్పారు. మీ సోదరుడు రేవంత్ అన్న ముఖ్యమంత్రిగా ఉన్నారు. మీకు కావాల్సిన పనులు చేయించుకోండి. చేయించుకోకపోతే అది మీ తప్పే అవుతుంది. మీరు అడిగింది ఇవ్వడం నా కర్తవ్యం అన్నారు. మీ అభివృద్ధికి కావాల్సిన ప్రణాళికలతో రావాలని వాటిని ఆమోదించే బాధ్యత నాది అని చెప్పారు. తెలంగాణకు రెండో ముఖ్యమంత్రిగా అత్యంత చిన్న వయసులో నాకు ఈ పదవి వచ్చింది. మీ అభిమానాన్నే నేను ఆశిస్తున్నాను. మీరు నన్ను గుండెల్లో పెట్టుకోడి మీ అభివృద్ధిలో భాగస్వామిని అవుతానన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పద్మశాలీలు ఉత్పత్తి చేసిన బతుకమ్మ చీరల బిల్లులు బకాయిలు పెట్టి ప్రభుత్వాన్ని మాకు అప్పగించిందన్నారు. గత ప్రభుత్వం నాసిరకమైన బతుకమ్మ చీరలను పంపిణీ చేసింది. మేము వచ్చాక ఆ ఆర్డర్లను రద్దు చేస్తే నేతన్నలు ఇబ్బందులు పడతారని టీజీఎండీసీ చైర్మన్ ఈరవత్రి అనిల్, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అధికారులు నా దృష్టికి తీసుకువచ్చారు. దాంతో ఈ రాష్ట్రంలోని 65 లక్షల మంది మహిళా సంఘాల సభ్యులకు ఏడాదికి రెండు చీరలు ఇచ్చేలా ఒక కోటి 30 లక్షల చీరలు పద్మశాలీలకు ఆర్డర్ ఇచ్చామన్నారు.

**కులగణనపై కుట్రలు తిప్పికొట్టాలి**

కులగణనను పురిటిలోనే గొంతునొక్కాలని కొంత మంది కుట్ర చేస్తున్నారని సీఎం ఆరోపించారు. ఆ కుట్రదారులను తిప్పికొట్టాలని మీ శక్తి, యుక్తిని ప్రదర్శించి నాకు అండగా నిలబడాలన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించి చూపిస్తానన్నారు. మా లెక్కలపై బీఆర్ఎస్, బీజేపీలు విమర్శలు చేయడం కాదని ఎక్కడ తప్పులు ఉన్నాయో చూపించాలని అసెంబ్లీలో సవాల్ విసిరితే తోకముడిచారన్నారు. బలహీన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు చట్టబద్ధం అయితే అది కేంద్రంలో నరేంద్ర మోదీ మెడ మీద కత్తిలా మారుతుందని అందుకే బీఆర్ఎస్, బీజేపీ కలిసి తొండి విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు.




# వైభవంగా ఐఫా అవార్డుల సంబరం

(మొదటిపేజీ తరువాయి)

**విజేతలు వీరే:**

- ఉత్తమ చిత్రం: అమర్ సింగ్ చంకీలా
- ఉత్తమ నటుడు: విక్రాంత్ మస్సే (సెక్టార్ 36)
- ఉత్తమ నటి: కృతి సనన్ (దో పత్తి)
- ఉత్తమ దర్శకుడు: ఇంతియాజ్ అలీ (అమర్ సింగ్ చంకీలా)
- ఉత్తమ సహాయ నటుడు: దీపక్ (సెక్టార్ 36)
- ఉత్తమ సహాయ నటి: అనుప్రియా గోయెంకా (బెర్లిన్)
- ఉత్తమ కథ: కనికా ధిల్లాన్ (దో పత్తి)
- ఉత్తమ సిరీస్: పంచాయత్ సీజన్ 3
- ఉత్తమ నటుడు: జితేంద్ర కుమార్ (పంచాయత్ సీజన్ 3)
- ఉత్తమ నటి: శ్రేయాచౌదరి (బందీశ్ బందిట్స్ సీజన్ 2)
- ఉత్తమ దర్శకుడు: దీపక్ కుమార్ మిశ్రా (పంచాయత్ సీజన్ 3)
- ఉత్తమ సహాయ నటుడు: ఫైజల్ మాలిక్ (పంచాయత్ సీజన్ 3)
- ఉత్తమ సహాయ నటి: సంజీదా షేక్ (హీరామండి: ది డైమండ్ బజార్)
- ఉత్తమ కథ: కోటా ఫ్యాక్టరీ సీజన్ 3
- ఉత్తమ రియాల్టీ సిరీస్: ఫ్యాబ్యులెస్ లైవ్స్ ఆఫ్ బాలీవుడ్ వైఫ్స్
- ఉత్తమ డాక్యుమెంటరీ ఫిల్మ్: యో యో హనీ సింగ్: ఫేమస్

# రాష్ట్రానికి కేంద్రం ఇచ్చింది గుండుసున్నా

## ఎంపీ బల్ రాం నాయక్



**మహా :** కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి ఇచ్చింది గుండుసున్నా అని మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ విమర్శించారు. ఆదివారం మినిస్టర్ క్వార్టర్స్‌లో ఎంపీ బలరాం నాయక్ మీడియాతో మాట్లాడుతూ, ఆల్ పార్టీ ఎంపీల సమావేశానికి హాజరు కావాలని బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలకు ఫోన్లు చేసి తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సమాచారం ఇచ్చారని గుర్తుచేశారు. బీజేపీ, బీఆర్ఎస్ నేతలు తూతూ మంత్రంగా చెప్పారని అనడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. పదే పదే ఢిల్లీకి సీఎం రేవంత్‌రెడ్డి వెళ్తున్నారని బీజేపీ, బీఆర్ఎస్ నేతలు ప్రశ్నిస్తున్నారని చెప్పారు. సీఎం, మంత్రులు ఢిల్లీకి ఎందుకు వెళ్లారో ఏ ఏ ప్రాజెక్టులు తెలంగాణకు కావాలని కేంద్ర ప్రభుత్వ పెద్దలను అడిగారో ఎంపీ బలరాం నాయక్ వివరించారు. తెలంగాణ అభివృద్ధి కోసం నిన్నటి సమావేశానికి కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఎందుకు రాలేదని ఎంపీ ప్రశ్నించారు. బీజేపీ, బీఆర్ఎస్ రెండు పార్టీలు ఒక్కటేనని, కలిసి డ్రామాలు ఆడుతున్నాయని ధ్వజమెత్తారు. బీజేపీ, బీఆర్ఎస్ రెండు పార్టీల నుంచి ఎవరో ఒక్కరూ నిన్న జరిగిన ఎంపీల సమావేశానికి వస్తారని అనుకున్నామని చెప్పారు. బీజేపీ, బీఆర్ఎస్ రెండు పార్టీల నేతలకు ప్రజల సమస్యలు పట్టవన్నారు. కాంగ్రెస్ మీద కుట్రలు చేయడం తప్ప ఆ రెండు పార్టీల నేతలకు వేరే పని లేదని విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి కేటాయింపులు చేయకుండా తెలంగాణ ప్రభుత్వాన్ని ఇబ్బందులు పెడుతున్నారని ఎంపీ ఫైర్ అయ్యారు. సీఎం రేవంత్ రెడ్డి మీద బీజేపీ నేతలు నిందలు వేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ప్రజా భవన్‌లో సమావేశం పెడితే అధికారులు కూడా వస్తారని చెప్పారు. ప్రజా భవన్ అందరిదీ ఏ పార్టీ ఎంపీలు అయిన రావచ్చని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేసిన అప్పులకు వడ్డీలు కడితే కొత్త అప్పులు ఇస్తామని కేంద్ర ప్రభుత్వం కొర్రీలు పెడుతోందని ఆగ్రహించారు. తెలంగాణ అభివృద్ధిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఇంటికి కూడా వెళ్లి చర్చిస్తాం.. గతంలో కూడా వెళ్లామని గుర్తుచేశారు. ఇతర రాష్ట్రాలకు కేంద్ర బడ్జెట్‌లో ఇచ్చింది ఎంత.. తెలంగాణకు ఇచ్చింది ఎంత బీజేపీ ఎంపీలు సమాధానం చెప్పాలని ఎంపీ బలరాం నాయక్ సవాల్ విసిరారు. తెలంగాణకు కరెంట్ ఇచ్చే సీలేరు ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్‌కి ఎందుకు ఇచ్చారని ప్రశ్నించారు. తెలంగాణ నుంచి కేంద్రానికి కడుతున్న టాక్స్ ఎంత.. కేంద్రం తెలంగాణకు ఇస్తుంది ఎంత అని ఎంపీ బలరాం నాయక్ ప్రశ్నల వర్షం కురిపించారు.

# రైల్వే వ్యాగన్స్..మేడిన్ తెలంగాణ

## ఎక్స్ వేదికగా వెల్లడించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



**మహా :** తెలంగాణలో మరో బిగ్గెస్ట్ ప్రాజెక్ట్ శరవేగంగా రూపుదిద్దుకుంటోంది. దీనివల్ల వరంగల్ జిల్లా దశ దిశ మారడం ఖాయం. ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాదిమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించే ఈ ప్రాజెక్ట్ నిర్మాణం ఇప్పటికే సగానికి పైగా పూర్తయింది. ఏడాది చివరి నాటికి తుదిదశకు చేరుకుంటోంది. 160 ఎకరాల విస్తీర్ణంలో ఖాజీపేట్ వద్ద రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ నిర్మితమౌతోంది. దీని నిర్మాణ వ్యయం 716 కోట్ల రూపాయలు. ఇక్కడ వ్యాగన్లు తయారు కానున్నాయి. సంవత్సరానికి 2,400 వ్యాగన్ల తయారీ సామర్థ్యంతో ఈ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ నిర్మాణం కొనసాగుతోంది. 2023 జులై 8వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ ఆర్ఎంయు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. తొలుత దీన్ని వ్యాగన్ రిపేర్ వర్క్‌షాప్, పీరియాడికల్ ఓవర్‌హాలింగ్ యూనిట్‌గా ప్రతిపాదించారు. ఆ తరువాత కేంద్ర ప్రభుత్వం దీని స్థాయిని పెంచింది. రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌గా బదలాయించింది. దీనికి సంబంధించిన వివరాలు, ఫొటోలను కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. ఇందులో 68 శాతం మెయిన్ షాప్ అంటే వ్యాగన్ల తయారీ కోసం కేటాయించిన యూనిట్ నిర్మాణం పూర్తయింది. మిగిలిన వాటిల్లో పెయింట్ వర్క్‌షాప్ 57, స్టోర్ వార్డు 92, పిట్ ట్రావెర్సెస్57, టెస్ట్ షాప్ 45 శాతం మేర నిర్మాణాన్ని పూర్తి చేసుకున్నాయి. దేశ వ్యాప్తంగా వివిధ జోన్లకు ఇక్కడి నుంచే రైల్వే వ్యాగన్లు సరఫరా కావడం ఖాయంగా కనిపిస్తోంది. సంవత్సరానికి 2,400 వ్యాగన్లను తయారు చేయాలంటూ రైల్వే మంత్రిత్వ శాఖ భావిస్తోన్న నేపథ్యంలో వీటి కొరత తీరుతుందని కిషన్ రెడ్డి చెప్పారు.

# 11న బీఆర్ఎస్ శాసనసభాపక్షం సమావేశం

## తెలంగాణభవన్‌కు కేసీఆర్




**హైదరాబాద్, మహా:** రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో భాగంగా.. ఈనెల 11న బీఆర్ఎస్ శాసనసభాపక్ష సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశం బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అధ్యక్షతన కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై ఈనెల 11న మధ్యాహ్నం ఒంటి గంటకు తెలంగాణ భవన్ లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేయనున్నారు. చాలా రోజుల తర్వాత మాజీ సీఎం కేసీఆర్ తెలంగాణ భవన్ వస్తుండటంతో పార్టీ నేతలు అప్రమత్తమయ్యారు.

# దేశ చరిత్రలో చారిత్రాత్మకం

## 55 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ళకు 11,600 కోట్లు విడుదల



(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి మాట్లాడుతూ, రాష్ట్రంలోని పేద, బడుగు, బలహీన, సామన్య, మధ్యతరగతి పిల్లలకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించడానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మాణం చేస్తున్నామన్నారు. ప్రభుత్వం నిర్మాణం చేస్తున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల మాదిరిగా దేశంలో ప్రైవేటు విద్యా సంస్థలు కూడా ఉండవన్నారు. గత కొద్ది నెలల క్రితం ప్రజా ప్రభుత్వం మూడు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను మంజూరు చేసి నిధులు కేటాయించిందన్నారు. విద్యాశాఖ బాధ్యతలు చూస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం రోజున 55 పాఠశాలలకు నిధులు కేటాయిస్తూ విద్యాశాఖ అధికారులతో విడుదల చేయించిన ఉత్తర్వులను చూపించారు.


సుమారు 20 నుంచి 25 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలో అద్భుతమైన క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేయడంతో పాటు, అందులో విద్యా బోధన చేసే ఉపాధ్యాయులకు కూడా అక్కడే వసతి కల్పించడానికి గృహ సముదాయాన్ని నిర్మిస్తామన్నారు. విద్యార్థులకు అన్ని వసతులతో పాటు సాంకేతికంగా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన డిజిటల్ విద్యా బోధన చేయడానికి డిజైన్ చేశామన్నారు. ఈ పాఠశాలలో విద్యార్థులకు కావలసిన ల్యాబ్స్, లైబ్రరీ తో పాటు మినీయాప్ థియేటర్ కూడా ఉండేలా డిజైన్ చేసిన ఈ రెసిడెన్షియల్ పాఠశాలలు పేద, బడుగు, బలహీనవర్గాల కుటుంబాలకు, ప్రయివేటు విద్యాసంస్థల్లో లక్షలకు లక్షల రూపాయల ఫీజులు చెల్లించలేని వారికి ఉపయోగపడుతాయన్నారు. ఈ రెసిడెన్షియల్ పాఠశాలలో చదివే విద్యార్థులు ప్రపంచంతో పోటీ పడే విధంగా సిలబస్ ను కూడా రూపొందిస్తున్నట్టు చెప్పారు. పేద బడుగు బలహీన వర్గాల మధ్యతరగతి పిల్లలకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించడానికి ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు మా హాయాంలో ఏర్పాటు కావడం చాలా అదృష్టంగా భావిస్తున్నాము. సామాజిక మార్పు కోసం సమాజంలో ఉన్న అన్ని వర్గాల అభ్యున్నతికి పెద్ద ఎత్తున ఈ ప్రభుత్వం పూనుకొని పనిచేయాలని మా నాయకుడు రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే చెప్పినటువంటి మార్గ నిర్దేశకాన్ని తూచా తప్పకుండా పాటిస్తూ సమాజానికి మేలు చేయాలన్న ఆలోచనతో ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజా ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటుకు విప్లవాత్మకమైన నిర్ణయం తీసుకున్నదన్నారు. ఈ పాఠశాలలో చదివే విద్యార్థులు భవిష్యత్తులో ప్రపంచాన్ని శాసించే సంస్థల్లో పని చేసే విధంగా ఎదుగుతారన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై ఆర్థిక భారం ఉన్నప్పటికీ, ప్రభుత్వం పోగేస్తున్న ప్రతి పైసను ప్రజల జీవన స్థితిగతులు మెరుగుపరచడానికి మాత్రమే వినియోగిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక్కటే సారి 55 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణానికి నిధులు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసినందుకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలు మాట్లాడారు. మీడియా సమావేశంలో పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి, బలరాంనాయక్, ఖమ్మం ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, కోరం కనకయ్య, మాలోతు రాందాస్ నాయక్, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, జారె ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

# 2040 నాటికి చంద్రుడిపై మనిషిని దింపుతాం

## 2035 నాటికి భారత్ అంతరిక్ష్ స్టేషన్ స్థాపిస్తాం

## మనం ఇతరులపై ఆధారపడే రోజులు పోయాయి..

### దారిచూపేదేశంగా ఎదిగాం: కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్



**మహా:** భారత్ 2040 నాటికి తన మొదటి వ్యోమగామిని చంద్రునిపైకి పంపాలనే లక్ష్యాన్ని పెట్టుకున్నట్లు కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖా మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రకటించారు. 2035 నాటికి ఇండియా, "భారత్ అంతరిక్ష్ స్టేషన్"ను స్థాపిస్తామన్నారు. మనం వేరే దేశాల సాయం తీసుకునే రోజులు పోయాయని, ఇప్పుడు భారతదేశం ఇతరులకు ఒక దారి చూపే స్థాయికి చేరుకుందని అన్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెమోక్రటిక్ లీడర్‌షిప్ నిర్వహించిన 'స్పేస్‌టెక్ ఫర్ గుడ్ గవర్నెన్స్' కాన్క్లేవ్‌లో కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ప్రసంగించారు. నేషనల్ స్పేస్ ఇన్నోవేషన్ అండ్ అప్లికేషన్స్ ఇన్‌స్పేస్‌ల గురించి ప్రస్తవించారు. ఇవి ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల మధ్య సహకారాన్ని పెంపొందించాయి, భారతదేశ అంతరిక్ష ఆర్థిక వ్యవస్థను 8 బిలియన్ డాలర్లకు పెంచాయని అన్నారు. ప్రపంచ అంతరిక్ష పరిశోధనలో ఇండియా స్థాయి పెరుగుతుందని జితేంద్ర సింగ్ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనం వేరే దేశాల సాయం తీసుకునే రోజులు పోయాయని, ఇప్పుడు భారతదేశం ఇతరులకు ఒక దారి చూపే స్థాయికి చేరుకుందని అన్నారు. అలాగే అంతరిక్ష రంగ అభివృద్ధికి భారత ప్రభుత్వం చేస్తున్న కృషి ఈ సందర్భంగా వివరించారు. అంతరిక్ష బడ్జెట్ 2013 14లో 5,615 కోట్ల నుండి ఇటీవలి బడ్జెట్‌లో 13,416 కోట్లకు పెరిగిందని, ఇది 138.93 శాతం ఎక్కువ అని పేర్కొన్నారు. ఇస్రో ఇటీవల నావిక్ ఉపగ్రహంతో తన 100వ ఉపగ్రహ ప్రయోగాన్ని జరిపింది, ఇది భారత దేశ అంతరిక్ష ప్రయాణంలో కీలకమైన మైల్‌స్టోన్‌గా ఆయన అభివర్ణించారు. ఇండియన్ స్పేస్ రిసెర్చ్ రంగంలో స్టార్టప్‌ల సంఖ్య పెరుడుతూ మంచి ఆదాయ వనరుగా మారుతుందన్నారు. ఇండియా 433 విదేశీ ఉపగ్రహాలను ప్రయోగించింది, వాటిలో 396 ప్రధానమంత్రి మోడీ నాయకత్వంలో 2014 నుంచి జరిగాయి. ఈ ప్రయోగాలతో 192 మిలియన్ డాలర్లు, 272 మిలియన్ యూరోల ఆదాయాన్ని ఆర్జించాయని వెల్లడించారు. భవిష్యత్ అంతరిక్ష కార్యకలాపాలపై దృష్టి సారించి, అంతరిక్ష పరిశోధన కోసం ఇండియా సిద్ధం చేసుకున్న ప్రణాళికను ఆయన తెలిపారు. భారతదేశపు మొట్టమొదటి మానవ అంతరిక్ష మిషన్.. గగన్‌యాన్ మిషన్ కోసం ట్రయల్స్ 2025 చివరి నాటికి ROBO మిషన్‌తో ప్రారంభం కానున్నాయని ఆయన ప్రకటించారు. ఈ మిషన్ కోసం నలుగురు వ్యోమగాములను గుర్తించారు, ఒకరిని ఇప్పటికే అమెరికా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని సందర్శించడానికి ఆహ్వానించింది.

**దూసుకుపోతున్నాం**


2035 నాటికి ఇండియా, "భారత్ అంతరిక్ష్ స్టేషన్"ను స్థాపించాలని లక్ష్యంగా పెట్టుకుంది. 2040 నాటికి భారతదేశం తన మొదటి వ్యోమగామిని చంద్రునిపైకి పంపాలనే లక్ష్యాన్ని పెట్టుకున్నట్లు కేంద్ర మంత్రి ప్రకటించారు. ఆర్థిక వ్యవస్థకు ప్రధాన స్తంభాలలో ఒకటైన భారత వ్యవసాయ రంగంలో అంతరిక్ష సాంకేతికత పాత్రను కూడా కేంద్ర మంత్రి వివరించారు. వాతావరణ అంచనా, కమ్యూనికేషన్, విపత్తు సంసిద్ధత, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, పట్టణ ప్రణాళిక, భద్రతను మెరుగుపరచడంలో ఇది అమూల్యమైన శక్తిగా మారిందని పేర్కొన్నారు. పొరుగు దేశాలు భారతదేశ ఉపగ్రహ వ్యవస్థలపై ఎక్కువగా ఆధారపడుతున్నాయని, లోకల్ స్పేస్ లీడర్‌గా ఇండియా స్థానాన్ని మరింత బలోపేతం చేస్తున్నాయని డాక్టర్ జితేంద్ర సింగ్ గర్వంగా చెప్పారు.

ANN తెలుగు
# మహా పత్రిక
03
సోమవారం, హైదరాబాద్ | 10-03-2025 | జనరల్ వార్తలు | GENERAL NEWS | WWW.MAHAADAILY.COM

## హైదరాబాద్-శ్రీశైలం హైవే విస్తరణ

**ఎలివేటెడ్ కారిడార్‌కు బదులు టన్నెల్ రోడ్డు ప్రతిపాదన**

**12 కి.మీ దూరం తగ్గే ఛాన్స్**



**మహా :** తెలుగు రాష్ట్రాల మధ్య రాకపోకలు సాగించే ప్రధాన మార్గాల్లో హైదరాబాద్ శ్రీశైలం హైవే ఒకటి. హైదరాబాద్‌విజయవాడ తర్వాత ఈ హైవే రద్దీగా ఉంటుంది. రాయలసీమ ప్రాంతాలకు వెళ్లే చాలా మంది ఈ రహదారి గుండానే ప్రయాణిస్తారు. అయితే కీలకమైన హైదరాబాద్‌శ్రీశైలం జాతీయ రహదారి విస్తరణకు కేంద్రం రెడీ అయిన సంగతి తెలిసిందే. పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని భావించారు. ఈ మార్గంలోని అమ్రాబాద్ టైగర్ రిజర్వు ఫారెస్ట్ ఉండటంతో 30 అడుగుల ఎత్తుతో 62.5 కి.మీ. మేర కారిడార్ నిర్మించేలా గతంలోనే ఎలైన్‌మెంట్‌నూ రెడీ చేశారు. తాజాగా మరో ప్రతిపాదన తెరపైకి వచ్చింది. ఎలివేటెడ్ కారిడార్ కాకుండా భూగర్భం గుండా రహదారి నిర్మించే అంశాన్ని పరిశీలించాలని కేంద్రం సూచించింది. కొద్దివారాల్లో ఓ ప్రైవేటు సంస్థ ద్వారా అందుకు సంబంధించిన అధ్యయనం చేయించనున్నట్లు తెలిసింది. గతంలో ప్రతిపాదించిన విధంగా ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తే అందుకు ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ అనుమతి కావాలి. అమ్రాబాద్ టైగర్ రిజర్వు కావడంతో ఎన్టీసీఏ అనుమతులు కూడా పొందాల్సి ఉంటుంది. ప్రస్తుతం శ్రీశైలం హైవేలో రాత్రి 9 నుంచి ఉదయం 6 గంటల వరకు వాహనాల రాకపోకలపై నిషేధం ఉంది. పెద్దపులులతో పాటుగా ఇతర అడవి జంతువుల సంచారం రాత్రివేళ ఎక్కువగా ఉండటమే ఇందుకు ప్రధాన కారణం. ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తే వన్య ప్రాణులకు ఇబ్బంది కలుగుతుందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో టన్నెల్ రోడ్డు నిర్మాణానికి రెడీ అయినట్లు తెలిసింది. మధ్యమధ్యలో భూఉపరితలం మీదుగా కూడా రోడ్డు వెళ్తుందని అధికారులు చెబుతున్నారు.

ఈ టన్నెల్ నిర్మాణం ద్వారా హైదరాబాద్ శ్రీశైలం మధ్య దూరం తగ్గనుంది. మన్ననూరు నుంచి ఫర్హాబాద్, వటవర్లపల్లి, దోమలపెంట మీదుగా శ్రీశైలం పాతాళగంగ వరకు ప్రస్తుత నేషనల్ హైవేను విస్తరించనున్నారు. ఈ రహదారి మొత్తం దూరం 62.5 కి.మీ కాగా మన్ననూరులో 3.7 కి.మీ. మాత్రమే ఫారెస్ట్ లేని మార్గం ఉంటుంది. మిగతా.. 58.8 కి.మీ. టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ భూభాగంలోకి వస్తుంది. ఈ నేపథ్యంలో టన్నెల్ రోడ్డు నిర్మాణానికి రెడీ అవుతున్నారు. దానికి తోడు.. ప్రస్తుత రోడ్డు ప్రమాదకర మలుపులతో ఉంది. భూగర్భం గుండా అయితే ఎటువంటి మలుపులు లేకుండా సాఫీగా చేరుకోవచ్చు. మొత్తం దూరం కూడా 12 కి.మీ. వరకు తగ్గే ఛాన్స్ ఉంది. ఈ ప్రాజెక్టు నిర్మాణంపై త్వరలోనే అధికారిక ప్రకటన రానుంది.

## కర్ణాటకకు బెంగుళూరు, తెలంగాణకు హైదరాబాద్ ఉంటే..
# ఏపీకి చంద్రబాబు అడ్వాంటేజ్

**యువగళం పాదయాత్ర ద్వారా చాలా నేర్చుకున్నా**

**విశాఖపట్నంలో డేటా సెంటర్ ఏర్పాటుచేస్తాం**

**ఆధునిక ప్రపంచంలో బహుళ భాషలు నేర్చుకోవడం అవసరం**

**వైసీపీ హయాంలో చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవు**

**జగన్ రెడ్డి వైసీపీకి నాయకుడు, చట్టాన్ని ఉల్లంఘించి ప్రతిపక్ష హోదా ఇవ్వలేం**

**ఇండియా టుడే కాంక్లేవ్‌లో మంత్రి నారా లోకేష్**



**మంగళగిరిలో భారీ మెజార్టీతో గెలుపొందా**

1985 నుంచి తెలుగుదేశం పార్టీ గెలుపొందని మంగళగిరి నుంచి పోటీచేసి 2019 ఎన్నికల్లో ఓటమి చవిచూశాను. 2024 ఎన్నికల్లో పోరాడి 91వేల భారీ మెజార్టీతో గెలిచాను. ఏపీలో ఇది మూడో అత్యధిక మెజార్టీ. కష్టమైన హెచ్ ఆర్డీ శాఖను ఎంచుకున్నానన్నారు. తన భార్య బ్రాహ్మణి తన క్రెడిట్ కార్డు బిల్లు పే చేస్తుందని, మహిళా దినోత్సవం ఒక్క రోజు మాత్రమే కాదు ...ప్రతిరోజూ జరుపుకోవాలని అన్నారు.

**మహా :** కర్ణాటకకు బెంగుళూరు, తెలంగాణకు హైదరాబాద్ ఉంటే.. ఏపీకి చంద్రబాబు అడ్వాంటేజ్ అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఢిల్లీలో ఇండియా టుడే గ్రూప్ ఆధ్వర్యంలో జరిగిన కాంక్లేవ్ లో మంత్రి పాల్గొన్నారు. సీనియర్ జర్నలిస్ట్ రాజ్ దీప్ సర్దేశాయ్ అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. యువగళం పాదయాత్ర ద్వారా చాలా నేర్చుకున్నాను. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను, కష్టాలను స్వయంగా తెలుసుకుని పరిపూర్ణత సాధించాను. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో నా బాధ్యతలను విజయవంతంగా నెరవేరుస్తున్నాను. స్టాన్ ఫోర్ట్ ఎంబీయే బిజినెస్ కు మంచిది. రాజకీయాలకు పాదయాత్ర చాలా ముఖ్యం. పాదయాత్ర రాజకీయాల్లో ఎంబీయే వంటిది. పాదయాత్ర ద్వారా సమస్యలను మరింత బాగా అర్థంచేసుకోగలగుతున్నాను. నియోజకవర్గాలకు వెళ్లినప్పుడు ప్రజలతో మమేకం అవుతున్నాను.

**విశాఖపట్నంలో డేటా సెంటర్ ఏర్పాటుచేస్తాం**

విశాఖపట్నంలో డేటా సెంటర్ ఏర్పాటుచేస్తాం. ఇందులో మరో ఆలోచనకు తావులేదు. వైటూకే విప్లవంలో హైదరాబాద్, దేశం లబ్ధి పొందింది. ఇప్పుడు ఏపీ వంతు. నైపుణ్యం గలిగిన మానవ వనరులు ఉన్నాయి. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంతో ముందుకువెళ్తున్నాం. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కేజీ నుంచి పీజీ వరకు కరిక్యులమ్ లో మార్పులు తీసుకువస్తున్నాం. వాట్సప్ ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేయాలనే ఆలోచన పాదయాత్రలో వచ్చింది. ఈ నెలాఖరునాటికి 350 సేవలను మనమిత్ర ద్వారా ప్రజలకు అందించనున్నాం. కుల ధ్రువపత్రాలు, హాల్ టికెట్లు, ఇతర పత్రాలు, ల్యాండ్ రికార్డులను సులభంగా వాట్సాప్ సేవలో పొందవచ్చు. ఇది ప్రారంభం మాత్రమే. భవిష్యత్ లో మరిన్ని సేవలను ప్రజలక అందుబాటులోకి తీసుకువస్తాం. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ కు అందరూ సిద్ధంగా ఉండాలి.

**కర్ణాటకకు బెంగుళూరు, తెలంగాణకు హైదరాబాద్ ఉంటే.. ఏపీకి చంద్రబాబు అడ్వాంటేజ్**

కర్ణాటకకు బెంగుళూరు, తమిళనాడు చెన్నై, తెలంగాణకు హైదరాబాద్ సిటీలు ఉన్నాయి. కానీ ఏపీకి మాత్రం చంద్రబాబునాయుడు గారు ఉన్నారు. ఆయనే మాకు అడ్వాంటేజ్. ఈ శుక్రవారం టాటా పవర్ తో 7 గిగా వాట్స్ ఒప్పందం జరిగింది. సాంకేతిక పరిజ్ఞానం సాయంతో అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. నైపుణ్యగణన కంటే కుల గణన చాలా సులభం. రాష్ట్రంలో నైపుణ్య గణనను ఛాలెంజ్ గా తీసుకుని పనిచేస్తున్నాం.

**ఏపీలో తెలుగుభాషను ప్రమోట్ చేస్తున్నాం**

త్రిభాషా విధానంతో మాతృభాషకు అన్యాయం జరుగుతుందని భావించడం లేదు. భారతదేశంలోని భాషా వైవిధ్యమే దానిని అడ్డుకుంటుంది. ఏపీలో తెలుగుభాషను ప్రమోట్ చేస్తున్నాం. స్థానిక భాష తెలుగు. మాతృభాషల బలోపేతానికి ఎన్డీయే ప్రభుత్వం కృషిచేస్తోంది. హిందీని బలవంతంగా రుద్దుతారని భావించడం లేదు. నర్సులు, హోంకేర్ ల కోసం జర్మనీ, జపాన్ వంటి దేశాల్లో పలు ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయి. కాబట్టి ఆ భాషలను సైతం నేర్చుకోవాలి. ఆధునిక ప్రపంచంలో బహుళ భాషలు నేర్చుకోవడం అవసరం. ఎన్డీయే కు మేం బేషరతుగా మద్దతు ఇస్తున్నాం.

**వైసీపీ హయాంలో చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవు**

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాపై అక్రమంగా 23 కేసులు నమోదు చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, హత్యాయత్నం కేసు నమోదు చేశారు. వైసీపీ హయాంలో చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవు. వైసీపీ హయాంలో నిరసన తెలిపేందుకు కూడా అవకాశం లేదు. మా ఇంటికి తాళ్లు కట్టారు. ఇప్పుడు జగన్ రెడ్డి ఎక్కడికైనా స్వేచ్ఛగా వెళ్తున్నారు. నేడు డిప్యూటీ సీఎం కంటే జగన్ కు భద్రత ఎక్కువ. వైసీపీ పాలనలో మద్యంలో అవినీతి, ఇసుక అక్రమ మైనింగ్ జరిగింది. సుప్రీం కోర్టులో కేసు కూడా నడుస్తోంది.

**జగన్ రెడ్డి వైసీపీకి నాయకుడు**

1990ల్లో అసెంబ్లీలో అర్థవంతమైన చర్చలు జరిగేవి. నేడు అలాంటి చర్చలు లేకపోవడం బాధాకరం. జగన్ రెడ్డి వైసీపీకి నాయకుడు. శాసనసభలో ప్రతిపక్ష హోదా ఉండాలంటే మొత్తం సభ సంఖ్యాబలంలో పదిశాతం ఉండాలి. చట్టాన్ని ఉల్లంఘించి ప్రతిపక్ష హోదా ఇవ్వలేం. మేం చట్టాలను గౌరవిస్తాం. పార్లమెంట్, శాసనసభలో ఉండే నిబంధనలను ఎలా ఉల్లంఘిస్తాం?

## కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు శుభాకాంక్షలు

**టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్**

**అన్ని కోణాలలో ఆలోచించి అభ్యర్థుల ఎంపిక**



**మహా:** కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థులు శంకర్ నాయక్, అద్దంకి దయాకర్, విజయశాంతి లకు టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ శుభాకాంక్షలు తెలిపారు. గత 30 ఏళ్లుగా పార్టీకి నిబద్ధతతో పని చేస్తున్న ఒక ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన శంకర్ నాయక్ కు అవకాశం ఇవ్వడంతో కార్యకర్తల పార్టీ భరోసా ఇచ్చిందన్నారు. అలాగే 2014 నుంచి కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పని చేస్తూ తెలంగాణ ఉద్యమకారుడిగా పేరున్న అద్దంకి దయాకర్ రెండు సార్లు తక్కువ ఓట్లతో ఓడిపోయిన నిత్యం ప్రజా సమస్యలపై పోరాటాలు చేసారని, కాంగ్రెస్ పార్టీ గొంతుకగా బీజేపీ, బిఆర్ఎస్ పార్టీల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేసారని టీపీసీసీ అధ్యక్షులు అన్నారు. అద్దంకి దయాకర్ కు ఎమ్మెల్సీ టికెట్ ఇవ్వడంతో తెలంగాణ సమాజం హర్షం వ్యక్తం చేస్తుందన్నారు. బిసి సామాజిక వర్గానికి చెందిన తెలంగాణ పోరాట నేత విజయశాంతికి టికెట్ ఇవ్వడంతో బిసి, మహిళకు అవకాశం ఇవ్వాలని పార్టీ నిర్ణయం తీసుకుందని, పొత్తు ధర్మంలో భాగంగా ఒక స్థానాన్ని సీపీఐకి కేటాయించడం జరిగిందని అన్నారు. రేపు అసెంబ్లీలో కాంగ్రెస్, సీపీఐ అభ్యర్థులు నామినేషన్ వేస్తారని ఆయన వివరించారు..

## బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా
# దాసోజు శ్రవణ్

**ఖరారు చేసిన కేసీఆర్**



**హైదరాబాద్, మహా:** బీఆర్ఎస్ పార్టీ తరఫున ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిగా దాసోజు శ్రవణ్ పేరు ఖరారైంది. ఈ మేరకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. రేపు ఉదయం దాసోజు శ్రవణ్ నామినేషన్ వేయనున్నారు. నామినేషన్ ప్రక్రియను దగ్గరుండి పర్యవేక్షించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఆదేశించారు. రాష్ట్రంలో ఎమ్మెల్యే కోటాలో ఐదు ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ అవుతున్నాయి. ఆయా స్థానాలకు ఇటీవల కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. 10వ తేదీ వరకు దరఖాస్తుకు అవకాశం కల్పించింది. నామినేషన్ల విత్‌డ్రాకు 13 వరకు అవకాశం ఉంది. 20న ఎన్నికలు జరగనుండగా అదే రోజు ఫలితాలు వెల్లడి కానున్నాయి. ఎమ్మెల్యేల సంఖ్యాబలం ఆధారంగా మూడు కాంగ్రెస్‌కు, ఒకటి బీఆర్ఎస్‌కు వస్తాయి. ఐదో స్థానం కోసం కాంగ్రెస్‌కు ఎంఐఎంతో పాటు మరికొన్ని ఓట్లు అవసరమవుతాయి. ఈ స్థానం సీపీఐకు కేటాయించారు.

# అందరిదీ.. నల్లగొండ దారే

**నల్లగొండ.. పదవుల కొండ**

- ఒకేసారి నాలుగు ఎమ్మెల్సీలు
- మూడు పార్టీలు.. నలుగురు అభ్యర్థులు
- నల్లగొండ కాంగ్రెస్ అధ్యక్షుడు, సీపీఐ కార్యదర్శి ఇద్దరికీ లక్కీ ఛాన్స్
- ఇది కదా అదృష్టం అంటే

**నల్లగొండ, మహా:** ఒకటి కాదు.. రెండు కాదు.. రాష్ట్రస్థాయిలో ఐదు ఎమ్మెల్సీలు ఉంటే ఒకేసారి నాలుగు ఎమ్మెల్సీలు అక్కడి వారికే దక్కబోతున్నాయి. ఇది కదా అదృష్టం అంటే అని అక్కడి ప్రజలు సంతోషపడుతున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా నల్లగొండ జిల్లా తుంగతుర్తి నుండి రెండుసార్లు పోటీచేసిన అద్దంకి దయాకర్ ను, నల్లగొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శంకర్ నాయక్ లను ఎంపిక చేసింది. ఇక పొత్తులో ఒక స్థానం సీపీఐకి ఇవ్వగా పార్టీ అనేక సుదీర్ఘ చర్చలు జరిపిన అనంతరం విస్తరణ వ్యూహాల రీత్యా నల్లగొండ జిల్లా సీపీఐ కార్యదర్శి నెల్లికంటి సత్యంను ఎంపిక చేసి ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రకటించారు. దీంతో ఒకప్పటి కమ్యూనిస్టు జిల్లాలైన ఖమ్మం, నల్లగొండలలో సీపీఐ వ్యూహాత్మకంగా పూర్వవైభవం దిశగా సాగేందుకు ఈ ఎంపిక చేసింది. ఇక బీఆర్ఎస్ పార్టీకి ఒక సీటు దక్కనుండగా, అది కూడా నల్లగొండ జిల్లా బిడ్డ, దాసోజు శ్రావణ్ ను కేసీఆర్ ఎంపిక చేశారు. దీంతో అన్ని దారులూ.. నల్లగొండ నేతలకే ఓటేశాయి. దీంతో నల్లగొండ జిల్లా ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది. ప్రధానంగా కాంగ్రెస్, సీపీఐ పార్టీల క్యాడర్ లో ఉత్సాహం కనబడుతోంది.

# ఎవరీ శంకర్ నాయక్

**కాంగ్రెస్ పార్టీ నుంచి శాసన మండలికి**

**నల్లగొండ జిల్లాలో తిరుగులేని నాయక్.. చక్రం తిప్పిన జానారెడ్డి**



**మహా:** కేతావత్ శంకర్ నాయక్ రాష్ట్రవ్యాప్తంగా అంతగా తెలిసిన నాయకుడు కాకున్నా.. మిర్యాలగూడ, హుజుర్‌నగర్, నాగార్జున సాగర్, సూర్యాపేట్ ప్రాంతాల్లో బాగా తెలిసిన గిరిజన నాయకుడు. ఎన్నో ఎళ్లుగా కాంగ్రెస్ పార్టీలోనే ఉంటూ వచ్చాడు శంకర్ నాయక్. ప్రస్తుతం ఆయన నల్గొండ జిల్లా డిసిసి అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. నాగార్జున సాగర్‌లో జానా రెడ్డికి బ్యాక్‌బోన్‌లా ఆయన పని చేశారు. అంతేకాదు.. ఆయన ఇద్దరు కుమారులు ఒకరు ఎంపీ, ఎమ్మెల్యేగా గెలవడంలో కూడా శంకర్ నాయక్ కీలక పాత్ర పోషించారు. ఎస్టీ కమ్యూనిటీకి చెందిన శంకర్ నాయక్‌కు మిర్యాలగూడ చుట్టుప్రక్కల ప్రాంతాల్లోని తండాల్లో గిరిజన ఓటు బ్యాంక్ ఉంది. మిర్యాలగూడలో బీఎల్‌ఆర్ ను ఎమ్మెల్యేగా గెలిపించడంలోనూ శంకర్ నాయక్ కీలకంగానే పని చేశారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో మిర్యాలగూడ ఎమ్మెల్యే సీటు ఆశించి శంకర్ నాయక్ నిరాశ చెందారు. కాంగ్రెస్ అధిష్టానం అది గుర్తించి ఇప్పుడు ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చింది. నల్గొండ జిల్లా మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, జానా రెడ్డి శంకర్ నాయక్ పేరును హైకమాండ్‌కు సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది.

## ఏపీ టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు ఖరారు

**ముగ్గురిని ఖరారుచేసిన చంద్రబాబు**



**అమరావతి, మహా:** ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులు ఎవరో తేల్చేసింది టీడీపీ. సోమవారంతో నామినేషన్ల గడువు ముగుస్తున్న నేపథ్యంలో అభ్యర్థులను ప్రకటించింది. కావలి గ్రీష్మ(ఎస్సీ), బీద రవిచంద్ర (బీసీ), బీటీ నాయుడు(బీసీ)కు అవకాశం కల్పించారు. మరో సీటును చివరి నిమిషంలో బీజేపీకి కేటాయించారు. ఇప్పటికే ఒక స్థానం జనసేనకు కేటాయించగా.. ఆ పార్టీ నుంచి పవన్ కల్యాణ్ సోదరుడు నాగబాబు నామినేషన్ వేశారు. బిజెపి తరుపున సోము వీర్రాజు పేరును బీజేపీలోని కొందరు పెద్దలు ఎమ్మెల్సీ స్థానానికి ప్రతిపాదిస్తోన్నట్లు తెలుస్తోంది. విశాఖకు చెందిన పీసీఎన్ మాధవ్ కూడా టికెట్ కోసం ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. సోమవారం స్పష్టత రానుంది.



# మండలికి నెల్లికంటి సత్యం

**ఖరారు చేసిన సీపీఐ**

**నేడు నామినేషన్**

**మహా:** శాసనమండలి ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థిగా నెల్లికంటి సత్యం పేరు ఖరారైంది. ఈమేరకు హైదరాబాద్ మఖ్దూంభవన్‌లో ఆదివారం జరిగిన సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్ణయం తీసుకున్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రకటించారు. నెల్లికంటి సత్యం సోమవారం ఉదయం 10.00 గంటలకు నామినేషన్ దాఖలు చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం నెల్లికంటి సత్యం నల్లగొండ జిల్లా సిపిఐ కార్యదర్శిగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా వున్నారు.

**కాంగ్రెస్ కు ధన్యవాదాలు**

స్నేహధర్మాన్ని పాటిస్తూ ఎం.ఎల్.ఎ. కోటాలో శాసనమండలికి జరుగుతున్న ఎన్నికలలో ఒక స్థానాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)కి కేటాయించిన కాంగ్రెస్ పార్టీకి సిపిఐ రాష్ట్ర సమితి తరుపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. గత శాసనసభ ఎన్నికల సమయంలో చేసుకున్న అవగాహన మేరకు తమకు స్థానాన్ని ఇచ్చినందుకు ఏఐసిసి అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే, అగ్రనాయకులు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీ మీనాక్షి నాటరాజన్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, టిపిసిసి అధ్యక్షులు బి. మహేశ్‌కుమార్ గౌడ్, నీటి పారుదల శాఖా మాత్యులు ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డిలకు, ఇందుకు సహకరించిన రాష్ట్ర మంత్రులు, కాంగ్రెస్ నాయకులు ధన్యవాదాలు. భవిష్యత్‌లో కూడా రాష్ట్రంలో మతతత్వశక్తులను అడ్డుకునేందుకు మరింత ఐక్యతతో పనిచేయాలని ఆకాంక్షిస్తున్నామన్నారు.

# ఎయిమ్స్‌లో చేరిన ఉపరాష్ట్రపతి


**జగదీప్ ధన్‌ఖడ్ ఆరోగ్యంపై ప్రధాని మోదీ ఆరా**



**మహా :** ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ఎయిమ్స్‌లో చేరారు. ఆదివారం ఛాతీ నొప్పితో, అసౌకర్యంగా ఉందని చెప్పడంతో ఆయనను తెల్లవారు జామున సుమారు 2 గంటలకు ఎయిమ్స్‌లో చేర్పించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ రాజీవ్ నారంగ్ ఆధ్వర్యంలో ఆయనకు చికిత్సను అందిస్తున్నట్లు పేర్కొన్నాయి. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉందని, వైద్య బృందం నిరంతరం ఆయన పరిస్థితిని పర్యవేక్షిస్తోందని తెలిపాయి. ధన్‌ఖడ్ పరిస్థితిని ఆరా తీయడానికి కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా ఎయిమ్స్‌కు వెళ్లారు.

**ప్రధాని మోదీ ఆరా**

ప్రధాని నరేంద్ర మోదీ దిల్లీలోని ఎయిమ్స్ ఆస్పత్రికి వెళ్లారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ విషయాన్ని ప్రధాని మోదీ స్వయంగా 'ఎక్స్'లో పోస్టు చేశారు. జగదీప్ ధన్‌ఖడ్ ఆరోగ్యంగా ఉండాలని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.



## గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ కన్నుమూత

**మహా:** టీటీడీ ఆస్థానవిద్వాంసుడు గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్(76) గారు కన్నుమూశారు. ఆదివారం సాయంత్రం గుండెపోటుతో స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఆయన వెయ్యికిపైగా అన్నమాచార్య సంకీర్తనలకు స్వరకల్పన చేశారు. వినరో భాగ్యము విష్ణుకథ, జగడపు చనువుల జాజర, పిడికిట తలంబ్రాల పెండ్లికూతురు తదితర కీర్తనలకు ఈయనే స్వరాలు సమకూర్చారు. గరిమెళ్ల మృతి పట్ల తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు సంతాపం తెలిపారు.

## ఎస్ఎల్ బిసి టన్నెల్‌లో గురుప్రీత్ సింగ్ మృత దేహం లభ్యం

**ప్రగాఢ సంతాపం ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**25 లక్షల నష్టపరిహారం ప్రకటించిన సీఎం రేవంత్**




**నాగర్ కర్నూల్, మహా:** ఇటీవల ఎస్.ఎల్.బి.సి సొరంగంలో జరిగిన ప్రమాదంలో పంజాబ్ కు చెందిన గురుప్రీత్ సింగ్ గల్లంతుకాగా, మృత దేహం ఆదివారం లభించింది. పంజాబ్ కు చెందిన గురుప్రీత్ సింగ్ సొరంగంలో టన్నెల్ బోరింగ్ మిషన్ ఆపరేటర్ గా పని చేస్తున్నారు. అమెరికా కు చెందిన రాబిన్ సన్ కంపెనీ లో ఉద్యోగిగా ఆయన టిబిఎమ్ ఆపరేటర్ గా చేస్తున్నారు. ఈ దుర్ఘటనలో గురుప్రీత్ సింగ్ మృతి చెందడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. గురుప్రీత్ సింగ్ కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ 25 లక్షల రూపాయల నష్టపరిహారం అందజేస్తామని ప్రకటించారు. అలాగే మృత దేహాన్ని పంజాబ్ లోని వారి స్వగ్రామానికి పంపించారు. మరో ఏడుగురి ఆచూకీ లభ్యం కావాల్సి ఉంది.



# నల్ల సూరీడు

ఉదయాన్నే ఇంటి గుమ్మంలో
కాంతికిరణాల ఎండినఆకులు
పడతాయి

కావ్ కావ్ మంటూ అరుస్తుంది కాకి

కోళ్లపంజరం మీద కోడిపుంజు
చివరి దుఃఖపుమూలుగు వింటున్నాను

గది మూల నుంచి అమ్మమ్మ కప్పుకునే
దుప్పటి దగ్గుతుంది
బార్లీరొట్టె, ఎర్ర మిరియాలు

మా నాన్న కోసం ఎదురు చూస్తున్నాయి
కొంతమంది విరిగిన మంచంమీద
మా నాన్నను వేసుకుని ఇంటికి తెచ్చారు

ఏమాత్రం కనికరం లేకుండా
పెద్ద కులస్తులు మా నాన్నను చావగొట్టారు

కోపంలో నేను చుట్టూ రాళ్లు విసిరాను

సాయంత్రం పక్షి నెత్తుటిలో తడిసి
ఆరుబయట అపస్మారకస్థితిలో
పడివుంది

నా చిన్నారి కోసం నేను
ఎదురుచూస్తున్నాను
తనింకా బడి నుంచి రాలేదు

చీకటి నీడలు, భయం
నా కళ్లల్లో పరుచుకుంటున్నాయి

ఇంటి మెట్ల మీద రాత్రి బిక్కచచ్చినట్టు
నిలబడి వుంది

రాత్రంతా కొత్త కవిత కోసం నేను
మేల్కొనే వున్నాను

అకస్మాత్తుగా
పోలీసులు మా ఇంటిలోకి జొరబడ్డారు
నా చేతిలోని పెన్నుని లాగేసుకున్నారు
నా చేతులకు సంకెళ్లు వేసారు

అంతా ఇంటిపైకప్పు నుంచి
నల్ల సూరీడు చూస్తూనే వున్నాడు

ఉర్దూ మూలం: జయంత్ పర్మర్
ఆంగ్లానువాదం: బైదర్ బఖ్త్
స్వేచ్ఛానువాదం: బాలసుధాకర్, 9676493680

# చికెన్ షాపులో..



బోను జాలీలోంచి
అన్ని కోళ్లల్లో
ఆ ఒక్క కోడీ
నన్ను చూసి
కొక్కొక్కొ అని అరుస్తూ
ఎందుకు దాక్కుంటుందో
అదెవరో ఏమో నాకూ తెలియదు

తెలిసిందల్లా నాకు లానే
దానికీ జీవితం ఎన్నాళ్లో తెలియదని
అదీ కూడా ఎప్పుడో మరణిస్తుందని

ఎవరు దాని మరణాన్ని కోరుకుంటారో
ఎవరికోసం దాని ప్రాణం తీయబడుతుందో
ఎంతకాలం అది ప్రాణంతో ఉంటుందో
నేను ఏ విధంగా సాయపడగలనో ఏమో

నాకూ బాధగానే ఉంది
నాకూ ఆ కాస్సేపూ
ప్రాణం విలవిలలాడుతూనే ఉంది

ఎలాగూ దానితో కలిసి జీవించలేము
నేను కాకపోతే మరొకరు
వారి శరీరంలొ కలుపుకుని మాత్రమే
జీర్ణించగలరు

- ముకుంద రామారావు, 99083 47273

# రచనలకు ఆహ్వానం

సాహిత్య పేజీ కోసం కవులు, రచయితల నుండి కథలు, కవిత్వం, సాహిత్య వ్యాసాలు, పుస్తక సమీక్షలు మొదలైనవి..

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com | whatsapp- 9247580946

# సుధామ, చంద్రశేఖర అజాద్ లకు మునిపల్లెరాజు శతజయంతి పురస్కారాలు



సుధామ    చంద్రశేఖర అజాద్

కథాఋషి, మ్యాజిక్ రియలిజమ్ కథకునిగా పేరొందిన విశిష్టకథకులు, కవి, వ్యాసకర్త, సాహితీవేత్త కీర్తిశేషులు మునిపల్లెరాజు గారి శతజయంతి సందర్భంగా ఈ సారి ఏటా ఇస్తున్న మునిపల్లెరాజు స్మారక సాహిత్య పురస్కారాన్ని 2023 సంవత్సరానికి గాను ప్రముఖ కవి, రచయిత, సాహితీవేత్త ,సప్తపది లఘుకవితా ప్రక్రియ సృజనకర్త శ్రీ సుధామ గారికీ .2024 సంవత్సరానికి గాను సుప్రసిద్ధ కథా,నవలా,సినీ రచయిత శ్రీ పి. చంద్రశేఖర అజాద్ గారికి ప్రదానం చేస్తున్నట్లుగా కణ్వస ట్రస్ట్ మునుపల్లెరాజు కుటుంబసభ్యుల పక్షాన డా. ఉష మునిపల్లె ఓ పత్రికా ప్రకటనలో తెలియచేస్తున్నారు. ఈ పురస్కార ప్రదాన సభ ఈ మార్చి నెల 17వ తేదీ సోమవారం సాయంకాలం 6 గంటలకు హైదరాబాద్ రవీంద్రభారతి మొదటి అంతస్తులోని సమావేశ మందిరంలో తలంగాణ భాషా సాంస్కృతిక శాఖ,కణ్వస ట్రస్ట్ శ్రీ మట్టి గుంట వెంకటరమణ గారి ఎం.వి.ఆర్.ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతుంది.

# దిలీప్ ఝవేరి అంతరంగ కథనం

కవి ఒక పదాన్ని వెతకాలి. ఆ పదం ఎలా ఉండాలి? కవి తన లోపల ఉన్న భావానికి, భావోద్వేగానికి, దృష్టికీ, అంతర్దృష్టికీ, తెలిసిన దాని నుండి తెలియని దాని లోకి దూకేయాలనే ఉత్సాహానికి, మానవ జీవితంలోని సమకాలీన వాస్తవికతను, తన లోలోపల రగులుకొనే ఆలోచనతో సంలీన పరచడానికి కావలసిన ఒక పదాన్ని వెతకాలి. ఈ పదానికి ధ్వని, సంగీతం, అనుబంధాలు, చరిత్ర, ఒకే లేదా బహుళ అర్థాలు, సౌఖ్యం, అసౌకర్యం లేదా ఇతర పదాలతో శత్రుత్వం ఉండాలి . ఈ పదం నశ్వరంగా , తాజాగా , పెళుసుగా, పల్టీలు కొట్టేదిగా, పల్టీలు కొట్టించేదిగా , సుపరిచితమైనదిగా ఉండాలి . అప్పుడు మాత్రమే అది జీవ భాషలో ఒక భాగం అవుతుంది. కవిత్వం అనేది కేవలం ఒక పదం మాత్రమే కాదు. అది గాలిలా, నీరులా, నింగిలా, వెలుతురులా, ఋతువుల్లా, భూమిలా మారి పాఠకుడిని మంత్రి ముగ్ధుడిని చేయాలి. ఒక పదం మరొక పదానికి, వాక్యానికి, అలవోకగా, అప్రయత్నంగా, అనాహూతం గా దారి చూపాలి. కవి అలాంటి పదం కోసం వెతకాలి.

కవిత్వం రోజూ రాయాలి . కానీ కాగితంపైనో, లేదా స్పష్టమైన ,శుభ్రమైన పదాలతోనే కాదు. పద్యం ఒక ఆశ్చర్యం లానో, ఒక వస్తువునుండో , పదే పదే చేసే ప్రయత్నం లో నుండో ఉద్భవించవచ్చు . రిల్కే లో, పెసోయా లో కనిపించే సృజనాత్మక విస్ఫోటన చాలా అరుదు. కానీ పద్య జననానికి ముందు వాళ్ళు అనుభవించిన సుదీర్ఘ నిష్క్రియాపరత్వం (protracted inactivity) ప్రతి కవీ సాధారణంగా అనుభవించేదే. కవిత్వం జన్మించే ప్రక్రియ అండాశయం లో ఉదాసీనంగా, విభిన్న వేగాలతో పెరిగే అనేక ఫోలికిస్ (follicles) లాంటివి. ఉద్వేగం లో శుక్ర కణాలు విస్ఫోటనం చెందుతాయి కానీ ప్రతి సారీ ఫలదీకరణం జరుగుతుందని గ్యారంటీ లేదు. ఫలదీకరణం జరిగినా కూడా అబార్షన్ ముప్పు పొంచి ఉంటుంది

భారత దేశంలో స్పష్టంగా కనిపించే విషయం ఏమిటంటే మంచి కవులందరికి ఒకే రకమైన గుర్తింపు లభించదు.కొందరికి సహాయపడేది విద్యాసంబంధమైన స్నేహం, రాజకీయ కట్టుబాట్లు, పాత్రికేయ పరిచయాలు . బహుశా అదృష్టం కూడా! ప్రపంచ వ్యాప్తంగా కవులందరూ ఒకే రకమైన వివక్ష లేదా దుర్విధి ఎదుర్కుంటున్నారు . ఇప్పుడు సామాజిక మాధ్యమాలు ఎక్కువయిన తరువాత ఎవరికైనా తమ భావాలని తమ పేరుతొ పోస్ట్ చేసుకుని ఆనందాన్ని



పొందే అవకాశం లభించింది . సంపాదకుల, విమర్శకుల అవరోధాలను ఈ వెబ్ ఫ్రీడమ్ తొలగించింది . కానీ వీటిలో వచ్చే కంటెంట్ వాటికీ కనపడే రెస్పాన్స్ మాత్రం ప్రశ్నార్థకం .అసంఖ్యాక కవితా ఉత్సవాలు జరుగుతున్నాయి అక్కడ మార్కెట్ గురించి తెలిసిన కవులదే హడావిడి అంతా

పద్యం అంటే బహుశా అద్దంలో కనిపించే చిత్రాల క్రమం కావచ్చు. ఆ అద్దం కూడా గాజు లేదా ప్రవహించే నీరు లేదా మెరుస్తున్న లోహం లేదా సముద్ర ఉపరితలం లేదా చీకటి ఆకాశం, ఏదైనా కావచ్చు. కానీ కవికి ఒక నమూనా ఉంటుందని ముందే తెలుసు.

కొన్నిసార్లు సంగీతం వింటున్నప్పుడు, అద్భుతంగా చిత్రించిన చిత్రమో , చలనచిత్రమో చూస్తున్నప్పుడు, ఎవరైనా మాట్లాడటం వింటున్నప్పుడు, మద్యపానం చేస్తున్నప్పుడు లేదా శృంగార పారవశ్యంలో ఉన్నప్పుడు, ఒక పద్యం ఒక ట్రాన్స్‌లో కనిపించి, మరుసటి క్షణంలో తప్పించుకునే సంపూర్ణంగా అనుభవంలోకి వస్తుంది. ఆ కవిత ఎక్కడ, రాస్తాము ?

కొన్నిసార్లు పద్యం, చిన్నగాను, లేదా పెద్దగానూ ఉండవచ్చు , ఒకే సిట్టింగ్‌లో వ్రాయబడవచ్చు. కొన్ని సమయాల్లో మొదటి ఐదు పంక్తుల తర్వాత ఆరవది మొండిగా బయటపడటానికి నిరాకరిస్తుంది, చివరివి స్పష్టంగా మనస్సులో ఉన్నప్పటికీ.

ప్రతి కవికీ ఈ స్థితిని ఎదుర్కోవడానికి ఏవో వ్యూహాలు వుండే ఉంటాయి . కొన్ని సార్లు దీనికి పరిష్కారం ఉండకపోవచ్చు కూడా . ధైర్యవంతులు, ఆత్మవిశ్వాసం కలిగినవారు మరియు దైవభక్తులు తమ ఆలోచనలు, ఉద్దేశాలు, భావోద్వేగాలు, కల్పిత ఆత్మకథలు, ప్రామాణికమైన కవితా అనుభవాల జ్ఞాపకాలు, సౌందర్య సిద్ధాంతాలతో తమ మిషన్ పూర్తి చేస్తారుఎలా చేస్తారు అంటే బహుశా . నాన్‌పొసెసివ్‌గా ఉండటం వల్ల అనుకుంటాను

కాబట్టి ఒక పద్యం రాయడం అనేది ఒక బహుళ చర్య , . నిజమైన లేదా సంతృప్తికరమైన కవి ఎవరంటే తాను రాసిన కొద్ది కవితలతో పాటు ఎంతోమంది జ్ఞాపకాలను తనతో మోసేవాడు. He or she is liberated from ideologies, commitments, service to humanity, culture, nationality and such unending demands. He or she is selfish, leaving little to posterity while exploiting his or her inheritance fully.

భగవాన్ ని వాటో (దేవుడి మాటలు ) గా సంకలించిన తన కవిత్వానికి 2024 కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందిన దిలీప్ ఝవేరి భారత దేశం లో అత్యంత బాధ్యాయుతంగా, చైతన్యవంతం గా కవిత్వ రాస్తున్న కవులలో ప్రథమ పంక్తి లో వుంటారు . ముంబై లో ఒక జనరల్ ఫిజిషియన్ గా పనిచేసే ఈ గుజరాతీ కవిని చాలా తరచుగా చెక్ కవి మిరస్లావ్ హోలబ్ తో పోలుస్తూ వుంటారు కవిత్వ ప్రియులు. 1943 లో తొలి శ్వాస ను అందుకున్న ఈ 81 సంవత్సరాల దిలీప్ ఝవేరి మిరస్లావ్ హోలబ్ లాగే తన కవిత్వం లో వస్తు నిబద్ధత (Objectivity ) ని అలుపెరుగని భావ పరంపరని సమపాళ్ళ లో రంగరించి పాఠకుడికి అందిస్తాడు. 1989 లో పాండు కావ్య అనే ఇటార్ (కవిత్వం ) , 2003 లో వ్యాసోచ్చాస్ (నాటకం ) ప్రచురించారు . 2014 లో దిస్ మిస్ట్ కక్లియర్స్( This Mist clears ), 2015 లో ఫైర్ రైట్స్ ఇన్ సెవెరల్ స్క్రిప్ట్స్(Fire writes in several scripts ) రెండు కవిత్వ సంపుటాలను ఆంగ్లం లో ప్రచురించారు. సమకాలీన గుజరాతీ కవిత్వాన్ని బ్రీత్ బికమింగ్ ఎ వర్డ్ పేరుతొ ఆంగ్లం లోకి అనువదించారు

**దిలీప్ ఝవేరి కవిత**

## కుర్చీలు తయారు చేయడం గురించి

కుర్చీలు తయారు చేయడం చాలా సహజమైనది
ఇంకా చాలా తేలిక కూడా
చెట్టు నుండి ప్రతి ఆకూ రాలడం కోసం
మీరు శిశిర ఋతువు వరకూ ఎదురుచూడవచ్చు
లేదా కాకి ఎలుక మాంసాన్ని పొడిచి పొడిచి పైకి
తీసినట్టు
మీరు చెట్టు నుండి ప్రతి ఆకునూ పెరికి వేయవచ్చు

ఏనుగులు అడవులను తొక్కి తొక్కి నాశనం చేసినట్టు చెట్లను కూలదోయండి
స్నాయువులను తోడేలు చించేసినట్టు , కొమ్మలని తొలగించండి
ఎముకలను మొసలి విడదీసినట్టు చెట్టును విడదీయండి
వడ్రంగి పిట్టలాగా దుంగలకి రంధ్రాలు చేయండి

మూలల్లో కర్రలు అమర్చడం , మేకులు కొట్టడం ఒక పురాతన కళ
గుజ్జు తో చేసిన పుట్టీ తో ఉపరితలాన్ని నునుపుగా చేయండి
చమురు బావుల నుండి తిరిగి పొందడానికి లక్షల సంవత్సరాల క్రితం
దహించిన చెట్ల నుండి రంగులను తీసుకోండి
తాజాగా ఒలిచిన బెరడు నుండి తీసిన రెసిన్ (Resin ) కుర్చీకి మెరుపు అద్దుతుంది

ఇప్పుడు వరండాలో కుర్చీ వేసుకుని ఆనుకుని కూర్చోండి
కూర్చున్నాక, సిమెంట్ చేసిన చప్టా పగుళ్ల నుండి
తల ఎత్తుతున్న పచ్చదనం గురించి ఆలోచించండి
అడవి మీ కోసం ఓపికగా ఎదురు చూస్తోంది


**Resin : రెసిన్ అనేది ఒక ఘన లేదా అత్యంత జిగట ద్రవం , దీనిని పాలిమర్‌గా మార్చవచ్చు . రెసిన్లు జీవసంబంధమైన లేదా కృత్రిమమైన మూలంగా ఉండవచ్చు, కానీ సాధారణంగా మొక్కల నుండి సేకరించబడతాయి.**

గుజరాతీ మూలం : దిలీప్ ఝవేరి
తెలుగులోకి : వంశీకృష్ణ, 9573427422

# మధ్య, దక్షిణ అమెరికా దేశాల సరికొత్త పరిచయం
# మనమెరుగని లాటిన్ అమెరికా

డా. నిమ్మగడ్డ శేషగిరి మధ్య అమెరికాలో గ్వాతెమాల, బెలీజ్, ఓందురస్, ఎల్. సల్బదోర్, నికరగ్వా, కోస్తా రీక, పనామా అనే ఏడు దేశాలనూ; దక్షిణ అమెరికాలోని ఎక్వదోర్, కొలంబియా దేశాలలో పర్యటించి,ఆ యాత్రానుభవాలనుఆంగ్లంలో ఫేస్బుక్‌లో వ్రాయగా, మరో యాత్రికుడుశ్రీ దాసరి అమరేంద్ర వాటినిచక్కగా అనువదించి పాఠకులకు అందించారు. ఈ సమీక్షలో వారు చూసిన ప్రదేశాల గురించి కన్నా, వారు కలిసిన మనుషుల గురించి ప్రధానంగా ప్రస్తావిస్తాను. ఆంతీగా గ్వాతెమాల మయాన్ నాగరికతకు కేంద్ర బిందువు. డా. శేషగిరి గ్వాతెమాల సిటీలో అడుగుపెట్టినప్పుడు ఎదురైన మొదటి వింత ఒకచోట అనేకమంది షూ పాలిష్ కుర్రాళ్ళను చూడటం! మాయాజాతి ప్రజలు ప్రపంచానికి ప్రసాదించిన బహుమతి చాకొలెట్లుఅని చెప్తారు.

చిచికాస్తెనాంగో అన్న గ్రామం చూడ్డానికి మూడు చికెన్ బస్సులు మారి చేసిన ప్రయాణం విశిష్టమైనది. ఈ ప్రయాణంలో కల్సిన సెల్విన్ అనే యువకుడితో జరిగిన ఎలెక్ట్రానిక్ సంభాషణం ఆసక్తికరంగా ఉంటుంది. చిచికాస్తెనాంగోలో టూరిస్ట్ ఆఫీసులోని మహిళ తమ ప్రాచీన మయాన్ సంస్కృతికీ, భారతీయ సంస్కృతి ఉన్న పోలికల గురించి రచయితతో సంభాషిస్తుంది. అతిత్లాన్ సరోవరం వద్ద జెమ్మా అనే మహిళ చేసిన సాయం గురించి తెలుసుకోడం ఆసక్తికరంగా ఉంటుంది. భారతదేశపు బ్రాహ్మణుల గురించి, వారు అనుసరించే శాకాహార పద్ధతుల గురించి ప్రశ్నించిన జూలియా అనే మహిళ, రచయిత చెప్పిన సమాధానంతో కాస్త నిరాశ చెందుతుంది, ఎందుకో తెలుసుకోవాలంటే ఈ పుస్తకం చదవాలి. రచయితకిఆతిథ్యమిచ్చిన సెర్జియో గొప్ప మనిషి! ద్వీపనగరం ఫ్లోరెస్ లోని బస్ స్టాండ్ చూస్తే, రచయితకి తమ చిన్నప్పటి బోధన్ బస్ స్టాండు, ఆ పరిసరాలు గుర్తొచ్చి, నలభై ఏళ్ళ నాటి జ్ఞాపకాలు వెల్లువలా ముందుకొస్తాయి. ఫ్లోరెస్ నుంచి నూట పది కిలోమీటర్లు బస్లోఁచ ప్రయాణించి సరిహద్దు దేశమైన బెలీజ్లో ప్రవేశిస్తారు. ఒకప్పటి బ్రిటీష్ వలస దేశం కావడంతో లతీనో సంస్కృతి కన్నా, ఆంగ్ల సంస్కృతే బెలీజ్లోవ ఎక్కువగా కనబడిందని అంటారు డా. శేషగిరి. మయాన్ నాగరికతలో భాగమైన తికాల్ గురించి చెబుతూ, బయటి ప్రపంచానికి తెలియదు కాని స్థానిక ప్రజానీకానికి ఆ అడవి మాటున ఒక ఊరు ఉందని ముందు నుంచి తెలుసని అంటారు. తికాల్ ప్రాంగణంలో అక్కడి గైడ్ సోత్తోమ జరిగిన అర్థవంతమైన చర్చ ఎన్నో అపోహలను తొలగిస్తుంది. గ్వాతెమాల సిటీ నుంచి షటిల్ బస్‌లో ఓందురస్ చేరుతారు. ఈ దేశంలో మొదటి బస కొపాన్ రుయినాస్ అనే పట్నం. ఇక్కడ రచయితకి బస్సు డ్రైవర్ నెల్విన్ చేసిన సాయం మరువలేనిది. కొపాన్ శిథిలాలు చూపించ




డానికి వచ్చిన మార్కో, గైడ్ మాత్రమే కాదు, గొప్ప ఫోటోగ్రాఫర్ కూడా. మార్కో చెప్పిన మయన్ల బంతాట వివరాలు అత్యంత ఆసక్తికరంగా ఉంటాయి. తిరిగి వస్తుండగా కలిసిన మానుయేల్ అనే జూనియర్ ఆర్కియాలజిస్ట్ తమ దేశపు పేదరికం గురించి వాపోతూ, అందుకు కారణాలను చెప్తాడు. బాధనిపిస్తుంది.

బిట్ కాయిన్ కంట్రీగా పేరు పొందిన ఎల్. సల్బదోర్‌కి బస్సులో వెళ్తారు. రికార్డో అన్న వ్యక్తి ఈ దేశంలో రచయితకి దర్శనీయ స్థలాలు చూపిస్తాడు, తమ దేశం గురించి వివరిస్తాడు. ఈ దేశంలో చాలామందికి అమెరికా వెళ్ళాలనే ఆకాంక్ష బలంగా ఉందని గ్రహించిన రచయిత, అందుకు ప్రేరణ ఏంటని రికార్డో అని అడిగితే, అతను చెప్పిన జవాబు మంచి ఉద్యోగాలు, మెరుగైన జీవితం అని! కానీ వర్తమాన పరిస్థితులలో అమెరికాలో అది సాధ్యమేనా? ఇక్కడ ప్రసిద్ధమైన రూతా దె లాస్ ఫ్లొరెస్ (పూల దారి) సందర్శించడం గొప్ప అనుభవం. ఇక్కడ ఓ రెస్టారెంలో కలిసిన మెహికో (మెక్సికో) దేశపు లాయర్ ఎదుర్వార్డో అక్కడి ఒకప్పటి హృదయవిదారకమైన ఊచకోత ల మతాన్స గురించి మనసు కరిగేలా వివరిస్తాడు. తదుపరి మజిలీ నికరాగ్వా. రచయిత బ్యాగేజ్ సకాలంలో రాకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతాయి. ప్రయాణాల్లో ప్రతి ప్రతి కూలతా ఒక అవకాశాన్ని కల్పిస్తుందనీ, మనల్ని మనం సవ్యంగా శ్రుతి చేసుకోగలిగితే ప్రతి దురదృష్టమూ ఒక అదృష్టంగా మారవచ్చనిఅంటారు. ఇక్కడి మసాయ అగ్నిపర్వతపు బిలపు వర్ణన చదువుతుంటే, మనమూ అక్కడే ఉన్నామా అన్న అనుభూతి కలుగుతుంది. లేక్ నికరాగ్వాలో పడవ నడిపిన రొబేర్తో దియాస్ చక్కని విషయ పరిజ్ఞానం ఉన్న వ్యక్తి. ప్రపంచంలోకెల్లా సొరచేపల్ని కలిగివున్న ఒకే ఒక్క సరోవరం లేక్ నికరాగ్వా అని అతను రచయితకి చెప్తాడు.

కోస్త రిక వెళ్ళేందుకు బస్ కోసం ఎదురు చూస్తున్నప్పుడు రచయితకిపుఎర్తో రీకొ (Puerto Rico) కి చెందిన ఓ కుటుంబం తారసపడుతుంది. అమెరికా నీడలో ఉండడం మీకు ఇబ్బందిగా లేకుండా ఉందా? అని రచయిత అడిగితే, వాళ్ళు చెప్పిన సమాధానంలో, వారి జీవన విధానం పట్ల సంతృప్తి గోచరిస్తుంది. బయటంతా చిక్కని పచ్చని ప్రకృతి నిండి ఉన్న ఛాయలు కనిపిస్తున్నా, ఆగని వాన వల్ల ప్రకృతిని, ప్రయాణాన్నీ ఆస్వాదించలేకపోతారు. కోస్తా రీక దేశపు యాత్రంతా వర్షార్పణం!

పనామా చేరిన రచయిత పనామా కాలవని సందర్శించి దాని గొప్పతనాన్ని వివరిస్తారు. పనామా నగరపు యాత్రలో భాగంగా దరియేన్ గాప్ (Darin Gap) గురించి రచయిత చెప్పిన వివరాలు విస్తుగొల్పుతాయి. ఈ దరియేన్ గాప్‌ను దాటుకుని వెళ్ళడమన్నది ఈ భూమండలంలోకెల్లా అత్యంత ప్రమాదకరమైన ప్రయాణమని కొందరి భావన అని అంటారు. పనమా దేశం వెళ్ళిన ఏ మనిషీ ఆ దేశపు పేరుతోప్రసిద్ధమైన టోపీలను కొనకుండా ఉండడని చెబుతారు.అయితే పనామా టోపీలు తయారయ్యేది ఎక్వదోర్లోప అని తెలుసుకున్నప్పుడు రచయితలో కలిగిన ఆశ్చర్యమే పాఠకులలోనూ కలుగుతుంది. బేర్‌ఫుట్ టూర్స్ అన్న ఏజెన్సీలో పనిచేస్తోన్న మనిషి గోంజో. యాత్రికులలో ఒకరు, యునైటెడ్ స్టేట్స్‌ను ఉద్దేశించి అమెరికా అనే పదం అనివాడినప్పుడు గోంజో తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తాడు. పనమా దేశం జీవవైవిధ్య నిధి అంటారు రచయిత.

కొలంబియా రాజధాని బొగొతాలో పరిచయమైన గుస్తావొ విశిష్టమైన వ్యక్తి. అతని గురించి తెలుసుకోవడం ఆసక్తికరంగా ఉంటుంది. అక్కడ్నించి ఎక్వదోర్ వెళ్ళిన రచయిత భూమధ్య రేఖ అని విశ్వసించే ప్రాంతాన్ని, ఇంతిన్యాన్ మ్యూజియమ్ను చూస్తారు, కరోలినా పార్కులో తిరుగుతారు. కొతకాచి కయాపాస్ నేషనల్ పార్కుని, లగూనా దె కుయికోచ అనే సరోవారాన్ని సందర్శిస్తారు.
కీతో నగరంలోని పిచించా జ్వాలాముఖిని చూసినప్పుడు కలిగిన అనుభూతిని గొప్పగా వర్ణించారు. ఇక్కడ చేసిన ఓ ట్రెకింగ్లోమరచయిత తన మనసు చేసిన ఓ చక్కని సూచనని గౌరవిస్తారు. మరుసటి రోజు కొతోపాక్సీ వోల్కనోని చూస్తారు. కొత్త వ్యక్తుల పరిచయాలు ఆనందం కలిగిస్తాయి. ఇందుకు గొప్ప ఉదాహరణ ఆండ్రియా. గలాపగోస్ ద్వీపాలను దర్శించటం ఒక అద్భుతమైన అనుభవమని, ఏ చీకూ చింతా లేకుండా నింపాదిగా తిరుగాడే రాకాసి తాబేళ్ళను చూడటమన్నది అపురూప దృశ్యమని చెప్తారు.

కొలంబియాలో జనవైవిధ్యం అపారమని చెబుతారు. కొలంబియాలో ఐదవ పెద్ద నగరం, దేశపు బొలీవార్ ప్రావిన్స్‌కు రాజధాని ఐన కార్తహేనలో తిరుగాడుతారు. మొత్తం దక్షిణ అమెరికా ఖండానికే కార్తహేన నగరం ఉత్తర ముఖద్వారమంటారు. పిల్లవాడి కోసం పాలపొడి కొనివ్వమని సంజ్ఞల ద్వారా అడిగిన మహిళని నమ్మాలా వద్దా? సంశయిస్తారు. సాయం చేసాకా, ఆమె మోసగించిందనిగ్రహిస్తారు. ఓ కొండగుట్ట మీద ఉన్న కార్తహేన కోట - కాస్తీయో ద సాన్ ఫెలిపె బహారాస్ అన్నదాన్ని సందర్శిస్తారు.

మెదెయిాన్ నగరంలోకి ప్రవేశిస్తూ, పాబ్లో ఎస్కోబార్ అనే నేరస్థుడి గురించి తెలియజేస్తారు. ఈ నగరానికి ఒకప్పుడు హత్యల రాజధాని, కొకైన్ కాపిటల్ అని పేర్లుండేవిట. కానీ మనిషి తన జీవితాన్ని ఎలాపునర్నిర్మించుకోగలడో చూసే అవకాశం మెదెయిాన్ అందించగలదన్న చిన్నఆశ అక్కడికి వెళ్ళేలా చేసింది రచయితని. కొలంబియా దేశంలోనే రంగులీనే పట్నంగా పేరున్న గ్వాతాపెలో అత్యంత ఆకర్షణీయమైన రిక్షాలు కనిపించాయట.

చివరగా కొలంబియా రాజధాని బొగొతాలో తిరుగాడుతారు. ఇక్కడ గోల్డ్ మ్యూజియమ్, బొతేరో మ్యూజియమ్, కరేరా సెప్తిమో (Carrera 7) అనే వీధి, పాలస్ ఆఫ్ జస్టిస్, బొలీవార్ ప్లాజా, గ్వాతవీత పట్టణం చూస్తారు. 'గ్వాతవీత లేక్ నేషనల్ పార్క్' గేట్ల వద్ద తెలుగు దంపతులు పరిచయమై, సంతోషాన్ని కలిగిస్తారు. ఎల్ దొరాదో ఉనికి కోసం జరిగిన ప్రయత్నాలను వివరిస్తారు. సిపాకీరా ఉప్పుగనులను దర్శించి, వాటి విశేషాలను వివరిస్తారు. సాన్తాన్దేర్ (Santander) కూడలి వద్ద ఉన్న ఎమరాల్డ్ మ్యూజియమ్ సందర్శించడం గొప్ప అనుభవం.
16 రోజుల ప్రయాణాన్ని ముగిస్తూ, "నాలోకి నేను చేసే తీర్థయాత్రలే నా ప్రయాణాలు" అనడం ప్రయాణాల పట్ల ఆయనకున్న ప్రేమని వెల్లడిస్తుంది.

ఇద్దరు యాత్రికుల జుగల్బందీ ఈ 'మనమెరుగని లాటిన్ అమెరికా'.

ఆలంబన ప్రచురణలు వారి ఈ 402 పేజీల పుస్తకం వెల 300 రూపాయలు. నవోదయ బుక్ హౌస్, హైదరాబాద్ (ఫోన్: 9247471361) లోను, విజయవాడ పల్లవి పబ్లికేషన్స్ (ఫోన్: 98661 15655) లోను, అనువాదకులు దాసరి అమరేంద్ర (ఫోన్: 98189 82614) వద్ద ప్రతులు లభ్యం. తెలుగుబుక్స్.ఇన్ అనే వెబ్సైటట్ ద్వారా ఆన్లైన్లో ఆర్డర్ చేయవచ్చు.

- కొల్లూరి సోమ శంకర్, 9948464365

# చలం - (1929)

మంచి సారస్వతం రెండు రకాలు

1. అందమైన పటమల్లె గోడని వేలాడుతూ, మనసుని అందాలతో నింపేది..
2. ఉరిమి, చించి, చెండాడి, మంచికో చెడ్డకో జీవితాన్ని 'ఇంఫ్లుయెన్స్' చేసేది

# సిన్నమ్మి పాట

గట్టు పక్కన
మేకల్ని అదిలిస్తోన్న పాట

పాటలో ఎన్ని వృత్తులు
బొమ్మలై నిల్చున్నాయో

పల్లె పాట నిండా
అపుడే కాసిన జొన్నకంకుల
వాసన

సంటిమేకల గెంతులా
పిల్లవాగు సడిలా
దొరమాగిన పండులా
చిన్నమ్మి పాట

గాలి సింత సెట్టు కింది కూకోని
తాటికల్లు తాగిన మైకంగా
పాట వింటోంది

ఎచ్చని పొద్దు
పచ్చని పైరు పక్కన నిల్సోని
నవ్వుతా సూస్తోంది

సెలిమ లాంటి గొంతు యిని
చెర్లో బాలింత సేప

పిల్లల్ని ముదిగారంగా
సూస్తోంది

పండిన రేగ్గాయలు రాలి
పిల్ల పాటను అందుకోవాలని
తన గజ్జెల వెంట
దొర్లుతున్నాయి

పదానికి గొంతుకు మధ్య
ప్రాణాన్ని ముడి వేసి
పాడుకుంటోంది తను

పాటగత్తె సుట్టూ
పదాలు
కోలాటమాడుతున్నాయి

గువ్వలు కూయడం మాని
పాట సొగసుకు
కులుకుతోన్నాయి

ఆ యమ్మి కుదురు లయకు
వేపచెట్టు పూతను రాల్చి
మత్తుగా ఊగుతోంది

నీరెండ కుక్కపిల్లలా

వెంబడిస్తూ
రాలిన పాట ముక్కల్ని
ఏరుకుంటోంది

సాయంత్రం
వానను పిలుస్తోంది
స్తన్యం లాంటి గీతాన్ని
బెరీన ఇని ఎల్లమని

కూలిన మంటపం కాడ
తాత నవ్వుతున్నాడు
అంటు లేని పాట
ఎంత కమ్మగుందోనని

కొండ మీద నామాల సామి
జోకొడుతోన్న పాటకు
శిశువులా రెప్పలు మూశాడు

సూఫీ సన్యాసి వెడుతూ
వెడుతూ
పాటను జోలెలో దాచుకుని
మాయమయ్యాడు.

తెలుగు వెంకటేష్, 9985325362

# కథా సంపుటాలకు ఆహ్వానం

"వెన్నెల సాహితీ పురస్కారం-2024" కొరకు..2023,2024 సం. లలో ప్రచురించిన కథా సంపుటాలు నాలుగు (4) ప్రతులను ఈక్రింది చిరునామాకు, 31మార్చి 2025లోపు పంపగలరు. సిద్దిపేటలో జరుగు సాహిత్య కార్యక్రమంలో నగదు పురస్కారం అందజేయబడును.
చిరునామా, P.యాదగిరి,ఇం.నెం.17-3-86/35, జ్యోతి నిలయం, వినాయక్ నగర్ రోడ్-2, మయూరి బార్ &రెస్టారెంట్ ఎదురు వీధి, రంగధాంపల్లి చౌరస్తా దగ్గర సిద్ధిపేట,502103,cell.9299909516,9848261284.
- పర్కపెల్లి యాదగిరి, వెన్నెల సాహితీ సంగమం,ప్రధాన కార్యదర్శి

# సీపీకి ఘన వీడ్కోలు



**హన్మకొండ, మహా ;** వరంగల్ పోలీస్ ఎవర్ విక్టోరియస్‌ని, ఇక్కడ పనిచేయడం సంతృప్తినిచ్చిందని బదిలీపై వెళ్ళుతున్న పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు రామగుండం పోలీస్ కమిషనరేట్‌కు బదిలీ పై వెళ్ళుతున్న అంబర్ కిషోర్ ఝా తో పాటు, సిఐడి ఎస్పీగా బదిలీ అయిన ఈస్ట్ జోన్ డిసిపి రవీందర్‌ను వరంగల్ పోలీస్ కమిషనరేట్ పోలీస్ అధికారులు ఆదివారం పూల వర్షాన్ని కురిపించి ఘనంగా సత్కరించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయం లో ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు, బదిలీపై వెళ్ళుతున్న అంబర్ కిషోర్ ఝా తో పాటు డిసిపి రవీందర్‌లను పుష్పాగుచ్చాలు అందజేసి జ్ఞాపికలను అందజేసారు. ఈ సందర్భం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ వరంగల్ జిల్లాతో ఆరు సంవత్సరాల అనుబంధం వుందని, ఒఎస్డీగాను, ఎస్పీగా ఇక్కడే పనిచేయడంతో పోలీస్ కమిషనర్‌గా కూడా వరంగల్ లో పనిచేయడం చాలా సంతోషాన్ని కలిగించిందని. నేరస్థులను పట్టుకోవడం వరంగల్ పోలీసులు దిట్టయని, ఎలాంటి పని అయిన దానిని విజయవంతంగా పూర్తి చేయడంలో వరంగల్ పోలీసులు ప్రత్యేకతని చూపారని రాణిరుద్రమ దేవి పాలించిన ఈ నెల పై పనిచేసినందుకు నేను గర్వపడుతున్నాని పోలీస్ కమిషనర్ తెలిపారు. డిసిపి రవీందర్ మాట్లాడుతూ ఈస్ట్ జోన్ డిసిపిగా పనిచేయడం సంతృప్తి కలిగించిందని, ఇక్కడి అధికారులు, సిబ్బంది సమన్వయంతో చెయడం ఇక్కడి పోలీసుల ప్రత్యేకతని డిసిపి తెలిపారు. పూల వాహనంలో అంబర్ కిషోర్ ఝా కు ఘనంగా వీడ్కోలు బదిలీపై వెళ్ళుతున్న పోలీస్ కమిషనర్ కమిషనర్ అంబర్ కిషోర్‌ను సుందరంగా పూలతో అలంకరించిన పోలీస్ వాహనాన్ని డిసిపి స్థాయి నుండి కానిస్టేబుల్ వరకు త్రాడుతో వాహనాన్ని లాగుతూ గౌరవంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో డిసిపిలు షేక్ సలీమా, రాజమహేంద్ర నాయక్, అంకిత్‌కుమర్, ఏఎస్పీ చైతన్య, అదనపు డిసిపిలు రవి, సురేష్‌కుమార్, ఏసిపిలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్.ఐలు, ఎస్.ఐలు, ఆర్.ఎస్.ఐలు ఇతర పోలీసుల తో పాటు పరిపాలన విభాగం, సిబ్బంది పాల్గోన్నారు.

# ఆరు నెలల్లో వంతెన నిర్మాణం పూర్తి చేస్తాం

- ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తుదారులు రాయితీని సద్వినియోగం చేసుకోవాలి
- పెండింగ్ పనులన్నీ త్వరితగతిన పూర్తి చేస్తాం
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- రూ. 6 కోట్ల 85 లక్షలతో బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన
- హాజరైన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**వేములవాడ, మహా :** తిప్పాపూర్ నుంచి వేములవాడ పట్టణాన్ని అనుసంధానం చేసే రెండో వంతెన నిర్మాణాన్ని ఆరు నెలల్లో పూర్తి చేయిస్తామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ రెండో బ్రిడ్జి నిర్మాణానికి రూ 6కోట్ల 85లక్షల వ్యయంతో ఆదివారం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝాతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడారు. మల్రిపెల్లి రిజర్వాయర్, కలికోట సూరమ్మ చెరువు రిజర్వాయర్, లచ్చపేట రిజర్వాయర్, చందుర్తి మోత్కరావుపేట రోడ్డు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయిస్తున్నామని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారం, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా చొరవతో భారీగా నిధులను ఈ ప్రాంత అభివృద్ధికి మంజూరు చేస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల వేములవాడ పట్టణంలో సుమారు రూ. 700కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. రూ. 47 కోట్లతో రోడ్డు వెడల్పు, రూ.35 కోట్లతో నిత్య అన్నదాన సత్రం, ఆలయ విస్తీర్ణ చేపడుతున్నామని పేర్కొన్నారు. భక్తులకు శీఘ్రంగా దర్శనం కలిగించేలా ఆలయ విస్తరణ చేపడుతున్నమని విప్ తెలిపారు. మే నెలలో శృంగేరి పీఠాధిపతి విధుశేఖర శేఖరశర్మ వేములవాడ కు రానున్నారని వెల్లడించారు. ఆలయ నిర్మాణ సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా స్వామి వారి దర్శనాన్ని భీమేశ్వర ఆలయంలో ఏర్పాటు చేయడం జరుగుతుందని వివరించారు. ఉత్తమ విద్య అందించేలా రుద్రంగి మండల కేంద్రంలో ఎటీసి కాలేజ్, మేడిపల్లి జూనియర్ కళాశాల మంజూరు చేయడం జరిగిందని వివరించారు. బ్రిడ్జి నిర్మాణంలో నష్టపోయే వారికి తప్పకుండా నష్టపరిహారం చెల్లిస్తామని వెల్లడించారు. నష్టపోయే వారికి భూసేకరణ చట్టం ప్రకారం తప్పకుండా న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. ఎన్నికల కోడ్ తో పనుల్లో కొంత జాప్యమైందని చెప్పారు. దుకాణాలు పూర్తిగా కోల్పోతున్న వారికి మధ్య మార్గం ద్వారా ప్రత్యామ్నాయం చూస్తున్నామని తెలిపారు. రైల్వే లైన్లో భూమి పోతున్న వారికి కూడా తప్పకుండా న్యాయం చేస్తామని విప్ స్పష్టం చేశారు. త్వరలోనే లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. బస్ డిపో పక్కన ఆగిపోయిన ఇళ్ల నిర్మాణం చేపడతామని తెలిపారు.

**రూ.80 లక్షలతో మార్కెట్ సముదాయం**

వేములవాడ పట్టణంలోని రెండవ బైపాస్ రోడ్ లో రూ.80 లక్షలతో అన్నీ ఒకే రకంగా కూరగాయల సముదాయం ఏర్పాటు చేయడం జరుగుతుందని వివరించారు. కొనుగోలుదారులు, అమ్మకందారులకు ఉపయోగపడేలా, సౌకర్యంగా ఉండేలా నిర్మాణాలు చేయిస్తామని విప్ తెలిపారు. వేములవాడ పట్టణంలో ప్రతి వార్డులో 10 లక్షలతో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని ప్రకటించారు. ఇప్పటికీ పట్టణంలో 34 సంఘ భవనాల నిర్మాణాలకు నిధులు ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. నిత్యం తాను ప్రజల మధ్యలో ఉంటూ ప్రజల కష్టసుఖాల్లో పాలు పంచుకుంటునన్నారు. కోనరావుపేట మండల పరిధిలో త్వరలోనే పెండింగ్లో ఉన్న బ్రిడ్జిల నిర్మాణాన్ని చేపడతామని ప్రకటించారు. వేములవాడ పట్టణంలో గంగమ్మ దేవాలయానికి ఒక నడిచిపోయేట్రాక్ ఏర్పాటు చేస్తామని విప్ తెలిపారు. ప్రజలు తమ ప్లాట్లను క్రమబద్ధికరించుకునేందుకు ప్రభుత్వం ఈ నెల 31వ తేదీ వరకు అవకాశం కల్పించిందని పేర్కొన్నారు. అర్హులైన వారందరూ తప్పకుండా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. తద్వారా 25 శాతం రాయితీ కల్పిస్తారని తెలిపారు. వేములవాడ నియోజకవర్గంలో అర్థాంతరంగా ఆగిపోయిన అన్ని పనులను పూర్తి చేస్తామని విప్ ఆది శ్రీనివాస్ హామీఇచ్చారు.



**విప్ ప్రత్యేక శ్రద్ధతోనే..**

కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వేములవాడలో దాదాపు 10 సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న బ్రిడ్జి నిర్మాణ పనులను ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక శ్రద్ధతోనే పనులు ప్రారంభమయ్యాయని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి, ఆయా శాఖ మంత్రులను ఒప్పించి బ్రిడ్జి నిర్మాణ పనులకు ప్రభుత్వ విప్ నిధులు మంజూరు చేయించారని గుర్తు చేశారు. భూసేకరణ ఇతర పనులను రెండు నెలల్లో పూర్తి చేసిన వేములవాడ ఏ ఆర్డీవో, తహసిల్దార్, ఆర్ అండ్ బి, మున్సిపల్ శాఖ, నీటిపారుదల అధికారులను కలెక్టర్ అభినందించారు. ఆయా శాఖల అధికారులు సమన్వయంతో బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్ అండ్ బీ డీఈ శాంతయ్య, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, డి ఈ శాంతయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్ సభ్యులు ఉన్నారు.

# పోలీస్ కమిషనర్ గా గౌస్ ఆలం ఐపీఎస్ బాధ్యతల స్వీకరణ



**కరీంనగర్, మహా ;** కరీంనగర్ నూతన పోలీస్ కమిషనర్ గా గౌస్ ఆలం ఐపీఎస్ ఆదివారం నాడు భాద్యతలు స్వీకరించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేసిన బదిలీలలో భాగంగా ఆదిలాబాద్ ఎస్పీగా పనిచేస్తున్న ఆయన నూతన కరీంనగర్ పోలీస్ కమిషనర్ గా నియమించబడ్డారు. బాధ్యతల స్వీకరణకు కరీంనగర్‌కు విచ్చేసిన గౌస్ ఆలం ఐపీఎస్, కరీంనగర్ పోలీస్ కమీషనర్ గా ఉన్న అభిషేక్ మొహంతి ఐపీఎస్ ను పూల మొక్కను అందించి మర్యాద పూర్వకంగా కలిశారు. కమిషనరేట్ లోని నేరాలు , శాంతి భద్రతల గురించి తెలుసుకున్నారు. నూతన పోలీసు కమీషనర్ కు సాయుధ బలగాలు గౌరవ వందనం సమర్పించాయి. అనంతరం కమిషనరేట్ లోని పోలీస్ అధికారులు నూతన పోలీసు కమీషనర్ కు పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కరీంనగర్ నూతన పోలీస్ కమీషనర్ మాట్లాడుతూ ముఖ్యంగా నేరాల నియంత్రణ పై ప్రధాన దృష్టి సారిస్తామన్నారు. శాంతిభద్రతలు కాపాడటం, రోడ్డు భద్రత, ఉల్లంఘనల నివారణ, పట్టణ పోలీసింగ్‌పై దృష్టి సారించడం, పౌరఆధారిత పోలీసింగ్ సేవలు , ప్రజా భద్రతా సమస్యలు పరిష్కరించుట కృషి చేస్తామన్నారు. పోలీసింగ్‌లో సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా ఉపయోగిస్తామన్నారు. కమిషనరేటులోని పోలీసు అధికారుల మరియు సిబ్బంది సంక్షేమం కొరకు ఎల్లప్పుడూ పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ ఏ లక్ష్మినారాయణ, రూరల్ ఏసీపీ శుభం ప్రకాష్ ఐపీఎస్, ప్రొబేషనరీ ఐపీఎస్ వసుంధర యాదవ్ కమిషనరేట్ లోని ఏసీపీ లు , ఇన్స్పెక్టర్లు , ఆర్ ఐ లు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# అధికారులే అమ్మానాన్నయ్యారు

- అధికారులే అమ్మానాన్నయ్యారు
- అంగరంగ వైభవంగా అనాథ యువతి వివాహం
- కరీంనగర్ కళాభారతిలో పెళ్లి జరిపించిన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి
- మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



**కరీంనగర్, మహా ;** బాజా భజంత్రీలు.. మేలా తాళాలు ఒకవైపు.. పెద్ద ఎత్తున అతిథులు.. వేద పండితుల మంత్రోచ్చారణాలు మరోవైపు.. కోలాహలం. సందడే సందడి.. కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం సాయం అందించిన సందర్భం ఆది. అదొక వైభవోపేతంగా జరిగిన ఘట్టం.. సాంప్రదాయ బద్ధంగా నిర్వహించిన వివాహ వేడుక.. ఈ వేడుకకు కరీంనగర్ లోని కళాభారతి ఆడిటోరియం వేదిక అయింది. ఈ పెండ్లికి పెద్దలుగా జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పెద్దలుగా వ్యవహరించారు. ఈ వివాహ వేడుకకు ఒక ప్రత్యేకత ఉంది. అదేంటంటే.. మహిళాభివృద్ధి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల సదనంలో పెరిగిన ఓ అనాథ యువతికి ఆదివారం కరీంనగర్ కళాభారతి లో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆధ్వర్యంలో వివాహ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిపించారు. ఆ యువతికి తల్లిదండ్రులు లేరు. అనాథ అయినా ఎలాంటి లోటు రాకుండా అధికారులే అమ్మానాన్న అయ్యారు. తల్లిదండ్రుల బాధ్యతలు నిర్వర్తించారు జిల్లా కలెక్టర్. ఆమెకు కలెక్టర్, ఎమ్మెల్యే సత్యనారాయణ, అధికారులందరూ పెద్దదిక్కుగా నిలిచారు. ఏ యువతికి కూడా జరగని విధంగా కళ్యాణ మహోత్సవాన్ని జరిపించి కరీంనగర్ జిల్లాలోనే నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. అనాథలకు మేము తోడుగా నిలుస్తామనే భరోసాను కల్పించారు. అనాథలు ఎవరు కూడా ఎవరూ లేరనే బాధ పెట్టుకోవద్దని నిరూపించారు. అధికారులు అందరూ సహాయం అందించారు. అందరూ కలిసి మౌనిక వివాహాన్ని అంగరంగ వైభవంగా జరిపించారు. కరీంనగర్ జిల్లాలోనే నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. అనాథలకు మేమున్నామనే భరోసా కల్పించారు అధికారులు.

# భూ సేకరణ కోసం గ్రామ సభలు

**కాటారం, మహా :** చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందించేందుకు భూసేకరణ కోసం గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు కాటారం మండల తహశీల్దార్ నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. గారెపల్లి గ్రామంలో గల స్టేజ్ 2 పంపు హౌస్ నుండి రుద్రారం వరకు కాలువల నిర్మాణం కోసం 4.38 గుంటల భూ సేకరణ కోసం కాటారం లో గల రైతు వేదికలో సోమవారం ఉదయం 10.30 లకు, 12 వ తేదీన చిద్నేపల్లి గ్రామ పంచాయతీ లో బాప్పారం, చిద్నేపల్లి, చింతకాని, ప్రతాపగిరి గ్రామాల లోని 32.38 ఎకరాల, జాదరావుపేట గ్రామంలో గూడూరు పెద్ద చెరువు కింద ఎకరాల 518 గుంటల భూసేకరణ కోసం 11 వ తేదీన గ్రామసభ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపారు. ఈ గ్రామ సభలకు ఆయా గ్రామాలకు చెందిన భూమి కోల్పోతున్న రైతులు తమ సందేహాలను తెలపాలని తహశీల్దార్ వివరించారు.


# గాండ్ల కులస్థుల అభ్యున్నతికి కృషి చేస్తా

**వరంగల్ ఎంపీ కడియం కావ్య**



**హనుమకొండ , మహా :** గాండ్ల కులస్తుల అభ్యున్నతికి, సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని వరంగల్ ఎంపీ కడియం కావ్య తెలిపారు.పెద్ద పెండ్యాల ఆర్.కె గార్డెన్స్ లో అఖిల గాండ్ల తెలికుల సంఘం హనుమకొండ జిల్లా నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం మహోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మహిళలు పురుషులతో సమానంగా రాణించినప్పుడే సమాజంలో గౌరవం దక్కుతుందన్నారు. మహిళలు ఉద్యోగ పరంగా, రాజకీయ పరంగా ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. అధ్యక్షుడు డా.జక్కం సురేదర్ చేస్తున్న సామాజిక, సేవా కార్యక్రమాల వల్లనే అధ్యక్షుడిగా ఎన్నిక కావడం జరిగిందన్నారు. గానుగ నూనెలు ప్రజల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తున్నాయని వెల్లడించారు. గాండ్ల కులస్తులు ఐకమత్యంగా వారి హక్కుల కోసం పోరాడి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. గాండ్ల కులం అభివృద్ధికి తనవంతు సహాయం చేస్తానని కావ్య స్పష్టం చేశారు. తన ఎంపీ లాడ్స్ నుండి గాండ్ల కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి మంజూరు ఇస్తానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు, రాష్ట్ర మహిళా అధ్యక్షులు అన్నపూర్ణ, రాష్ట్ర మహిళా ట్రెజరర్ పుష్పలత, జిల్లా మహిళా అధ్యక్షులు ఉమా, రాష్ట్ర ఉపాధ్యక్షులు రాము, అధ్యక్షులు జక్కం సురేందర్, ప్రధాన కార్యదర్శి శివ తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల సంఘం అడ్ హక్ కమిటీ ఏర్పాటు




**వరంగల్, మహా;** వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ పూర్వ విద్యార్థుల సంఘం అడ్ హక్ కమిటీ కన్వీనర్‌గా ఈవీ శ్రీనివాస్ రావు నియామకం జరిగింది. వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ 70 ఏళ్ల పూర్వ విద్యార్థుల సంఘం కార్యవర్గ సమావేశం ఆదివారం కళాశాల ప్రాంగణంలోని కార్యాలయంలో సంఘ ప్రధాన కార్యదర్శి పడిశాల ఆనంద్ కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పూర్తిస్థాయి కమిటీని ఈ నెల 23వ తేదీన జరిగే జనరల్ బాడీ సమావేశం లో ఎన్నుకోనున్నట్లు తెలిపారు. అప్పటి వరకు పూర్వ విద్యార్థులందరూ సభ్యత్వం నమోదు చేసుకోవాలని, వివిధ పదవులకు ఆసక్తిగలవారు తమ పేర్లను అడ్ హక్ కమిటీ వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎల్లయ్య, మధుసుధన్ రావు, శంకర్, మేకల అక్షయ్ కుమార్, మురళీధర్, భిక్షపతి, మహేందర్, కుమార్, సతీష్ రెడ్డి, ఈ శ్రీనివాస్, వసంత్ కుమార్, అజయ్, రాజ్ కుమార్, విఘ్నేష్, వెంకన్న, శ్రీకాంత్, మనిష్ లు పాల్గొన్నారు.

# అధికారులు క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనులను పరిశీలించాలి

**ములుగు, మహా :** ఆఫీసర్లు క్షేత్ర రైతులతో వేరువేరుగా సమావేశమ

- మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలి
- మంత్రి దనసరి అనసూయ (సీతక్క)




స్థాయిలో పనులను పరిశీలిస్తూ నాణ్యతా ప్రమాణాలపై దృష్టి సారించి పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని, రానున్న మేడారం మహాజాతరపై అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటిపారుదల, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ దనసరి అనసూయ (సీతక్క) ఆదేశించారు. ఆయా పనులు చేపట్టే కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదని హెచ్చరించారు. ములుగు జిల్లా పర్యటనలో భాగంగా ఆదివారం ములుగులోని పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో కాన్ఫరెన్స్ హాల్ ను ప్రారంభించిన మంత్రి సీతక్క అనంతరం కలెక్టరేట్ లో జిల్లా అధికారులు, రామప్ప- లక్నవరం సరస్సు కెనాల్ భూ నిర్వాసిత య్యారు. అదేవిధంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని ఉత్తమ సేవలు అందించిన మహిళా అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు, మెమొంటోలు అందజేశారు. అనంతరం గోవిందరావుపేట మండలం రాఘవపట్నం లో ఇందిరమ్మ ఇండ్లకు భూమిపూజ చేశారు. ములుగులో కలెక్టర్ దివాకర, డీఎఫ్వో రాహుల్ కిషన్ జాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్ లతో కలిసి జిల్లా అధికారులతో జరిగిన సమీక్షలో మంత్రి సీతక్క మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న అభివృద్ధి పనులలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని, చేపట్టిన అభివృద్ధి పనులను నిర్ణీత సమయం లోపు పూర్తి చేయాలని సూచించారు. జాతీయ రహదారి 100కిలోమీటర్లు, గోదావరి పరిహక ప్రాంతం 100కిలోమీటర్లు ఉందని, పలు ప్రాంతాల నుండి వచ్చే పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆర్అండ్ బి, పంచాయతీరాజ్, ట్రైబల్ వెల్ఫేర్ శాఖల నుంచి చేపట్టిన పనులను నాణ్యత లోపించకుండా త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. ప్రస్తుత వేసవికాలంలో గ్రామాలలో మంచినీటి ఎద్దడి ఏర్పడకుండా ముందస్తు ప్రణాలికను సిద్ధం చేసుకోవాలన్నారు. రానున్న మహా మేడారం జాతరను పురస్కరించుకొని చేపట్టనున్న పనులపై అధికారులు అంచనాలు తయారు చేయాలని, జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయని పక్షంలో చర్యలు తప్పవని, ఈ విషయంలో సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు కాంట్రాక్టర్లకు ఆదేశాలు జారీ చేయాలని మంత్రి తెలిపారు. గ్రామాలలో మంచి నీటిని సరఫరా చేసే ట్యాంకులను శుభ్రం చేయాలని, చెరువులు, కుంటల్లో నీరులేని సమయంలో వాటికి అవసరమైన మరమ్మతులను చేపట్టాలని సూచించారు.

# పన్ను వసూళ్ల పురోగతిని పరిశీలించిన కమిషనర్




**హన్మకొండ, మహా;** హనుమకొండ నగర పరిధి ఎస్ బి హెచ్ కాలనీ, 64 వ డివిజన్ పరిధి లోని టి ఎన్ జీ ఓస్ కాలనీలలో పన్ను వసూళ్ల తీరును ఆదివారం బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే క్షేత్రస్థాయిలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి పన్ను వసూళ్ల తీరును పరిశీలించి సమర్థవంతంగా నిర్వహించుటకు అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భం గా కమిషనర్ మాట్లాడుతూ నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని, పన్ను చెల్లించని కమర్షియల్ రెసిడెన్షియల్ నిర్మాణాలకు నోటీసులు అందజేయడం తో పాటు సుదీర్ఘంగా పన్నులు చెల్లించని భవనాలకు ఇప్పటికే రెడ్ నోటీసులు అందజేయడం జరిగిందని, పన్నులు చెల్లించని పక్షంలో అట్టి ఆస్తులను సీజ్ చేయాలని కమిషనర్ ఆదేశించారు. అనంతరం పన్నులు చెల్లించిన యాజమాన్యాలకు కమిషనర్ రసీదు లను అందజేశారు.

**ట్రేడ్ లైసెన్స్ వసూళ్లు ప్లాస్టిక్ ఎన్ఫోర్స్‌మెంట్ పెనాల్టీ తీరు తనిఖీ**

హన్మకొండ నగర పరిధి 63 వ డివిజన్ విజిటేబుల్ మార్కెట్ ప్రాంతం లో ట్రేడ్ లైసెన్స వసూళ్ల తీరు తో పాటు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయించిన దుకాణాలకు విధించిన పెనాల్టీని కమిషనర్ క్షేత్ర స్థాయి లో పరిశీలించి నిర్వహించిన విధానాన్ని పరిశీలించి మాట్లాడుతూ నిర్దేశించిన ట్రేడ్ లక్ష్యాలను వేగవంతం గా వసూళ్లు చేయాలని అన్నారు. ప్లాస్టిక్ ను నియంత్రించే క్రమం లో సింగిల్ యూజ్ ను అరికట్టాలని కమిషనర్ ఎన్ఫోర్స్మెంట్ టీం లకు సూచించారు. ఈ కార్యక్రమంలో సి ఎం హెచ్ ఓ డా.రాజారెడ్డి, డిప్యూటీ కమిషనర్ రవీందర్, ఆర్ ఓ యూసూఫోద్దీన్, ఎస్ ఐ లు రవీందర్, యాదవ్, వెంకన్న, ఆర్ ఐ నవనీత్, వార్డు ఆఫీసర్ లు, బిల్ కలెక్టర్ లు, జవాన్ లు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అఖిల భారతీయ పద్మశాలి మహాసభ

- పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటు సహకరించిన సీఎంకు కృతజ్ఞతలు
- పద్మశాలి ముద్దుబిడ్డ నగర మేయర్ గుండు సుధారాణి





**వరంగల్, మహా;** హైదరాబాద్ నాంపల్లిలో ఎగ్జిబిషన్ గ్రౌండ్లో ఆదివారం జరిగిన అఖిల భారత పద్మశాలి 17వ మహాసభ ఘనంగా నిర్వహించారు.ఈ ఈ సందర్భంగా పద్మశాలి ముద్దుబిడ్డ గ్రేటర్ వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ పద్మశాలీల అభ్యున్నతి కొరకు, ఆర్థికంగా ఎదగడానికి గాను తెలంగాణ రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా పద్మశాలి కార్పొరేషన్ ను ఏర్పాటుచేసి రాష్ట్రంలోని పద్మశాలి లందరికీ భరోసా కల్పించిన ముఖ్యమంత్రి వర్యులు ఎనుముల రేవంత్ రెడ్డికి తెలంగాణ పద్మశాలి మహాసభ ద్వారా గ్రేటర్ వరంగల్ నగర మేయర్, మాజీ రాజ్యసభ సభ్యురాలు గుండు సుధారాణి పద్మశాలీలందరి తరపున ప్రత్యేక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేశారు. అంతేకాకుండా దేశంలో ఏ రాష్ట్రంలో నిర్వహించనీ విధంగా మన తెలంగాణ రాష్ట్రంలో బీసీ కుల గణనను చేపట్టి, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని ప్రకటించినందులకు కూడా రేవంత్ రెడ్డికి ఈ సందర్భంగా గ్రేటర్ వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి ధన్యవాదాలు తెలియజేసినారు.

# మహిళలు ఎప్పుడూ మహారాణులే

## హోం మంత్రి వంగలపూడి అనిత

### మేనిఫెస్టోలో కూడా మహిళలకు తొలి ప్రాధాన్యత

### పురుషుల కంటే మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు

### మహిళలు ఆత్మ స్థైర్యంతో ముందుకు సాగాలి

### కేజీహెచ్‌లో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు





**విశాఖ ,మహా :** సమాజంలో మహిళలు ఎప్పుడూ మహారాణులు గానే నిలుస్తారని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు.ఆదివారం ఏపీ గవర్నమెంట్ నర్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆంధ్ర మెడికల్ కళాశాల సమావేశ మందిరంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాని హోం మంత్రి అనిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు.మంత్రి అనిత మాట్లాడుతూ మహిళలు ఎప్పుడు మహా రాణునులుగా నిలుస్తారన్నారు. కన్న తల్లిదండ్రులు కూడా పిల్లలను చూసుకోలేని ఈ పరిస్థితుల్లో వృత్తి బాధ్యతగా ఆసుపత్రికి వచ్చిన రోగులను అమ్మలా, కంటికి రెప్పగా చూసుకునే గొప్ప మహోన్నత వ్యక్తులు నర్సింగ్ సిబ్బందిని వారి సేవలను కొనియాడారు. వారు అమ్మలా అందించే సేవలు రోగికి ఎంతో మేలు చేకూరుతాయన్నారు. మిమ్మల్ని అందర్నీ కలిసే అవకాశం నాకు రావడం అదృష్టం గా భావిస్తున్నాను అన్నారు.మన ఆడ వాళ్లు లేకపోతే మగవాళ్లకు పూట గడవదు. అటు భర్త ,పిల్లలను ,అత్త మామలును చూసుకుంటూ ఇటు పదవీ ,ఉద్యోగ బాధ్యతలు చేపడుతున్న వారు ఎందరో ఉన్నారన్నారు.ఈ సమాజంలో పురుషుల కన్నా మహిళలే ఎక్కువగా ఉన్నారన్నారు. బయటకు వెళితే మహిళ కు రక్షణ లేదు అన్న విషయం పూర్వీకుల నుండి ఆడపిల్ల అనే చులకన భావం తయారయిందని పేర్కొన్నారు. మగ పిల్లలను కూడా ఆడపిల్లల తో సమానంగా తల్లిదండ్రులు చూస్తే ఆడపిల్లల కు రక్షణ లేదు అనే అవకాశం ఉండదన్నారు.మా పోలీసు డిపార్ట్మెంట్ మీద గౌరవం పెరిగిందన్నారు.వారు బందోబస్తు చేసేటప్పుడు గంటల తరబడి నిలబడతారని మహిళలు కూడా డిపార్ట్మెంట్ లో ఉన్నారన్నారు. సమాజంలో ఎలాంటి ఇబ్బందులు అయినా తట్టుకోవడాని సిద్ధపడి మహిళలు పదవీ ,ఉద్యోగ బాధ్యతలు స్వీకరిస్తున్నారని తెలిపారు.శక్తియాప్ ని ప్రవేశ పెట్టాము. పోలీసులు వచ్చి మిమ్మల్ని ఇంటికి దించే అవకాశం ఉంటుందన్నారు. శక్తి యాప్ ని మహిళలు అందరూ వినియోగించుకోవాలని సూచించారు. ఒక ఐజి లెవెల్ ఆఫీసర్‌తో సీఎం చంద్రబాబు మహిళా వింగ్ ని ఏర్పాటు చేశారన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని కోరారు. తమ తమ వృత్తుల్లో మహిళలు ధైర్యంగా ఉండాలన్నారు. నర్సింగ్ అసోసియేషన్ సంబంధించిన వివిధ అంశాలపై సీఎం చంద్రబాబుతో మాట్లాడి వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆస్పత్రిలోని ప్రతి వార్డ్లో కూడా సీసీ కెమెరాలు ఉండేలా పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆస్పత్రి ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రతి ప్రభుత్వ శాఖలో కూడా మహిళల రక్షణకై అంతర్గత కమిటీలు నియమించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మహిళా దినోత్సవం పురస్కరించుకొని అసోసియేషన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లా వ్యాప్తంగా పలు ఆసుపత్రిలకు చెందిన రోగులకు ఉత్తమ సేవల అందజేసిన హెడ్ నర్సులు, స్టాఫ్ నర్సులను హోం మంత్రి చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. అంతకుముందు దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. భవిష్యత్తు తరాల పిల్లలను క్రమశిక్షణ తో పెంచాలని సూచించారు.ఆడపిల్లలు ఉన్న ఇల్లు అందంగా తీర్చిదిద్దుతారని కొనియాడారు.మంచి మనసున్న మహిళలు మాత్రమే సేవ చేసేందుకు వస్తారన్నారు.ఈ కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జి ,నాయకులు సీతం రాజు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



## ఉపమాక ఆలయ ఏర్పాట్లను పరిశీలించిన హోంమంత్రి అనిత

**అనకాపల్లి జిల్లా ,నక్కపల్లి ,మహా :** నక్కపల్లి మండలంలోని ఉపమాక వెంకటేశ్వర స్వామిని హోం మంత్రి వంగలపూడి అనిత దర్శించుకున్నారు. ఈ రోజు నుండి జరిగే కళ్యాణ ఉత్సవాల ఏర్పాట్లను ఆమె పరిశీలించారు ఆలయ అధికారులకు పలు సూచినలు చేశారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడుతూ ఈఏడాది ఉపమాక శ్రీవెంకటేశ్వరస్వామి కళ్యాణోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయన్నారు. గత ప్రభుత్వంలో భక్తులకు కనీస సౌకర్యాలు కూడా కల్పించలేదని ఎద్దేవాచేశారు. ఇప్పుడు భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. 300 మంది పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ట్రాఫిక్ సమస్య లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఉపమాక కళ్యాణోత్సవాల్లో భక్తులు మసాలా సామాగ్రీ అమ్మకాలు చేయడం సాంప్రదాయంగా వస్తుందన్నారు.ఈ సంవత్సరం లక్షకు పై భక్తులు వస్తారని అంచనా వేస్తున్నామన్నారు. తిరుమల తిరుపతి స్వామి వారి ప్రసాదం కూడా ఉపమాకలోఅందుబాటులోఉంటుందనివివరించారు. ఉపమాక వెంకటేశ్వర స్వామి ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం గా కొలుస్తారని సుదూర ప్రాంతాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారని వారికి ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చూసుకోవాల్సిన బాధ్యత మా పై ఉందన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు గొట్టిముక్కల ప్రసాదాచార్యులు ,కూటమి నాయకులు కురందాసు నూకరాజు ,కొప్పిశెట్టి వెంకటేష్ ,బుజ్జి ,నర్సింహా మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## న్యూయార్క్ లో ఘనంగా

# తెలుగువారి సంబరాలు

### మహిళా దినోత్సవం, మహా శివరాత్రి వేడుకలు

### కుటుంబాలతో సహా వచ్చి ఆడిపాడి ఉత్సాహ పరిచిన భారతీయులు

### వేడుకగా జరిగిన నైటా పండగలు..ముఖ్య అతిధిగా న్యూయార్క్ మేయర్



**మహా :** అమెరికా వాణిజ్య రాజధాని న్యూయార్క్ లో తెలుగువారి సంబరాలు అంబరాన్నంటాయి. ఒకే రోజు రెండు ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకున్నారు. మహిళా దినోత్సవంతో పాటు మహా శివరాత్రి వేడుకలను కూడా ఒకేసారి న్యూయార్క్ లో స్థిరపడిన తెలుగువారు చేసుకున్నారు. న్యూయార్క్ తెలంగాణ తెలుగు సంఘం (నైటా) ఆధ్వర్యంలో ఫ్లషింగ్ గణేష్ టెంపుల్ ఆడిటోరియంలో ఈ వేడుకలు ఘనంగా జరిగాయి. వందలాది మంది తెలంగాణ, తెలుగు వాసులు తమ కుటుంబాలతో సహా చేరి ఉత్సవాల్లో పాల్గొని ఆడి పాడారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన న్యూయార్క్ మేయర్ ఎరిక్ ఆడమ్స్ మాట్లాడుతూ అమెరికాతో పాటు న్యూ యార్క్ మహా నగరం అభివృద్ధి, సంస్కృతిలో తెలుగువారు అంతర్భాగం అయ్యారని కొనియాడారు. తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్కమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, సీతక్క, తదితర ప్రముఖులు ప్రత్యేక సందేశాల ద్వారా నైటా కార్యక్రమాలను, ఆర్గనైజింగ్ కమిటీ కృషిని ప్రశంసిస్తూ ప్రత్యేక సందేశాలను పంపారు. వీటి సంకలనంతో పాటు నైటా సభ్యులు, కార్యక్రమాలతో కూడిన సమాహారంగా నైటా వార్షికోత్సవ సావనీర్ ను ఈ సందర్భంగా విడుదల చేశారు. ఈ ఫెస్టివల్ ఈవెంట్ లో తెలంగాణ సూపర్ రైటర్, సింగర్, మ్యూజిక్ డైరెక్టర్ కాసర్ల శ్యామ్ తో పాటు, యూకే నుంచి సింగర్ స్వాతి రెడ్డి, డాన్సింగ్ అప్సరాస్ గా పేరొందిన టీ అండ్ టీ సిస్టర్స్, ఇండియన్ ఫేమస్ ఫ్యూజన్ మ్యూజిక్ గ్రూప్ పరంపరా లైవ్ ఫెర్మామెన్స్ తో అదరగొట్టారు. కొన్ని గంటల పాటు జరిగిన కార్యక్రమం ఆద్యంతం అందరినీ కట్టిపడేసింది. తెలుగు యువత గుండెల్లో చిరకాలం నిలిచిపోయే పాటలను రచించటంతో పాటు, పాడిన యువ గాయకుడు కాసర్ల శ్యామ్ కొన్ని హిట్ సాంగ్స్ తో అందరినీ ఉర్రూతలూగించారు. అమెరికాలో తెలుగువారి బలగాన్ని, బలాన్ని తన పాటల ద్వారా శ్యామ్ చాటి చెప్పారు. ఇక కొంత ఆలస్యంగానైనా న్యూయార్క్ తెలుగువారు శివ రాత్రి వేడుకలు జరుపుకున్నా ఆధ్యాత్మిక గీతాలు, చిన్నారులు భక్తి పాటలతో ఆడిటోరియటం మారుమోగింది. న్యూయార్క్ మహానగరంలో నిత్యం వారి వారి వృత్తుల్లో బిజీగా ఉండే మన తెలుగు వారు అన్నింటినీ పక్కన పెట్టి అటు శివ భక్తి, ఇటు మహిళా దినోత్సవాన్ని ఒకే సారి వేడుకగా జరుపుకున్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నైటా ఆర్గనైజింగ్ టీమ్ తో పాటు తెరవెనుక సహకరించిన ప్రతీ ఒక్కరికీ పేరు పేరునా అధ్యక్షురాలు వాణీ రెడ్డి ఏనుగు కృతజ్ఞతలు తెలిపారు. నైటా కార్యక్రమాలకు వెన్నుముకగా నిలుస్తూ ప్రోత్సాహం అందిస్తున్న డాక్టర్ పైళ్ల మల్లారెడ్డిని నైటా టీమ్ ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో వందలాది మంది తెలుగు కుటుంబాలతో పాటు, న్యూయార్క్ కాంగ్రెస్ విమెన్ గ్రేస్ మెంగ్, ఇండియన్ కాన్సులేట్ జనరల్ నుంచి బిజేందర్ కుమార్ తదితరులు హాజరయ్యారు.



# దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL



## టొరంటో పబ్‌లో కాల్పులు

### 12 మందికి గాయాలు

కెనడాలో కాల్పుల ఘటన కలకలం సృష్టించింది. టొరంటో నగరంలోని ఓ పబ్‌లో దుండగుడు విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డాడు. ఈ ఘటనలో 10 మందికిపైగా గాయపడ్డారు. స్థానిక మీడియా కథనాల ప్రకారం.. శుక్రవారం రాత్రి 10:39 గంటల సమయంలో నగరంలోని స్కార్‌బరో టౌన్ సెంటర్ సమీపంలోని పబ్‌లో కాల్పులు జరిగాయి. ఓ దుండగుడు పబ్‌లో కాల్పులకు తెగబడ్డాడు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ కాల్పుల్లో 12 మంది గాయపడ్డారు. సమాచారం అందుకున్న టొరంటో నగర పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకున్నారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. నిందితుడి కోసం గాలిస్తున్నారు. కాల్పుల ఘటనపై టొరంటో మేయర్ ఒలివియా చౌ విచారం వ్యక్తం చేశారు. నిందితుడిని తొందర్లోనే పట్టుకోనున్నట్లు వెల్లడించారు.



## కెనడా కొత్త ప్రధాని ఎవరో..

### రేసులో నలుగురు.. నేడే ఓటింగ్..!

అమెరికానుంచి కెనడా టారిఫ్‌ల సవాల్ ఎదుర్కొంటున్న వేళ.. కెనడా పాలనా పగ్గాలు ఎవరు చేపట్టబోతున్నారనే విషయం ఆసక్తిగా మారింది. రేసులో మొత్తం నలుగురు ఉండగా.. వారిలో ట్రూడో వారసులు అయ్యేదెవరనే అంశం ఉత్కంఠ రేపుతోంది. నూతన ప్రధాని ఎంపిక కోసం ఇవాళ లిబరల్ పార్టీ లో ఓటింగ్ జరగనుంది. మొత్తం 1.40 లక్షల మంది ఈ ఓటింగ్‌లో పాల్గొనను న్నారు. కెనడా ప్రస్తుత ప్రధాని జస్టిన్ ట్రూడ్.. తన పదవి నుంచి వైదొలగనున్నట్లు గత జనవరిలో ప్రకటించారు. ఈ క్రమంలో పార్టీ నూతన సారథిని ఎన్నుకునేందుకు అధికార లిబరల్ పార్టీ సిద్ధమైంది. అందుకోసం ఇవాళ (మార్చి 9న) ఓటింగ్ నిర్వహించనుంది. ఈ రేసులో మొత్తం నలుగురు కొనసాగుతున్నారు. వారిలో మార్క్ కార్నీ, క్రిస్టియా ఫ్రీలాండ్, కరినా గౌల్డ్, ఫ్రాంక్ బేలిస్‌లు ఉన్నారు. ఆ నలుగురిలో మార్క్ కార్నీ, ఫ్రీలాండ్‌ల మధ్య తీవ్ర పోటీ ఉన్నప్పటికీ.. మాజీ బ్యాంకర్ అయిన కార్నీ నూతన ప్రధానిగా ఎన్నికయ్యే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. బ్యాంక్ ఆఫ్ కెనడాకు గతంలో గవర్నర్‌గా పనిచేసిన మార్క్ కార్నీ.. అంతకుముందు బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ గవర్నర్‌గానూ బాధ్యతలు నిర్వహించారు. ఇక ట్రూడో ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా పనిచేసిన క్రిస్టియా ఫ్రీలాండ్.. గత డిసెంబర్‌లో తన పదవికి రాజీనామా చేశారు. తన రాజీనామా సందర్భంగా ఫ్రీలాండ్ రాసిన సుదీర్ఘ లేఖ ట్రూడో రాజీనామాకు దారితీసిందనే వాదన వినిపిస్తోంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నుంచి సుంకాల సవాళ్లు ఎదురవుతున్న వేళ కెనడా నూతన ప్రధాని ఎంపిక ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే ఆ సవాళ్లను ఎదుర్కొనేందుకు తమ వద్ద ప్రణాళికలు ఉన్నాయని ప్రధాని రేసులో ఉన్న లిబరల్ పార్టీ నేతలు ధీమాగా చెబుతున్నారు. సీక్రెట్ ఓటింగ్ ద్వారా పార్టీ చీఫ్‌ను ఎన్నుకోనుండగా.. పార్టీ చీఫ్‌గా ఎన్నికైన వ్యక్తిచేత గవర్నర్ జనరల్ నూతన ప్రధానిగా ప్రమాణం చేయిస్తారు.

## బైక్‌పై వెళ్తున్న జర్నలిస్ట్‌ను వాహనంతో ఢీకొట్టి

### కాల్పులు జరిపి హత్య



**లక్నో:** బైక్‌పై వెళ్తున్న జర్నలిస్ట్‌ను దుండగులు వాహనంతో ఢీకొట్టారు. ఆ తర్వాత అతడిపై కాల్పులు జరిపి హత్య చేశారు. కలకలం రేపిన ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని సీతాపూర్‌లో ఈ సంఘటన జరిగింది. రాఘవేంద్ర బాజ్‌పాయ్ ఒక హిందీ దినపత్రికకు స్థానిక విలేకరిగా పని చేస్తున్నాడు. ఆర్టీఏ కార్యకర్త కూడా అయిన ఆయనకు శనివారం మధ్యాహ్నం 3.15 గంటల సమయంలో ఫోన్ వచ్చింది. దీంతో ఇంటి నుంచి బైక్‌పై బయలుదేరాడు. కాగా, లక్నోఢిల్లీ జాతీయ రహదారిపై బైక్‌పై వెళ్తున్న జర్నలిస్ట్ రాఘవేంద్రను ఒక వాహనం ఢీకొట్టింది. ఆ తర్వాత అతడిపై మూడు రౌండ్లు కాల్పులు జరిగాయి. రక్తం మడుగుల్లో పడి ఉన్న రాఘవేంద్ర రోడ్డు ప్రమాదానికి గురై మరణించినట్లుగా తొలుత పోలీసులు భావించారు. మరోవైపు మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అతడి శరీరంపై మూడు బుల్లెట్ గాయాలున్నట్లు డాక్టర్లు గుర్తించారు. దీంతో జర్నలిస్ట్ రాఘవేంద్రను హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. నిందితులను అరెస్ట్ చేసేందుకు నాలుగు బృందాలను ఏర్పాటు చేసినట్లు పోలీస్ ఉన్నతాధికారి తెలిపారు. జర్నలిస్ట్ హత్యా సంఘటన స్థానికంగా కలకలం రేపింది.

## సిరియాలో మళ్లీ చెలరేగిన హింస

### 1000 మందికిపైగా మృతి..!



సిరియాలో మళ్లీ హింస చెలరేగింది. సిరియా మాజీ అధ్యక్షుడు బషర్ అల్ అసద్ మద్దతుదారుల తిరుగుబాటుతో స్థానికంగా మరోసారి హింస చోటుచేసుకుంది. భద్రతా దళాలు, అసద్ సపోర్టర్స్ మధ్య జరిగిన ఘర్షణల్లో వెయ్యి మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. సిరియా అంతర్యుద్ధం మొదలైన తర్వాత అత్యంత ఘోరమైన ఘటనగా ఈ హింసను పేర్కొంటున్నారు. తాజా ఘర్షణలకు సంబంధించిన వివరాలను బ్రిటన్‌కు చెందిన సిరియన్ అబ్జర్వేటరీ ఫర్ హ్యూమన్ రైట్స్ వెల్లడించింది. అసద్ మద్దతుదారులు తొలుత ప్రభుత్వ భద్రతా దళాలపై దాడులకు పాల్పడ్డారు. దాంతో భద్రతా దళాలు ప్రతిదాడికి దిగాయి. ఇప్పటివరకు ఈ ఘర్షణల్లో వెయ్యి మందికిపైగా మృతిచెందారు. వారిలో 745 మంది సాధారణ పౌరులు కాగా.. మరో 125 మంది భద్రతా సిబ్బంది, 148 మంది అసద్ మద్దతుదారులు ఉన్నారు. తిరుగుబాటుదారులు ఇటీవల మెరుపు వేగంతో సిరియా (Syria) ను ఆక్రమించారు. దాంతో అసద్ తన కుటుంబంతో సహా రష్యాకు పారిపోయారు. రెబల్స్ కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. దీన్ని వ్యతిరేకిస్తూ గురువారం అసద్ మద్దతుదారులు జబ్లే నగరంలో భద్రతా దళాలపై దాడిచేసి చంపారు. దాంతో అసద్ సపోర్టర్‌లు అధికంగా ఉండే ప్రాంతాల్లోకి ప్రవేశించిన ప్రభుత్వ దళాలు పెద్ద ఎత్తున ప్రతీకార దాడులకు పాల్పడుతున్నాయి. ఈ క్రమంలో వారి ఇళ్లకు నిప్పంటిచడంతో ఘర్షణలు పెద్దవయ్యాయి. బనియాస్ పట్టణంలో జరిగిన ఘర్షణల్లో అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. వారి మృతదేహాలు వీధుల్లో, ఇళ్లలో పడి ఉన్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. వాటిని తీసుకునేందుకు కూడా ఎవ్వరూ సాహసం చేయడం లేదని తెలిపారు.

## అమెరికాలో హిందూ ఆలయంపై విద్వేషపు రాతలు..

# ఖండించిన ఇండియా..!

అగ్రరాజ్యం అమెరికాలో హిందూ ఆలయాల పై దాడులు కొనసాగుతున్నాయి. తాజాగా కాలిఫోర్నియా రాష్ట్రంలోని హిందూ ఆలయంపై కొందరు విద్వేషపు రాతలు రాశారు. చినో హిల్స్‌లోని బాప్స్ శ్రీ స్వామినారాయణ్ మందిరంపై కొందరు ఈ దుశ్చర్యకు పాల్పడ్డారు. ఆలయ అధికారులు ఎక్స్ వేదికగా ఈ దుశ్చర్య గురించి వెల్లడించారు. భారత్ ఈ దుశ్చర్యను తీవ్రంగా ఖండించింది. విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. 'కాలిఫోర్నియాలోని చినో హిల్స్‌లో హిందూ దేవాలయంపై జరిగిన దాడి హేయమైన చర్య. ఇలాంటి హేయమైన చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈ ఘటనకు బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక అధికారులను డిమాండ్ చేస్తున్నాం. అదేవిధంగా ప్రార్థనా స్థలాలకు తగిన భద్రత




కల్పించాలని కోరుతున్నాం' అని జైశ్వాల్ పేర్కొన్నారు. గత ఏడాది సెప్టెంబర్‌లోనూ ఇలాంటి ఘటనలే చోటుచేసుకున్నాయి. కాలిఫోర్నియా శాక్రిమెంటోలోని బాప్స్ శ్రీ స్వామినారాయణ మందిరంపై విద్వేషపూరిత రాతలు రాశారు. దానికి ముందు సైతం న్యూయార్క్‌లోని బాప్స్ మందిరం వద్ద దుండగులు ఇదేవిధంగా వ్యవహరించారు.

## జూనియర్లను కిడ్నాప్ చేసి కొట్టిన సీనియర్లు..

### నలుగురు మెడికల్ స్టూడెంట్స్ సస్పెండ్

**అహ్మదాబాద్:** జూనియర్ మెడికల్ స్టూడెంట్స్‌ను సీనియర్లు కిడ్నాప్ చేశారు. వారిని తిట్టడంతోపాటు కొట్టారు. జూనియర్ల ఫిర్యాదుపై మెడికాల్ కాలేజీ యాజమాన్యం చర్యలు చేపట్టింది. నలుగురు సీనియర్ మెడికల్ స్టూడెంట్స్‌ను సస్పెండ్ చేసింది. గుజరాత్‌లోని భావ్‌నగర్‌లో ఈ సంఘటన జరిగింది. మార్చి 7న ప్రభుత్వ వైద్య కాలేజీలో 2019 బ్యాచ్ స్నాతకోత్సవం జరిగింది. ఈ సందర్భంగా జూనియర్, సీనియర్ విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగింది. కాగా, ముగ్గురు జూనియర్ మెడికల్ స్టూడెంట్స్‌ను నలుగురు సీనియర్ విద్యార్థులు ఒక చోటుకు రప్పించారు. వారిని బలవంతంగా కారులోకి ఎక్కించారు. కారు నడుపుతూ జూనియర్లను తిట్టడంతోపాటు కొట్టారు. వారిని బెదిరించారు. మరోవైపు ముగ్గురు జూనియర్ మెడికోలు ఈ సంఘటనపై పోలీసులతోపాటు కాలేజీ యాంటీ ర్యాగింగ్



కమిటీకి ఫిర్యాదు చేశారు. దీంతో 11 మంది సభ్యుల కమిటీ వారి ఫిర్యాదును పరిశీలించింది. జూనియర్ మెడికల్ విద్యార్థులను అసభ్యకరంగా తిట్టి కొట్టిన సీనియర్ల చర్యను ర్యాగింగ్‌గా పరిగణించింది. కాగా, పీజీ డాక్టర్లైన మిలన్, పియూష్, మాన్, నరేన్‌ను శనివారం సస్పెండ్ చేసినట్లు ప్రభుత్వ మెడికల్ కాలేజీ డీన్ డాక్టర్ సుశీల్ కుమార్ ఝా తెలిపారు. వారి సర్టిఫికెట్లను నిలిపివేయాలని కమిటీ నిర్ణయించినట్లు వెల్లడించారు.



# గుజరాతీలు జాబ్స్ ఎందుకు చేయరంటే..

వ్యాపారం, ఆర్థిక రంగాల్లో గుజరాతీల ఆధిపత్యం గురించి తెలిసిందే. అయితే వారు ఆయా రంగాల్లో అంతలా రాణించడానికి కారణాలు ఏంటి.. సంపద సృష్టిలో వారికున్న ప్రత్యేక లక్షణాలేంటి అన్న దానిపై పై స్టాకిఫీ వ్యవస్థాపకుడు అభిజిత్ చోక్సీ అద్భుతమైన విశ్లేషణ చేశారు. వారి ఆర్థిక ప్రభావాన్ని హైలైట్ చేసే గణాంకాలతో ఆయన 'ఎక్స్'లో చేసిన పోస్ట్ వైరల్‌గా మారింది. దేశంలోని 191 మంది బిలియనీర్లలో 108 మంది గుజరాతీలేనని రాసుకొచ్చిన చోక్సీ సంపద సృష్టిలో వారికున్న ప్రత్యేకతలను వివరించారు. చివరికి అమెరికాలో నివసిస్తున్న గుజరాతీ.. సగటు అమెరికన్ కంటే మూడు రెట్లు ఎక్కువ సంపాదిస్తున్నాడని చోక్సీ అభిప్రాయపడ్డారు. భారతదేశ జనాభాలో కేవలం 5% మాత్రమే ఉన్నప్పటికీ, గుజరాత్ దేశ జీడీపీకి 8% పైగా, దేశ పారిశ్రామిక ఉత్పత్తిలో 18% భాగస్వామ్యం వహిస్తోంది. భారత భూభాగంలో కేవలం 6% మాత్రమే ఉన్న గుజరాత్ దేశం మొత్తం ఎగుమతుల్లో 25% వాటాను కలిగి ఉంది.

**గుజరాతీల సక్సెస్‌కు కారణాలివే..**

మరి గుజరాతీలు వ్యాపారంలో అంత సక్సెస్ కావడానికి కారణం ఏమిటి? చోక్సీ ప్రకారం.. ఇది తరతరాలుగా వస్తున్న జ్ఞానం, వ్యవస్థాపక మనస్తత్వం, కొత్త మార్కెట్లను స్వీకరించడానికి, ఆధిపత్యం చేయడానికి సాటిలేని సామర్థ్యం కలయిక. గుజరాతీలు వ్యాపార, ఆర్థిక వ్యవహారాలను శాసించడానికి 20 కారణాలను ఆయన వివరించారు. ఉద్యోగాల (Jobs) కంటే వ్యాపారానికి తరతరాలుగా ప్రాధాన్యత ఇవ్వడమే ఈ విజయానికి కారణమని చోక్సీ పేర్కొన్నారు. "నౌకరీ తో గరీబోన్ కా దందా చే" (ఉద్యోగాలు పేదల కోసం) అనేది గుజరాతీ కుటుంబాలలో ఒక సాధారణ నమ్మకం. వ్యాపారం అనేదేదో నేర్చుకోవాల్సిన ఒక నైపుణ్యంలాగా కాకుండా గుజరాతీ పిల్లలు.. తమ కుటుంబాల్లో డబ్బును ఎలా నిర్వహిస్తున్నారు.. డీల్స్ ఎలా చేస్తున్నారు.. నష్టాలను ఎలా అంచనా వేస్తున్నారు.. అనేది నిత్యం చూస్తూ పెరుగుతారు. రిస్క్ తీసుకోవడం అనేది మరో ముఖ్యమైన లక్షణం. వజ్రాల ట్రేడింగ్ నుంచి స్టాక్ మార్కెట్ల వరకు గుజరాతీలు అనిశ్చితిని స్వీకరించి అవకాశాలను అందిపుచ్చుకుంటారు. ఈ మనస్తత్వం ప్రారంభ ఆర్థిక విద్య ద్వారా బలపడుతుంది. చాలా మంది పిల్లలు చిన్న వయస్సు నుండే కుటుంబ వ్యాపారాలలో సహాయపడతారు. ఏ ఎంబీఏ బోధించలేని రియల్ వరల్డ్ ఆర్థిక శాస్త్రాన్ని నేర్చుకుంటారు. నెట్ వర్కింగ్, కమ్యూనిటీ సపోర్ట్ కీలకం. రుణాలు, మార్గదర్శకత్వం, మార్కెట్ విషయంలో గుజరాతీలు ఒకరికొకరు చురుకుగా సహాయపడతారు. వారి పొదుపు జీవనశైలి కూడా ఒక పాత్ర పోషిస్తుంది. లాభాలను విలాసవంతంగా ఖర్చు చేయకుండా తిరిగి పెట్టుబడి పెడతారు. ఇది దీర్ఘకాలిక సంపద సేకరణకు దారితీస్తుంది. వివిధ పరిశ్రమల్లో గుజరాతీలు ఎలా ఆధిపత్యం చెలాయిస్తున్నారో కూడా చోక్సీ తెలియజేశారు. ప్రపంచంలోని 90 శాతం వజ్రాలను సూరత్ మాత్రమే ప్రాసెస్ చేస్తోందని, బెల్జియం, ఇజ్రాయెల్ లోని పోటీదారులను గుజరాతీ పారిశ్రామికవేత్తలు ఎలా అధిగమించారో ఆయన గుర్తు చేశారు. అదేవిధంగా, భారతదేశ స్టాక్ మార్కెట్ వ్యాపారులలో 60% పైగా గుజరాతీలు లేదా మార్వాడీలు ఉన్నారు. అమెరికాలో కూడా గుజరాతీలు వ్యాపార సామ్రాజ్యాలు నిర్మించుకున్నారు. అమెరికాలోని మొత్తం హోటళ్లలో 60 శాతానికి పైగా గుజరాతీ కుటుంబాలకు చెందినవేనని, ప్రధానంగా పటేల్ సామాజిక వర్గానికి చెందినవని చోక్సీ వెల్లడించారు. 1950వ దశకంలో చిన్న చిన్న పెట్టుబడులుగా ప్రారంభమైన ఈ పరిశ్రమ మల్టీ బిలియన్ డాలర్ల పరిశ్రమగా రూపాంతరం చెందింది.



## భారత్‌లో ఖరీదైన స్కూటర్ లాంచ్: రేటు ఎంతంటే?

బీఎండబ్ల్యూ మోటొరాడ్ ఇండియన్ మార్కెట్లో.. 'సీ 400 జీటీ' స్కూటర్ లేటెస్ట్ వెర్షన్ లాంచ్ చేసింది. రూ. 11.50 లక్షల (ఎక్స్ షోరూమ్) ప్రారంభ ధర వద్ద లభించే ఈ స్కూటర్, దాని మునుపటి మోడల్ కంటే అప్డేట్స్ పొందుతుంది. కాబట్టి దీని ధర స్టాండర్డ్ మోడల్ కంటే రూ. 25000 ఎక్కువ. దీంతో ఇండియన్ మార్కెట్లో లభిస్తున్న స్కూటర్లలో ఇది ఒకటిగా చేరింది. బీఎండబ్ల్యూ సీ 400 జీటీ స్కూటర్.. సాధారణ ప్రయాణానికి మాత్రమే కాకుండా, దూర ప్రయాణాలకు కూడా చాలా అనుకూలంగా ఉంటుంది. ఇందులోని 350 సీసీ లిక్విడ్ కూల్డ్ సింగిల్ సిలిండర్ ఇంజిన్ 7500 rpm వద్ద 34 Bhp పవర్, 5750 rpm వద్ద 35 Nm టార్క్ అందిస్తుంది. ఈ స్కూటర్ లీన్ సెన్సిటివ్ బ్రేకింగ్ అసిస్ట్, డైనమిక్ బ్రేక్ కంట్రోల్, ట్రాక్షన్ కంట్రోల్‌తో కూడిన ఏబీఎస్ వంటి రైడర్ అసిస్ట్ ఫీచర్లను పొందుతుంది. సీ 400 జీటీ స్కూటర్.. పెద్ద విండ్‌షీల్డ్ పొందుతుంది. ఇది బ్లాక్‌స్టార్మ్ మెటాలిక్, డైమండ్ వైట్ మెటాలిక్ పెయింట్ స్కీమ్‌లలో లభిస్తుంది. ఇందులో 10.25 ఇంచెస్ TFT డిస్ప్లే ఉంది. ఇది హై రిజల్యూషన్ ఇంటర్ఫేస్‌తో నావిగేషన్, మీడియా అండ్ స్మార్ట్‌ఫోన్ ఇంటిగ్రేషన్ వంటి వాటిని మెరుగుపరుస్తుంది. అండర్ సీట్ కంపార్ట్‌మెంట్ 37.6 లీటర్లు. కాబట్టి ఇది అన్ని విధాలా రైడర్లకు చాలా అనుకూలంగా ఉంటుంది.

# రూపాయి పయనమెటు..

## సుంకాల మోతతో కరెన్సీకి మరిన్ని చిల్లులు పడే అవకాశం

**న్యూఢిల్లీ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న రక్షణాత్మక చర్యలు ఇతర దేశాల పాలిట శాపంగా మారుతున్నాయి. పలు దేశాలపై ప్రతికూల సుంకాలు విధింపుతథ్యమని హెచ్చరికలు జారీ చేయడంతో ఆయా దేశాలు బెంబేలెత్తుతున్నాయి. ఈ సుంకాల పెంపుతో దేశీయ పెట్రోకెమికల్స్, ఫార్మా ఎగుమతులపై తీవ్రస్థాయిలో ప్రభావం చూపనున్నాయి. ఈ దెబ్బకు కరెన్సీ తీవ్ర హెచ్చుతగ్గుదలకు లోనుకావచ్చునని మార్కెట్ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. టారిఫ్ సెగతో అనూహ్యంగా అమెరికా కరెన్సీ డాలర్ విలువ బలపడుతుండటంతో దీంతో రూపాయి విలువ మరింత దిగజారుతున్నది. గడిచిన నెల రోజుల్లో డాలర్ విలువ 10 శాతం వరకు బలపడటంతో ఇతర కరెన్సీలు తీవ్ర ఒత్తిడికి గురికావాల్సి వస్తున్నదని, ఇది ఏ మాత్రం మంచిదికాదని, ముఖ్యంగా రూపాయి విలువ మరింత దిగజారుతున్నదని వెల్లడించారు. కరెన్సీ పతనమవుతుండటంతో దిగుమతి చేసుకునే వస్తువులకు అధికంగా చెల్లింపులు జరుపాల్సి వస్తుండటంతో దేశీయ ఆర్థిక వ్యవస్థకు ఇది పెద్ద దెబ్బలాంటిదని అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా దేశీయ వినిమయంలో 80 శాతం ఇంధనాన్ని దిగుమతి చేసుకుంటున్న భారత్‌కు ఇది ఎదురుదెబ్బ.



డాలర్ బలపడిన లేదా పతనం చెందిన ఇతర దేశాల కరెన్సీలకు ముచ్చెమటలు తప్పవని హెచ్చరిస్తున్నారు. మెక్సికో, కెనడా ఉత్పత్తులపై 25 శాతం టారిఫ్, చైనా ఉత్పత్తులపై 10 శాతం సుంకాన్ని విధించబోతున్నట్లు ఇప్పటికే ట్రంప్ ప్రకటించారు. అమెరికా దిగుమతి చేసుకుంటున్న ఉత్పత్తులపై విధిస్తున్న టారిఫ్ కంటే భారత్ దిగుమతి చేసుకుంటున్న ఉత్పత్తులపై విధిస్తున్న టారిఫ్ అధికంగా ఉండటంతో ఇటీవల ట్రంప్ హెచ్చరికలు జారీచేశారు. ఒకవేళ సుంకాలను తగ్గించకపోతే మీమీద ప్రతికార సుంకాలను విధించాల్సి ఉంటుందని హెచ్చరించారు. దీంతో దిగొచ్చిన భారత్..అమెరికా నుంచి దిగుమతి చేసుకుంటున్న ఉత్పత్తులపై విధిస్తున్న పన్నును తగ్గించేయోచనలో ఉన్నది.

**పసిడి ధరలు కూడా..**

ట్రంప్ దెబ్బతో అతి విలువైన లోహాల ధరలు రాకెట్ వేగంతో దూసుకుపోతున్నాయి. అంతర్జాతీయ వాణిజ్య యుద్ధానికి తెరలేపడంతో పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను సురక్షితమైన అతి విలువైన లోహాలవైపు మళ్లించడంతో వీటి ధరలు రికార్డు స్థాయిలో దూసుకుపోతున్నాయి. ఇదే క్రమంలో బంగారం, వెండి ధరలు సామాన్యుడికి చుక్కలు చూపిస్తున్నాయి. ప్రస్తుతం వెండి రూ.93 వేల నుంచి రూ.97 వేల స్థాయిలో కదలాడుతున్నది. త్వరలో కిలో వెండి ఏకంగా రూ.1.15 లక్షలకు చేరుకునే అవకాశాలున్నాయని మార్కెట్ వర్గాలు అంచనావేస్తున్నారు. అలాగే రూ.87 వేల స్థాయిలో కదలాడుతున్న బంగారం సమీప భవిష్యత్తులో రూ.90 వేలను తాకే అవకాశాలున్నాయి. గ్లోబల్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ 2,900 డాలర్ల నుంచి 2,940 డాలర్ల స్థాయిలో కదులుతున్నది. ఒకవేళ 3 వేల డాలర్లను దాటితే దేశీయంగా రూ.90 వేల నుంచి లక్షకు చేరుకునే ఆస్కారం ఉన్నదని విశ్లేషకులు అంటున్నారు. సుంకాల విధింపు నిర్ణయంతో ఈ ఏడాది ఇప్పటివరకు బంగారం ధరలు 10 శాతం మేర పెరిగాయి. ఇదే సమయంలో బిట్‌కాయిన్ ధర 3 శాతం పడిపోయింది.



# సినిమా వార్తలు MOVIE NEWS





## అందరూ ధనశ్రీని టార్గెట్ చేస్తే నేను సపోర్ట్ చేశా.. అప్పుడు..: ఉర్ఫీ

టీమిండియా క్రికెటర్ యుజ్వేంద్ర చాహల్, కొరియోగ్రాఫర్ ధన శ్రీ వర్మ విడిపోతున్నారంటూ ఈ ఏడాది ఆరంభం నుంచి పుకార్లు ఊపందుకున్నాయి. చివరకు ఆ పుకార్లను నిజం చేస్తూ ఇద్దరూ విడిపోవడానికే నిర్ణయించుకున్నారు. ఇటీవలే వీరికి ఫ్యామిలీ కోర్టు విడాకులు మంజూరు చేసినట్లు తెలుస్తోంది. ఇకపోతే ఈ జంట డివోర్స్ తీసుకోనుంది అన్నప్పటినుంచి చాలామంది ధనశ్రీని టార్గెట్ చేశారు.

**ప్రతిసారి అమ్మాయిదే తప్పా?**


చాహల్‌ను ఒంటరిని చేసిందని, ధనశ్రీ ఏదో తప్పు చేసుంటుందని.. రకరకాలుగా విమర్శలు గుప్పించారు. ఆ సమయంలో సోషల్ మీడియా సెన్సేషన్, నటి ఉర్ఫీ జావెద్ ధనశ్రీకి మద్దతుగా నిలిచింది. చాహల్ జీవితాన్ని ధనశ్రీ నాశనం చేసిందన్న పోస్టుపై ఉర్ఫీ ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. క్రికెటర్ బ్రేకప్ చెప్పినప్పుడు, విడాకులు తీసుకుంటున్నప్పుడల్లా అమ్మాయిదే తప్పని ముద్ర వేస్తారు. ఆమెపైనే నిందలేస్తారు. ఎందుకంటే మనకు క్రికెటర్ అంటే హీరో కదా!

**మీకు గుర్తుందా?**

నిజంగా ఆ జంటల మధ్య ఏం జరిగిందనేది మనకెవరికీ తెలియదు. విరాట్ సరిగా ఆడకపోయినా కూడా అనుష్కదే తప్పన్నారు. మీకు గుర్తుందో, లేదో మరి! అంటే అక్కడ మగవాడు ఏం చేసినా అందుకు మహిళలే కారణం.. ఈ అబ్బాయిలేం చిన్నపిల్లలు కాదు. వాళ్లేం చేస్తున్నారో వారికి అన్నీ బాగా తెలుసు అని రాసుకొచ్చింది.

**ధనశ్రీకి సపోర్ట్ చేశానని..**

ఈ పోస్ట్ చూసిన ధనశ్రీ తనకు థాంక్స్ చెప్పిందంటోంది ఉర్ఫీ జావెద్. తాజాగా ఆమె ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ.. ఈ విడాకుల వ్యవహారంలో ధనశ్రీని దారుణంగా చిత్రీకరించారు. అప్పుడామెకు మద్దతుగా ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ స్టోరీ పోస్ట్ చేశాను. అప్పటికే బాధాకరమైన పరిస్థితిలో ఉన్న ఆమె అది చూసి నాకు కృతజ్ఞతలు తెలియజేసింది అని తెలిపింది.



## 'విశ్వంభర' సెట్‌లో శ్రీలీలకి స్పెషల్ గిఫ్ట్ ఇచ్చిన చిరంజీవి

టాలీవుడ్ నుంచి వస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియన్ మూవీ విశ్వంభర. అగ్ర కథానాయకుడు చిరంజీవి ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా.. త్రిష కథానాయికగా నటిస్తుంది. బింబిసార ఫేమ్ వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్నారు. యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై వంశీ, ప్రమోద్ విక్రమ్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి బ్యాక్ గ్రౌండ్ స్కోర్, సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమా కోసం మెగా అభిమానులతో పాటు మూవీ లవర్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుపుకుంటుంది. ఇదిలావుంటే శనివారం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని విశ్వంభర సెట్‌లో నటి శ్రీలీల సందడి చేసింది. వుమెన్స్ డే సందర్భంగా విశ్వంభర సెట్స్‌కి వచ్చిన శ్రీలీలను చిరు సత్కరించడంతో పాటు వెండి వర్ణంలో ఉన్న శంఖాన్ని ప్రత్యేక కానుకగా అందించారు. ఇక ఈ విషయాన్ని తెలియాజేస్తూ.. శ్రీలీల సోషల్ మీడియా వేదికగా ఫొటోలు పంచుకుంది.

## పెళ్లి కూతురు గెటప్‌లో సమంత

### రెండో పెళ్లికి రెడీ అయిందా?



టాలీవుడ్ అందాల ముద్దుగుమ్మ సమంత గురించి ప్రత్యేక పరిచయాలు అక్కర్లేదు. చూడ చక్కని అందం, ఆకట్టుకునే అందంతో ఈ భామ అందరి మనస్సులని కొల్లగొడుతూ ఉంటుంది. సమంత.. నాగ చైతన్యని ప్రేమించి పెళ్లి చేసుకొని అతని నుండి విడిపోయి ఇప్పుడు సోలోగా ఉంటుంది. నాగచైతన్యకు విడాకులిచ్చిన తర్వాత మయోసైటిస్ కు గురైన సమంత సినిమాలకు కూడా బ్రేక్ ఇచ్చింది. అయితే అంత పెద్ద వ్యాధిని కూడా ధైర్యంగా ఎదుర్కొన్న సమంత గెలిచింది. మయోసైటిస్ నుండి కోలుకున్న తర్వాత తిరిగి సినిమాలు, వెబ్ సిరీస్ లు చేస్తుంది. హైదరాబాద్ లో నివసించడం కూడా చాలావరకు తగ్గించి ముంబయిలోనే ఎక్కువగా నివసిస్తోంది.

ప్రస్తుతం ఆమె చేతిలో రెండు సినిమాలు ఉన్నాయి.ఇదే సమయంలో సమంత చాలాకాలం తర్వాత మా ఇంటి బంగారం సినిమాతో సమంత తెలుగులో రీఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమైంది..ఈ సినిమాకు సమంతనే నిర్మాతగా వ్యవహరిస్తుండడం విశేషం..సమంత తెలుగులో రీఎంట్రీ ఇవ్వనుండటంతో ఆమె అభిమానులు ఫుల్ ఖుషీ అవుతున్నారు. ఇక సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండే సమంత ఎప్పటికప్పుడు తనకి సంబంధించిన క్యూట్ పిక్స్ షేర్ చేస్తూ ఉంటుంది. ఇందులో భాగంగా సమంత బ్రైడల్ లుక్ పిక్స్ షేర్ చేసింది. ఈ పిక్స్ నెటిజన్స్ ని ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. నార్త్ సైడ్ పెళ్లి కూతురి మాదిరిగా కనిపిస్తున్న సమంతని చూసి ఈ అమ్మడు రెండో పెళ్లి చేసుకోబోతుందా, అందుకే ఇలాంటి హింట్ ఇచ్చిందా అని ముచ్చటించుకుంటున్నారు. ఏది ఏమైన సమంత క్యూట్ లుక్స్ ప్రతి ఒక్కరి మనసులని దోచుకుంటున్నాయి. బాలీవుడ్ దర్శకుడు బాలీవుడ్ దర్శకుడు రాజు నిడుమోరుతో సమంత రిలేషన్‌లో ఉందంటూ గత కొంతకాలంగా ప్రచారం జరుగుతున్నా దీనిపై క్లారిటీ రావడం లేదు. ఇటీవల వీరిద్దరు కలిసి చెట్టాపట్టాలు వేస్తున్నారు. మరి కొద్ది నెలలోనే వీరు పెళ్లి చేసుకోనున్నారనే టాక్ నడుస్తుంది.

ANN తెలుగు
# మహా పత్రిక
WWW.MAHAADAILY.COM
సోమవారం, హైదరాబాద్ | 10-03-2025




# కప్పు కొట్టేశాం

## జియో హాట్‌స్టార్ రికార్డ్.. 84 కోట్లకు చేరిన వ్యూస్

భారత్ వర్సెస్ కివీస్ మధ్య మధ్య రసవత్తరంగా ఫైనల్ మ్యాచ్ సాగింది. ఈ మ్యాచ్‌ను క్రికెట్ ప్రియులు కోట్లలో చూశారు. పాకిస్తాన్‌తో మ్యాచ్‌లో భారత్ ఇన్నింగ్‌ను v 60కోట్ల మంది చూశారు. కివీస్‌తో ఫైనల్ మ్యాచ్‌ను 84 కోట్లకు పైగా చూశారు.

## రోహిత్ శర్మ సారథ్యంలో అద్వితీయ విజయం

- మనమే తిరుగులేని ఛాంపియన్స్
- అప్రతిహత విజయాలతో ఫైనల్ లో పాతికేళ్ల లెక్క సెట్ చేసిన టీమిండియా
- అదరగొట్టిన రోహిత్ శర్మ, శ్రేయాస్, అక్షర్
- టీమిండియాకు ప్రధాని మోదీ, రాహుల్, సీఎం రేవంత్ , మహేష్ గౌడ్, కిషన్ రెడ్డి అభినందనలు
- దేశవ్యాప్తంగా సంబురాలు.. బాణాసంచా కాల్చిన అభిమానులు

**మహా నెట్ వర్క్:** టీమిండియా చరిత్ర సృష్టించింది. పటిష్టమైన న్యూజిలాండ్‌ను ఓడించి సగర్వంగా ఛాంపియన్స్ ట్రోఫీని సాధించింది. పాతికేళ్ళపగ తీర్చుకుంది. రోహిత్ శర్మ సారథ్యంలో వరుసగా రెండో ఐసీసీ ట్రోఫీని గెలుచుకుంది. కోట్లాది మంది అభిమానులను మురిపించింది. టీమిండియా విజయానికి అభిమానులు ఉప్పొంగిపోయి దేశవ్యాప్తంగా సంబురాలు చేశారు. ఒకదశలో ఉత్కంఠ కలిగించినా ఛాంపియన్స్ ట్రోఫీ ఇండియా సొంతం అయింది. భయపెట్టినా కప్ ను మాత్రం టీమ్ ఇండియా కైవసం చేసుకుంది. రోహిత్ తరువాత వచ్చిన బ్యాట్స్ మెన్ వరుసగా వికెట్లు పోగొట్టుకోవడంతో మ్యాచ్ ఓడిపోతారేమో అన్న అనుమానాలు మొదలైన సమయంలో.. అవి మరింత బలపడకుండా కూల్ గా టీమిండియా బ్యాట్స్ మెన్లు పని కానిచ్చేశారు. పిచ్ స్పిన్నర్లకు అనుకూలంగా ఉండడంతో బ్యాట్స్ మెన్ కు కాస్త కష్టంగా మారింది. మొదట బ్యాటింగ్ చేసినవాళ్ళకు కాస్త బాగానే ఉన్నా...లక్ష్య ఛేదనకు వచ్చిన ఇండియాకు మాత్రం బ్యాటింగ్ చేయడం చాలా కష్టమైంది. స్పిన్ బాగా తిరుగుతుండడంతో భారత బ్యాటర్లు ఆడటం ఇబ్బంది అయింది. పరుగులు రాబట్టకోవడం మాట అటుంచి...వికెట్ ను కాపాడుకోవడమే పెద్ద పని అయింది. కానీ మొత్తానికి భారత బ్యాటర్లు ఏ దశలోనూ ప్రత్యర్థికి మ్యాచ్ అప్పగించకుండా.. అదరగొట్టారు. అద్వితీయ విజయాన్ని అందించారు. అందుకే దేశమంతా జయహో టీమిండియా అంటూ జేజేలు పలుకుతోంది.



## అభినందనల వెల్లువ

టీమిండియా అద్వితీయ విజయానికి ప్రధాని మోదీ, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి , పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మంత్రులు సీతక్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి తదితరులు హర్షం వ్యక్తం చేశారు. సమిష్టి ప్రయత్నంతో టీమిండియా అద్వితీయ విజయాన్ని అందుకుందని అభినందించారు.

## గెలిపించాడయ్యా.. రోహిత్

రోహిత్ శర్మ సారథ్యంలో వరుసగా రెండో ఐసీసీ ట్రోఫీని గెలుచుకుంది. కోట్లాది మంది అభిమానులను మురిపించింది. ఓపెనర్‌గా బరిలోకి దిగిన రోహిత్ శర్మ (83 బంతుల్లో 76) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడి ఛేజింగ్‌ను సులభం చేశాడు. మిడిలార్డర్‌లో శ్రేయస్ అయ్యర్ (48), అక్షర్ పటేల్ (29), కేఎల్ రాహుల్ (34) రాణించడంతో టీమిండియా టార్గెట్‌ను ఛేదించింది.

## అసాధారణ ఆట... అసాధారణ ఫలితం

**టీమిండియా విజయంపై ప్రధాని మోదీ స్పందన**



దుబాయ్ లో జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో టీమిండియా విజయం సాధించడంతో యావత్ భారవతాని పులకించిపోయింది. వన్డే ఫార్మాట్ లో నిర్వహించిన ఈ టోర్నీలో టీమిండియా ఛాంపియన్ గా అవతరించింది. దీనిపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. ఒక అసాధారణ ఆట... ఒక అసాధారణ ఫలితం అంటూ టీమిండియా గెలుపును కీర్తించారు. "ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీని ఇంటికి తీసుకువస్తున్న మన క్రికెట్ టీమ్ ప్రదర్శన పట్ల గర్విస్తున్నాను. టోర్నీ ఆసాంతం అద్భుతంగా ఆడారు. అమోఘమైన ఆల్ రౌండ్ షోతో అలరించిన మన జట్టుకు శుభాభినందనలు" అంటూ మోదీ సోషల్ మీడియాలో పేర్కొన్నారు.

## ఆరంభం అదుర్స్

252 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియాకు కెప్టెన్ రోహిత్ శర్మ అద్భుతమైన ఆరంభాన్ని అందించాడు. శుభ్‌మన్ గిల్ (31)తో కలిసి తొలి వికెట్‌కు ఏకంగా 105 పరుగులు జోడించాడు. టీమిండియా విజయం లాంఛనమే అనుకున్న దశలో శాంట్నర్ తొలి బ్రేక్ ఇచ్చాడు. గ్లెన్ ఫిలిప్స్ పట్టిన అద్భుతమైన క్యాచ్‌కు గిల్ అవుటయ్యాడు. ఆ వెంటనే కోహ్లీ (1)ని బ్రేస్‌వెల్ వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. ఆ తర్వాత కొద్ది సేపటికే రోహిత్.. రచిన్ బౌలింగ్‌లో స్టంప్ అవుటయ్యాడు. ఆ తర్వాత అయ్యర్, శ్రేయస్ మరోసారి చక్కటి సమన్వయంతో భాగస్వామ్యం నెలకొల్పారు. 60 పరుగులకు పైగా భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఆ తర్వాత వేగంగా ఆడే క్రమంలో హార్దిక్ పాండ్యా (18) అవుటయ్యాడు. ఆ తర్వాత కేఎల్ రాహుల్ (34 నాటౌట్), జడేజా (9 నాటౌట్) లాంఛనాన్ని పూర్తి చేశారు. న్యూజిలాండ్ బౌలర్లలో శాంట్నర్, బ్రేస్‌వెల్ రెండేసి వికెట్లు పడగొట్టారు. రచిన్ రవీంద్ర, జేమీసన్ ఒక్కో వికెట్ తీశారు. అంతకు ముందు టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 251 పరుగులు చేసింది. డారెల్ మిచెల్ (63), బ్రేస్‌వెల్ (53), రచిన్ రవీంద్ర (37), గ్లెన్ ఫిలిప్స్ (34) కీలక పరుగులు చేశారు. టీమిండియా బౌలర్లలో వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్ రెండేసి వికెట్లు దక్కించుకున్నారు. రవీంద్ర జడేజా, మహమ్మద్ షమీ ఒక్కో వికెట్ తీశారు.


## పగ తీరింది.. పక్కా రివేంజ్

టీమ్ ఇండియా వర్సెస్ న్యూజిలాండ్ జట్లు 25 ఏళ్ల తరువాత టైటిల్ పోరులో తలపడగా, నాటి పగకు టీమ్ ఇండియా ప్రతీకారం తీర్చుకుంది. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025 ఫైనల్ ఇండియా వర్సెస్ న్యూజిలాండ్ జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. ఈ రెండు జట్లు ఇదే ట్రోఫీ ఫైనల్ టోర్నీలో తలపడటం 25 ఏళ్ల తరువాత ఇదే. 2000 సంవత్సరం ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లో టీమ్ ఇండియాను 4 వికెట్ల తేడాతో ఓడించిన కివీస్ ట్రోఫీ సొంతం చేసుకుంది. ఆనాటి పగకు దీటైన సమాధానం ఇచ్చేందుకు టీమ్ ఇండియా సిద్ధమై నాలుగువికెట్ల తేడాతో ఘనవిజయం సాదించింది. రివేంజ్ తీర్చుకుంది.



## గర్వంతో ఉప్పొంగిపోయా

**టీమిండియా విజయంపై మహేష్ బాబు ఎమోషనల్ ట్వీట్**



సూపర్ స్టార్ మహేష్ బాబు టీమిండియాకు అభినందనలు తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ప్రిన్స్ ఎమోషనల్ ట్వీట్ చేశారు. ''మ్యాచ్ చూస్తూ గర్వంతో ఉప్పొంగిపోయా. ఛాంపియన్స్ ట్రోఫీని గెలుచుకున్నందుకు టీమిండియాకు భారీ అభినందనలు. నిజమైన ఛాంపియన్ మన టీమ్ ఇండియా'' అంటూ ఛాంపియన్స్ ట్రోఫీ విజేతగా నిలిచిన భారత్‌కు సూపర్ స్టార్ శుభాకాంక్షలు తెలిపారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020,
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com

## చదువుతోపాటు ఆటలు పోటీలు చాలా అవసరం

■ మాజీ మంత్రి దానం నాగేందర్




**మహా :** విద్యార్థులకు మానసిక వికాసంతో పాటు, శారీరక ఎదుగుదలకు క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని మాజీ మంత్రి ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు, శనివారం యూసఫ్ గూడ లోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో జరిగిన శ్రీనిధి, సాయిరాం గ్రూప్ ఆఫ్ స్కూల్స్ నిర్వహించిన స్పోర్ట్స్ కార్నివాల్ లో ఆయన ప్రసంగించారు, చాలాచోట్ల ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో ప్లేగ్రౌండ్స్ లేక విద్యార్థులకు సరైన ఆటల పోటీ నిర్వహించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు, గత వారం రోజులుగా వివిధ రకాల ఆటల పోటీ నిర్వహించి శనివారం బహుమతులు ప్రధానం చేశారు, 3000 మంది విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు, విద్యార్థులు వివిధ రకాల నృత్యాలతో అలరించారు, ఈ సందర్భంగా దానం నాగేందర్ మాట్లాడుతూ సాయిరాం, శ్రీనిధి గ్రూప్ మేనేజ్మెంట్ విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారన్నారు, పాఠశాలల చైర్మన్ నల్లపాటి వెంకటేశ్వరరావు రాజేశ్వరి దంపతులను అభినందించారు, ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ ఇంత పెద్ద కార్యక్రమం నిర్వహించి 3000 మంది విద్యార్థులను ఒకే చోట పోగుచేసి బహుమతులు ప్రధానం చేయడం గొప్ప విషయం అన్నారు, అంతర్జాతీయ స్థాయిలో బహుమతులు తేవడంలో భారతదేశం ఇంకా వెనుకబడి ఉందని, ఇలాంటి ఆటల పోటీలు ప్రభుత్వ, ప్రైవేటు అన్ని స్కూళ్లలో నిర్వహించి అంతర్జాతీయ స్థాయికి విద్యార్థులను ఎదిగేలా చేయాల్సిన అవసరం ఉందన్నారు, కార్యక్రమంలో సిబిఐ మాజీ డైరెక్టర్ జేడీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందిస్తూనే సామాజిక, నైతిక స్పృహ కలిగేలా భవిష్యత్తు తరాలకు మంచి సైంటిస్టులు, ఐఏఎస్, ఐపీఎస్ డాక్టర్లు, ఇంజనీర్లు అందించాల్సిన అవసరం ఉందన్నారు, సాయిరాం శ్రీనిధి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ అందుకు మరింత పట్టదలతో కృషి చేయాలన్నారు, ఈ కార్యక్రమంలో సాయిరాం, శ్రీనిధి స్కూల్స్ అధినేత నల్లపాటి వెంకటేశ్వరరావు శ్రీమతి రాజేశ్వరి, సంస్కృతి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ మంగళారపు లక్ష్మణ్, రాయల్ కాలేజెస్ కరస్పాండెంట్ జనార్దన్ రెడ్డి, శ్రీనిధి స్కూల్స్ కరస్పాండెంట్ కే,లక్ష్మణ్, శ్రీనివాస్ రెడ్డి, వివిధ పాఠశాలల ప్రిన్సిపాల్ పీఈటీలు, విద్యార్థిని విద్యార్థులు పలువురు తల్లిదండ్రులు పాల్గొన్నారు, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి

# తెలంగాణలో విద్యావిప్లవం

## రెసిడెన్షియల్ స్కూల్స్ తో నూతన అధ్యాయం

■ కార్పొరేట్ స్థాయికి ప్రభుత్వ విద్య..పేదలకు బంగారు భవిష్యత్తు
■ 11 వేల కోట్లతో యంగ్ ఇండియా స్కూల్స్
■ దేశానికి తెలంగాణ మార్గదర్శకం
■ టిఐఎంఎస్ హాస్పిటల్స్‌తో ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులు
■ పేదలకు సొంతింటి కల సాకారం



**హైదరాబాద్, మహా :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యను ఓ నూతన స్థాయికి తీసుకెళ్లే మార్గంలో అద్భుతమైన నిర్ణయం తీసుకుంది. దేశంలోనే మొట్టమొదటిసారిగా, ప్రభుత్వ రంగ విద్యను కార్పొరేట్ స్థాయికి తీసుకెళ్లే విప్లవాత్మక ప్రాజెక్ట్ - 'యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్' ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. రూ. 11 వేల కోట్ల భారీ బడ్జెట్‌తో ఈ స్కూల్స్ నిర్మాణానికి ఆదేశాలు జారీ అయ్యాయి. ఇప్పటికే మూడింటికి జీవోలు ఇచ్చి పనులు ప్రారంభించిన ప్రభుత్వం, మొత్తం 55 నూతన రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణానికి రెడీ అయ్యింది. విద్యా రంగంలో ఇంత విస్తృతమైన సంస్కరణ ఇప్పటి వరకు ఏ రాష్ట్రంలోనూ జరగలేదు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రం విద్యా అభివృద్ధిలో దేశానికే మార్గదర్శకంగా మారబోతోంది.

**తెలంగాణలో కార్పొరేట్ స్థాయి ప్రభుత్వ విద్య – అద్భుత ఆలోచనకు రూపకల్పన**

విద్య అంటే కేవలం చదువుకోవడం కాదు, ప్రపంచాన్ని శాసించే స్థాయికి విద్యార్థులను తీర్చిదిద్దటం అని తెలంగాణ ప్రభుత్వం స్పష్టంగా చెప్పకనే చెబుతోంది. ఈ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో కార్పొరేట్ స్థాయిలోనే మౌలిక వసతులు, విద్యా పద్ధతులు, ఆధునిక టెక్నాలజీ అందుబాటులోకి రాబోతున్నాయి. ప్రతి స్కూల్‌కు 23 ఎకరాల విస్తీర్ణం కేటాయించి, అందులో డిజిటల్ క్లాస్‌రూమ్స్, అత్యాధునిక ల్యాబ్స్, సైంటిఫిక్ లెర్నింగ్ మోడల్స్, స్పోర్ట్స్ ఫెసిలిటీస్ ఏర్పాటు చేయనున్నారు. టీచర్లు, విద్యార్థుల కోసం ప్రత్యేక హాస్టల్ వసతులు అందుబాటులోకి రానున్నాయి. గతంలో ప్రభుత్వ స్కూల్స్ అంటే తక్కువ స్థాయి అనుకునే రోజులు ఇక ముగిసాయి. తెలంగాణలో ప్రభుత్వ విద్యానికే బ్రాండ్ విలువ పెరిగేలా సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు.

**గత ప్రభుత్వ ఘోర తప్పిదాలు – కోళ్ల ఫాంలుగా మారిన రెసిడెన్షియల్ స్కూల్స్**

త ప్రభుత్వ హయాంలో రెసిడెన్షియల్ స్కూల్స్ అభివృద్ధికి చిత్తశుద్ధి లేకపోవడం వల్ల, అవి పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాయి. విద్యార్థుల భవిష్యత్తుపై శ్రద్ధ పెట్టాల్సిన స్థానంలో, అప్పటి పాలకులు తమ కోటలు, భవంతులు కట్టుకోవడానికే ప్రయాసపడ్డారు. పేద పిల్లల చదువులపై చిత్తశుద్ధి లేని వారే, రెసిడెన్షియల్ స్కూల్స్‌ను పశువుల షెడ్లు, కోళ్ల ఫాంలుగా మార్చారు. మునుపటి పాలకుల అవినీతిని ఎదుర్కొని, విద్యను అసలు స్థాయిలో తీసుకెళ్లే బాధ్యతను ప్రస్తుత ప్రభుత్వం తీసుకుంది. "గత పాలకులు నివసించడానికి కోటలు కట్టుకోవడం తప్ప, పేద పిల్లల కోసం అంకిత భావంతో పనిచేయలేదు. ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును ప్రపంచ స్థాయికి తీసుకెళ్లే దిశగా అడుగులు వేస్తోంది" అని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తీవ్రంగా విమర్శించారు.

**టి ఐ ఎం ఎస్ హాస్పిటల్స్ – ఆరోగ్య రంగంలో తెలంగాణ మోడల్లె**

లంగాణ ప్రభుత్వం విద్యతో పాటు ఆరోగ్య రంగంలోనూ విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటోంది. రాష్ట్రవ్యాప్తంగా నాలుగు టీఐఎంఎస్ హాస్పిటల్స్ నిర్మాణం వేగంగా జరుగుతోంది. వచ్చే డిసెంబర్ నాటికి రెండు టీఐఎంఎస్ హాస్పిటల్స్ ప్రారంభం కానుండగా, మరో రెండు వచ్చే ఏడాదిలో ప్రారంభించేందుకు ప్రణాళిక సిద్ధమైంది. ఇది పూర్తయితే తెలంగాణ ప్రజలకు అత్యాధునిక వైద్యం ప్రభుత్వ ఖర్చుపై అందుబాటులోకి రానుంది. హాస్పిటల్స్ పూర్తికావడంతో క్యాన్సర్, కిడ్నీ, గుండె జబ్బులు వంటి ప్రాణాంతక వ్యాధులకు చికిత్స ఖరీదుగా ఉండదని, పేద ప్రజలు ఆర్థిక భారం లేకుండా హైఎండ్ ట్రీట్మెంట్ పొందేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రకటించారు.

**ఇళ్ల నిర్మాణ ప్రాజెక్ట్ – పేదలకు సొంత గృహం కలగొండుగా మారే రోజు**

పేదలకు సొంత గృహం కలను సాకారం చేసేలా ప్రభుత్వం గృహ నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టింది. వచ్చే ఏడాది ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇండ్ల లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. అభివృద్ధి అంటే కేవలం ఓ మాట కాదని, ప్రతిసారీ నడుము బిగించి ప్రజల కోసం పనిచేయాల్సిందేనని ప్రభుత్వం నిరూపిస్తోంది.

**ప్రతిపక్షానికి అభివృద్ధి కనబడడం లేదా? అసూయతోనే విమర్శలు!**

ప్రభుత్వం అన్ని రంగాల్లో విప్లవాత్మక సంస్కరణలు తీసుకురాగానే, ప్రతిపక్ష నేతలు విమర్శల మోత మోగించడానికి సిద్ధమయ్యారు. అభివృద్ధిపై చర్చించలేని స్థితిలో, కేవలం విమర్శలకే పరిమితం అవుతున్నారని మంత్రులు మండిపడ్డారు. "వాళ్లకు అభివృద్ధి గురించి చర్చించటానికి అర్హత ఉందా? తమ పాలనలో ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటే, ఈ రోజు తెలంగాణ పరిస్థితి ఎలా ఉండేది?" అని మంత్రులు ఘాటుగా ప్రశ్నించారు. "ప్రభుత్వ హామీలన్నీ నెరవేర్చుతాం. ప్రతిపక్ష నేతలు పొగడకపోయినా ఫర్వాలేదు, కానీ విమర్శించాల్సిన అవసరం ఏమిటి?" అని మంత్రి పొంగులేటి వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష నేతలకు మాత్రం అసూయే ఎక్కువ అయిందని విమర్శించారు.

**తెలంగాణ అభివృద్ధి – దేశానికి మార్గదర్శకం**

విద్య, ఆరోగ్యం, గృహ నిర్మాణం - మూడు రంగాల్లోనూ తెలంగాణ ప్రభుత్వం దేశానికి ఆదర్శంగా నిలుస్తోంది. దేశంలోనే మొట్టమొదటిసారిగా ప్రభుత్వ విద్యను కార్పొరేట్ స్థాయికి తీసుకెళ్లే 'యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్' రూపుదిద్దుకుంటున్నాయి. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు విశ్వప్రయత్నాలు చేస్తోంది.

## ఉప్పల్‌కు మంత్రి శ్రీధర్ బాబు 11న రాక



**ఉప్పసల్, మహా :** రాష్ట్రంలో అభివృద్ధినే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి అన్నారు.సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో చేపట్టే సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులతో రాష్ట్రం అన్ని రంగాలలో పురోగతిని సాధిస్తుందన్నారు.ఉప్పల్ ,రామంతాపూర్ డివిజన్ లో రూ.43.27 కోట్ల నిధులతో చేపట్టే పలు అభివృద్ధి పనుల శంఖు స్థాపనకు రాష్ట్ర మంత్రి, జిల్లా ఇంఛార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు రానున్నట్టుగా చెప్పారు.ఆదివారం ఉప్పల్ లోని వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఇంఛార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి, చెర్లపల్లి ,ఉప్పల్ కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి గారు ,మందుముల రజితాపరమేశ్వర్ రెడ్డి, పలువురు కాంగ్రెస్ నాయకులు మాట్లాడారు. రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉప్పల్ నియోజకవర్గం అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో రూ.240 కోట్లతో పలు అభివృద్ధి పనులను చేపట్టినట్లుగా చెప్పారు. ఉప్పల్ డివిజన్ లో రూ.43.27 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనుల శంఖు స్థాపన ఈనెల 11న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చేతుల మీదుగా జరుగుతాయన్నారు.కార్యక్రమంలో టీపీసీసీ ప్రతినిధి తౌఫిక్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు అగి రెడ్డి, కృష్ణ రెడ్డి,ఉప్పల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకారపు అరుణ్ ,ఉప్పల్ డివిజన్ అధ్యక్షులు బాకారం లక్ష్మణ్ ,సుర్వి మురళి గౌడ్ ,తావిడబోయిన గిరి బాబు ,శ్రవణ్ రెడ్డి ,HR మోహన్ ,గరిక సుధాకర్, చెన్ రెడ్డి రఘుపతి రెడ్డి,లింగంపల్లి రామకృష్ణ,తెల్కల మోహన్ రెడ్డి ,కొంపల్లి బాలరాజ్ ,అమరేశ్వరి,ఆగం రెడ్డి ,ఉప్పల్ ,రామంతాపూర్ ,చిల్కానగర్ ,నాచారం ,హబ్సిగూడ ,మల్లాపూర్ ,కాప్రా డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు

## టెంట్ హౌస్ ప్రారంభించిన పైళ్ల సోమిరెడ్డి



**మోత్కూర్, మహా :** యాదాద్రి భువనగిరి మోత్కూర్ మున్సిపాలిటీ 7వ వార్డు, పద్మశాలిని కాలనీలో శ్రీ లక్ష్మీనారాయణ టెంట్ హౌస్ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు పైళ్ల సోమిరెడ్డి రిబ్బన్ కట్ చేసి, టెంట్ హౌస్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా పైళ్ల సోమిరెడ్డి మాట్లాడుతూ, ప్రాంత ప్రజలకు అవసరమైన వేదికలు, టెంట్ సేవలు అందుబాటులోకి రావడం హర్షణీయమైన విషయంమన్నారు. ఈ టెంట్ హౌస్ వివాహాలు, శుభకార్యాలు, ఇతర కార్యక్రమాలకు మెరుగైన సేవలను అందిస్తుందని ఆశిస్తున్నాను, అని తెలిపారు.అంతేగాక, స్థానిక నాయకులు, కుటుంబ సభ్యులు కూడా హాజరై టెంట్ హౌస్ యజమాని కొక్కుల సత్యనారాయణకు అభినందనలు తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎండి సమిరుద్దీన్, పాచికంటి లక్ష్మీన నరసయ్య, వేముల నర్సయ్య, రేగోటి సత్యనారాయణ, రేగోటి శ్రీనివాస్, మైనారిటీ నాయకులు ఎండి మునిరుద్దీన్, ఖలీల్, అమీర్, ఎండి షాకిరుద్దీన్, అబ్బాస్, జానీ, కయ్యుం, జంగీర్ పాషా పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందజేత



**మోత్కూర్, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మున్సిపల్ పరిధిలోని పనకబండ గ్రామానికి చెందిన మామిడి స్వామి కొన్ని రోజుల క్రితం అనారోగ్యానికి గురి కావడం జరిగింది. ఇది తెలుసుకున్న గ్రామ కాంగ్రెస్ నాయకులు మంత్రి కోమటి రెడ్డి,మన స్థానిక ఎమ్మెల్యే మందుల సామేలు, దృష్టికి తీసుకవెళ్ళడం జరిగింది. వారు వెంటనే స్పందించి సీఎం రిలీఫ్ ఫండ్ ను 34,000వేల రూపాయల చెక్ ను రిలీజ్ చేయడం జరిగింది. ఈ చెక్ ని స్థానిక గ్రామ కాంగ్రెస్ నాయకులు వారి ఇంటికి వెళ్ళి వారి కుటుంబనికి ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు బత్తిని ధర్మయ్య గౌడ్, సింగిల్ విండో డైరెక్టర్ కారుపాతుల ముత్యాలు, మాజీ సర్పంచ్ సుధగాని పాండు, మాజీ ఉప సర్పంచ్ ముక్కముల సొమేష్, సీనియర్ నాయకులు బత్తిని గోపాల్,లోతుకుంట దేగయ్య, బత్తిని శేఖర్,లోతుకుంట గిరి, బత్తిని తిరుమలేష్,కలిమెర రామచంద్రు, పొన్నెబొయిన యాదగిరి,వల్లందాసు పృధ్వీ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో ప్రైవేట్ టీచర్ల సమస్యలను పరిష్కరించాలి



**హుజూర్ నగర్, మహా:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రైవేట్ టీచర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు గొట్టే నాగరాజు అన్నారు. ఆదివారం హుజూర్ నగర్ టౌన్ హాల్లో జరిగిన ప్రైవేట్ టీచర్స్ సమావేశానికి ముఖ్య అధితిగా హాజరైన నాగరాజు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేట్ టీచర్లకు అన్ని రకాల ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని కోరుతూ గతంలో రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి వినతి పత్రాలు ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు రాష్ట్రంలోని ప్రైవేట్ టీచర్ల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళి సమస్యల పరిష్కారానికి మంత్రి ఉత్తమ్ కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ సభ్యులకు ఐడి కార్డులు అందించి అసోసియేషన్ సభ్యులను సన్మానించారు.ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొట్టే నాగమణి యాదవ్, జిల్లా అధ్యక్షులు మన్నెం నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి మందుల రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షులు ప్రకాష్, జిల్లా నియోజకవర్గ అధ్యక్షులు శ్రీనివాసచారి, ప్రధాన కార్యదర్శి కృష్ణకుమారి, విజయ్ కుమార్, ప్రచార కార్యదర్శి కవిత, సహాయ కార్యదర్శులు నాగేంద్రబాబు, సునీత, వీరబాబు, కోటేశ్వరరావు అసోసియేషన్ సభ్యులు సరిత, కరుణ, పద్మావతి,నవీన్, వెంకటేశ్వర్లు, రాధిక, కోటేశ్వరి, షబానా, కృష్ణ, భవాని, ప్రశాంతి, హేమలత,శిరీష, నాగవీర, దివ్య, రుకాసన, ఉమామహేశ్వరి, రమణ, శృతి, నాగలక్ష్మి, నవీన్ కుమార్, సోనియా, పుష్ప, వరలక్ష్మి, రాహుల్, వినోద, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## నిర్మానుష్య ప్రాంతాలలో తిరగవద్దు - సీఐ జగదీష్

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** నిర్మానుష్య ప్రాంతాలలో తిరగవద్దు అంటూ ఇబ్రహీంపట్నం సీఐ జగదీష్ ప్రజలను హెచ్చరించారు. రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధి, మంగళపల్లి పరిధిలోని, నాగార్జునసాగర్ రోడ్డు సోమలాయ గుట్ట నుండి బ్రాహ్మణపల్లి వరకు, కోహెడ రోడ్డులో నిర్మానుష్య ప్రాంతం ఎక్కువగా ఉండడంతో ప్రజలు మార్గమధ్యంలో వాహనాలు నిలిపి కాలకృత్యాలకు గాని ఇంకేదైనా అవసరాలకు గాని ఆగకూడదని తెలియజేశారు.

## గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలు



**మహా :** విజ్ఞాన సమూపార్జనకు ఏకైక నిలయం గ్రంథాలయం. వివిధ రకాల పుస్తకాలతో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడం వలన గ్రంథాలయాలకు వచ్చి చదువుకునే వారికి చాలా సౌలభ్యంగా ఉంటుందని, సమాచారం అంతా ఒక్కచోటే క్రోడీకృతమై ఉంటుందని, తద్వారా విజ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలు చాలా దోహదం చేస్తాయని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కేశంపేట మండలం పాపిరెడ్డి గూడెం నూతన గ్రంథాలయ భవన నిర్మాణం కోసం భూమి పూజ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్వయంగా పలుగు పట్టి భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ భూమి పూజ కార్యక్రమంలో కేశంపేట మండలం మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశాల శ్రవణ్ రెడ్డి మాట్లాడుతూ పాపిరెడ్డి గూడ లో గ్రంథాలయ నిర్మాణం పనులు ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని, గ్రంథాలయాలు ఏర్పాటు వలన ప్రజలందరికీ ఒకే చోట చదువుకోవడానికి అన్ని రకాల పుస్తకాలు లభిస్తాయని, తద్వారా ప్రజలందరిలో విజ్ఞానం పెరుగుతుందని అన్నారు. అలాగే నిరక్షరాసులకు కూడా చదువుకోవాలనే తపన పెరుగుతుందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలతో పాటు పాపిరెడ్డి గూడ గ్రామస్తులు పాల్గొన్నారు.

## నిజనిజాలు నిర్ధారించుకోవాలి

■ తప్పుడు వార్తలు రాస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయి
■ కృష్ణ తండా కార్యదర్శి పై ఆరోపణలు
■ ఖండించిన ఎంపీడీవో జగదీష్ కుమార్
■ పారిశుద్ధ్యం పనులలో కార్యదర్శి పనితనం మంచిగానే ఉంది గ్రామస్తులు
■ కార్యదర్శి పై కావాలనే నిరాధార ఆరోపణలు చేస్తున్నారు
■ మాజీ ప్రజా ప్రతినిధులు



**హుజూర్ నగర్, మహా:** పాత్రికేయులు తప్పుడు వార్తలు రాస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని ఎంపీడీవో జగదీష్ కుమార్ అన్నారు. సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం కృష్ణ తండా గ్రామపంచాయతీలో పారిశుద్ధ్యం మరియు పంచాయతీ విధుల నిర్లక్ష్యంపై గత పది రోజులుగా వివిధ ఆన్లైన్ పత్రికల యందు వచ్చిన వార్తలపై విచారణ గురించి మండల ఎంపీడీవో జగదీష్ కుమార్ గ్రామ పంచాయతీని సందర్శించి, గ్రామ ప్రజలను వివరాలు అడిగి తెలుసుకొని, క్షేత్రస్థాయి పరిశీలన చేసి నివేదికను ఉన్నత అధికారులకు సమర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో జగదీష్ కుమార్ మాట్లాడుతూ విచారణ సందర్భంగా గ్రామానికి చెందిన వివిధ వ్యక్తులను, మాజీ ప్రజా ప్రతినిధులను విచారణ చేయడం జరిగిందని సంబంధిత పంచాయతీ కార్యదర్శి లక్ష్మి పార్వతి విధుల పట్ల నిర్లక్ష్యం వ్యవహరించిన అంశాలు మరియు పారిశుద్ధ్యనికి సంబంధించి పత్రికలో వచ్చిన వార్తలు పూర్తి నిరాధారముగా ఈ విచారణలో తేలింది. ముఖ్యంగా గ్రామానికి సంబంధంలేని ఎక్కడో ఉన్న ఫోటోలను చూపించి గ్రామంలో ఈ పరిస్థితి ఉన్నది అని వార్తలు రాయడం జరిగింది. అలాగే పంచాయతీ కార్యదర్శి ఈ గ్రామంతో పాటు ఇన్చార్జిగా రామచంద్రపురం గ్రామానికి వెళ్లి పారిశుధ్యం, హరిత హారం, నర్సరీలు, పన్నుల వసూలు ఇతర పనులు చేయడం జరుగుతున్నట్లు ఇట్టి విచారణలో కనుగొనడం జరిగింది. మాకు జర్నలిస్టులు అంటే ఎంతో గౌరవం ఉందనీ ఎందుకంటే ప్రభుత్వానికి ప్రజలకు మధ్యన వారధిగా ఉంటూ ప్రభుత్వం నుంచి వచ్చే మంచి పనులను ప్రజలకు చేరువ చేయడంలో జర్నలిస్టుల పాత్ర అభినందనీయం. కానీ ఈ మధ్యకాలంలో ఎవరో ఒకళ్ళు డబ్బులు డిమాండ్ చేయడం, ఇవ్వకపోతే మీ మీద నెగిటివ్గా వార్తలు రాస్తామని బెదిరించడం అలవాటై పోయింది. ఇటువంటి చర్యని మేము పూర్తిగా ఖండిస్తున్నాము. మరొకసారి ఇటువంటి నిరాదార ఆరోపణలు రాసి మీరు ఇబ్బంది పాలు కాకూడదని, లేకపోతే నిరాధార ఆరోపణలు చేస్తే వారిపై తప్పకుండా ప్రభుత్వం తరపున చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో సదరు నెగటివ్ వార్త రాసిన విలేకరిని హెచ్చరించడం జరిగింది.

**అజ్మీర గోపి కృష్ణ తండా గ్రామస్తులు**

పంచాయతీ కార్యదర్శి విధులలో నిర్లక్ష్యంగా వివరించడం జరగలేదని, ఉద్దేశపూర్వకంగానే సదరు విలేకరి వార్తలు రాస్తూ పంచాయతీ కార్యదర్శిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని అజ్మీర గోపి వివరించారు.

**భూక్య బాలాజీ గ్రామస్తుడు**

పంచాయతీ కార్యదర్శి విధుల పట్ల నిర్లక్ష్యం వహించడం ఎప్పుడు జరగలేదని ప్రతిరోజు గ్రామాన్ని సందర్శించడం అలాగే ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల ప్రకారం ప్రజలకు అందుబాటులో ఉంటూ విధులు నిర్వహిస్తున్నారు. అని ఈ సందర్భంగా భూక్య బాలాజీ ఎంపీడీవోకు తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణ తండా గ్రామ పెద్దలు, ప్రజలు, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

**బానోతు రామారావు, మాజీ సర్పంచ్, కృష్ణ తండా**

పంచాయతీ కార్యదర్శి ప్రతిరోజు గ్రామాన్ని సందర్శించి, పంచాయతీ సిబ్బందితో పారిశుద్ధ్య పనులు చేయించడం. నర్సరీ నిర్వహణల మరియు పన్నుల వసూలు తో పాటుగా ఇతర ప్రభుత్వ కార్యక్రమాలలో పాల్గొనడం జరుగుతున్నది. ఎవరి పట్ల అమర్యాదగా ప్రవర్తించడం ఇప్పటివరకు జరగలేదని విచారణ సందర్భంగా వాంగ్మూలం ఇచ్చారు.

**బానోతు శంకర్, యువ నాయకులు, కృష్ణ తండా**

పంచాయతీ కార్యదర్శి ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ అన్ని ప్రభుత్వ కార్యక్రమాలతో పాటుగా పారిశుధ్యం సక్రమంగా నిర్వహించేలా గ్రామపంచాయతీ సిబ్బందితో పని చేయించడం జరుగుతున్నది. పత్రికలలో వచ్చిన వార్తలు అంతా నిరాధారమని అట్టి ప్రదేశాలు అసలు తమ గ్రామానికి చెందినవి కావనీ కావాలనే ఉద్దేశపూర్వకంగా పంచాయతీ కార్యదర్శి మీద ఇబ్బంది పెట్టేలా సదరు పత్రిక విలేకరి వ్యవహరించడం గతంలో కూడా జరిగినది అని శంకర్ వివరించారు.

